
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 335

SUNDAY Special | ఆదివారం | 25-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'అమ్మ'ల వనప్రవేశం

మేడారం మహాజాతర ముగిసింది. నాలుగు రోజులుగా సుమారు కోటిన్నర మంది భక్తుల మొక్కులందుకున్న వన దేవతలు శనివారం సాయంత్రం వన ప్రవేశం చేశారు. బుధవారం తిరుగువారం పండుగ జరగనుంది.

5లో

◀ సమ్మక్కను వనప్రవేశానికి తీసుకెళ్తున్న పూజారులు



అమాయకుల ఇళ్లపైకే బుల్డోజర్లు

బుల్డోజర్లతో అమాయకుల ఇళ్లను కూల్చివేస్తున్నారని, నేరగాళ్లు నిక్షేపంగా తప్పించుకుంటున్నారని ప్రియాంకాగాంధీ మండిపడ్డారు.

- వివరాలు 6లో



ఐదో వంతు జీవ జాతులు..

గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులతో ఐదో వంతు వలస జీవులు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఐరాస హెచ్చరించింది.

- వివరాలు 6లో



జూలై 1 నుంచి 'భారత' చట్టాలు

భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయి.

- వివరాలు 6లో



జాహ్నవి కేసుపై పునఃసమీక్ష

జాహ్నవి కేసులో 'ప్రాసిక్యూషన్' నిర్ణయాన్ని పునసమీక్షించాలని అక్కడి భారత కాన్సులేట్ కార్యాలయం పోలీసు విభాగాన్ని కోరింది.

- వివరాలు 6లో

ఐదెకరాలా.. పదెకరాలా?

రైతు భరోసాకు సీలింగ్ పెట్టే యోచనలో సర్కారు

ఐదెకరాలకే పరిమితం చేయాలని అధికారుల సూచన

ఐటీ రిటర్నీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, సెలబ్రిటీలకు నో

మార్గదర్శకాల రూపకల్పనలో వ్యవసాయ శాఖ అధికారులు బిజీ..

త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక

సర్కారు నిర్ణయం ఆధారంగా వచ్చే వానాకాలం నుంచే రైతు భరోసా!



సాక్షి, హైదరాబాద్: రైతులకు పంట పెట్టుబడి కోసం ఆర్థిక సాయం అందించే రైతుభరోసా (రైతు బంధు) పథకానికి సీలింగ్ విధించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సాయాన్ని ఐదెకరాలకా లేదా పదెకరాలకా.. ఎంతకు పరిమితం చేస్తే బాగుంటుందన్న దానిపై తర్జనభర్జన పడుతోంది. ఐదెకరాలకే పరిమితం చేస్తే బాగుంటుందని అధికారులు సూచిస్తున్నట్లు సమాచారం. అంతేగాకుండా ఆదాయ పన్ను చెల్లిస్తున్నవారు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సెలబ్రిటీలకు రైతుభరోసా ఇవ్వకూడదని భావిస్తున్నట్లు తెలిసింది. ఇటీవలి బడ్జెట్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధును పునఃసమీక్షిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పథకంతో అనర్హులు కూడా లబ్ధి పొందుతున్నారన్నది కొత్త సర్కారు ఉద్దేశం. దీనికి అనుగుణంగా ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు ఢిల్లీలోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్'ను సంప్రదించారు. ఉపగ్రహ చిత్రాల ద్వారా సాగు, బీడు భూములను గుర్తించి.. ఆ వివరాల ఆధారంగా రైతు పెట్టుబడి సాయానికి పరిమితులు విధించనున్నారు. దీనిపై మార్గదర్శకాలను రూపొందించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా వచ్చే వానాకాలం సీజన్ నుంచి కొత్త మార్గదర్శకాల ప్రకారం రైతుభరోసా అమలులోకి రానుంది.

ఇచ్చే మొత్తం పెంచినా...

రైతుబంధు పథకం 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. మొదట్లో ప్రతీ సీజన్‌కు ఎకరాకు రూ.4 వేల చొప్పున రైతులందరికీ ఇచ్చారు. ఇలా ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.8 వేల చొప్పున అందేవి. తర్వాత ఈ సొమ్మును ప్రభుత్వం సీజన్‌కు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ. 10 వేలు చేసింది. అంటే రెండు సీజన్లు కలిపి 1.52 కోట్ల ఎకరాలకు చెందిన 68.99 లక్షల మంది రైతులకు ఏటా సుమారు రూ.15,250 కోట్లు అందజేశారు. కాంగ్రెస్ సర్కారు రైతుభరోసా కింద ఎకరాకు ఏటా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. ఈ లెక్కన 1.52 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ.22,800 కోట్లు అవుతుంది. అలా కాకుండా ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతులనే పరిగణనలోకి తీసుకుంటే.. పెట్టుబడి సాయం అందుకుంటున్న రైతుల్లో వారు 62.34 లక్షల మంది ఉన్నారు. అంటే.. మొత్తం లబ్ధిదారుల్లో 90.36 శాతం. వీరికి మాత్రమే రైతుభరోసా పరిమితం చేయాలనుకుంటే.. రూ. 15వేల కోట్లు ఇస్తే

మిగతా 2వ పేజీలో ▶

మల్కాజిగిరి బరిలో ఈటల?

8 ఎంపీ సీట్లలో అభ్యర్థిత్వాలపై ఏకాభిప్రాయం.. వీటిలో మూడు చోట్ల సిట్టింగ్‌లే ఖరారు!

- రాష్ట్ర ముఖ్య నేతలతో నడ్డా, అమిత్ షా కీలక భేటీ
- 29న పార్లమెంటరీ పార్టీ భేటీలో 8–9 పేర్లు ప్రకటించే అవకాశం



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల సంసిద్ధతలో భాగంగా బీజేపీ కోర్ కమిటీ తెలంగాణలో పార్టీ బలాబలాలపై రాష్ట్ర నాయకత్వంతో మేధోమథనం చేపట్టింది. పార్టీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితా విడుదలకు సంబంధించి కసరత్తు నిర్వహించింది. శనివారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్... తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహా ఇతర కీలక నేతలతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లలో పార్టీ పరిస్థితిపై నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. అభ్యర్థుల ఎంపికపై ప్రాథమిక కసరత్తు పూర్తి చేసినట్లు పార్టీ వర్గాల విశ్వసనీయ సమాచారం. ముఖ్యంగా సికింద్రాబాద్–జి.కిషన్‌రెడ్డి, కరీంనగర్–బండి సంజయ్, నిజామాబాద్–ధర్మపురి అర్వింద్, మహబూబ్‌నగర్–డీకే అరుణ, చేవెళ్ల–కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి–ఈటల రాజేందర్, మెదక్–ఎం.రఘునందన్‌రావు, భువనగిరి–బూర నర్సయ్యగౌడ్ అభ్యర్థిత్వాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైనట్టుగా పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆయా పేర్లకు నడ్డా, షా ఆమోదముద్ర వేసినట్లు సమాచారం. ఇవి కాకుండా మరో రెండు సీట్లలోనూ విజయావకాశాలు మెండుగా ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 29న జరిగే బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీ తర్వాత 8 లేదా 9 స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరిగిందని, గతంలో ఓడిపోయిన స్థానాల్లో పార్టీ బలం పుంజుకుందని ఈ భేటీలో రాష్ట్ర నేతలు పార్టీ పెద్దలకు వివరించినట్లు సమాచారం. ఐకమత్యంతో పనిచేసి రాష్ట్రంలోని 17 స్థానాల్లో విజయం సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని వారు రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేశారని తెలిసింది. ఈ సమావేశంలో పార్టీ నేతలు బండి సంజయ్, కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు.

మెజారిటీ సీట్లు గెలుస్తాం: కె. లక్ష్మణ్

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మెజారిటీ సీట్లు గెలుస్తామని.. గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ చెప్పారు. పార్టీ జాతీయ నేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో యాత్రలు, సభలపై అగ్రనేతలతో చర్చ జరిగిందన్నారు.

న్యూస్‌రీల్

వీఐపీల డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు: పొన్నం



రాష్ట్రంలోని వీఐపీల డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి నేపథ్యంలో రవాణా శాఖ సుమోటోగా ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. వీఐపీలంతా తమ డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని కోరుతూ లేఖలు రాస్తామన్నారు.

- వివరాలు 3లో

గొర్రెల స్కాంపై కేంద్రం విచారణ



రాష్ట్రంలో చోటుచేసుకున్న గొర్రెల స్కాంపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపడుతుందని కేంద్ర మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా ప్రకటించారు. కుంభకోణంలో ప్రమేయం ఉన్న వారందరిపై చర్యలు తీసుకుంటామని, ఈ వ్యవహారంలో అవినీతికి పాల్పడిన అధికారుల పేర్లు పబ్లిక్ డొమైన్‌లో పెడతామని ఆయన వెల్లడించారు.

- వివరాలు 3లో

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్



రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. బోరుబావుల కింద వేసిన యాసంగి పంటలను రక్షించుకోవడానికి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ నెల 23న రాష్ట్రంలో 15,031 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. గతేడాది సరిగ్గా ఇదేరోజు 14,526 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ మాత్రమే నమోదైంది.

- వివరాలు 3లో



'ధరణి' దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

- ధరణి పోర్టల్ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- ఆర్‌వోఆర్ చట్టంలోనే లోపాలు ఉన్నాయని నివేదించిన ధరణి కమిటీ
- వీలుంటే చట్టసవరణ చేద్దామని లేదంటే కొత్త చట్టం తెద్దామన్న సీఎం
- తహసీల్దార్ ఆఫీసుల్లో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు

2లో

ప్రేమవేధింపులకు విద్యార్థిని బలి

రంగారెడ్డి జిల్లా ఆకులమైలారంలో ఘటన



- వివరాలు 5లో

భలే మాంచి చౌక బేరమూ!

జనసేనతో చంద్రబాబు డీల్

- కేవలం 24 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలు
- నిరాశ, నిస్పృహల్లో జనసైనికులు
- ఊరించి ఉసూరుమనిపించారని ఆగ్రహం
- ఐదుగురి పేర్లు మాత్రమే ప్రకటించిన పవన్
- 94 అసెంబ్లీ అభ్యర్థుల పేర్లతో టీడీపీ జాబితా
- భయపడ్డట్టుగానే బలహీనత బహిర్గతం

10లో



టీడీపీ, జనసేన అభ్యర్థుల జాబితాలతో పవన్ కల్యాణ్, చంద్రబాబు

రాష్ట్రంలో రూ.621 కోట్ల రైల్వే అభివృద్ధి పనులు

రేపు జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ


- 15 అమృత్ భారత్ స్టేషన్లు, 17 రైల్ ఫ్లైఓవర్, అండర్‌పాస్‌ల నిర్మాణానికి శ్రీకారం
- ప్రధాని మోదీ, రైల్వే మంత్రికి కిషన్‌రెడ్డి ధన్యవాదాలు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రూ.621 కోట్ల విలువ చేసే పలు రైల్వే అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ నెల 26న దేశవ్యాప్తంగా 500కు పైగా అమృత్ భారత్ స్టేషన్లు, దాదాపు 1,500 రైల్ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లలో నిర్మాణం పూర్తయిన వాటిని జాతికి అంకితం చేయనుండగా, కొత్తవాటికి భూమిపూజ చేయనున్నారు. అందులో తెలంగాణలో రూ.230 కోట్లకు పైగా నిధులతో 15 అమృత్ భారత్ స్టేషన్లు, రూ.169 కోట్లకు పైగా నిధులతో నిర్మించనున్న 17 రైల్ ఫ్లైఓవర్, అండర్ పాస్‌లకు ప్రధాని భూమి పూజ చేయనున్నారు. వీటితోపాటు రూ.221.18 కోట్లతో పూర్తి చేసిన మరో 32 రైల్

మిగతా 3వ పేజీలో ▶

ఇతంజేకత్



జేఎల్, డీఎల్ తుది జాబితా నేడే

కసరత్తు పూర్తి చేసిన గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ (జేఎల్), డిగ్రీ లెక్చరర్ (డీఎల్) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా ఆదివారం సాయంత్రం విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్‌ఈఐఆర్‌బీ) కసరత్తు పూర్తి చేసింది. జూనియర్ లెక్చరర్ కేటగిరీలో 1,924 కొలువులు, డిగ్రీ లెక్చరర్ కేటగిరీలో 793 పోస్టులున్నాయి. వాటికి సంబంధించి గతేడాది ఆగస్టులో గురుకుల బోర్డు పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల 'కీ'లను

మిగతా 5వ పేజీలో ▶

317 జీవోపై కేబినెట్ సబ్ కమిటీ

- చైర్మన్‌గా మంత్రి రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల, పొన్నం
- వివాదాలు, ఉద్యోగుల అభ్యంతరాలపై కమిటీ అధ్యయనం
- జీవో 46పై కూడా కమిటీ పరిశీలన



2లో

'నిజాం షుగర్స్' పునఃప్రారంభానికి

కట్టుబడి ఉన్నాం

- మంత్రి, నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు -2లో

క్లుప్తంగా...



ఖర్గేకు స్వాగతం పలుకుతున్న రేవంత్

హైదరాబాద్‌కు ఖర్గే, వేణుగోపాల్

స్వాగతం పలికిన రేవంత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధానకార్యదర్శి కె.సి.వేణుగోపాల్ శనివారం సాయంత్రం వచ్చారు. వారికి సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ఏఐసీసీ అగ్రనేతలకు స్వాగతం పలికినవారిలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, సీనియర్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులున్నారు.

మంత్రివర్గ ఉపసంఘానికి జీవో 317 ఇబ్బందులు వివరిస్తాం

తెలంగాణ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయుల జేఏసీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీఓ నంబర్ 317 సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలంగాణ గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయుల జేఏసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడి నారాయణ, మధుసూదన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రివర్గ ఉపసంఘానికి త్వరలోనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను కేటగిరీల వారీగా వివరిస్తామన్నారు.

మొదటి జీతం విశ్రాంత ఉద్యోగులకు

ఉదారతను చాటుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్



విశ్రాంత ఉద్యోగులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన మొదటి జీతం రూ.1.50 లక్షలు విశ్రాంత ఉద్యోగుల సంఘానికి అందజేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సరాపు జగదీశ్వర్, రామారావు, జనార్దన్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువుభత్యం, మధ్యంతర భృతి విడుదల చేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువుభత్యం, మధ్యంతర భృతి విడుదల చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారికి సంఘం చైర్మన్ పి.పద్మాచారి, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రవీంద్రకుమార్, హరీశ్‌కుమార్ లేఖ రాశారు. ఇప్పటివరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, మధ్యంతర భృతి 20 శాతం పెంచాలని లేఖలో కోరారు.

ప్రభుత్వ ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించండి

సాక్షి, హైదరాబాద్: టీఎస్ ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్ ఎన్పీడీసీఎస్ పరిధిలో గత 30 ఏళ్లుగా లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులుగా పని చేస్తున్న వారిని ప్రభుత్వ ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ స్టోర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, శ్రీనివాస్ విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు శనివారం లేఖ రాశారు.

మహాలక్ష్మి పథకానికి రూ.80 కోట్లు విడుదల

పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 27వ తేదీ నుంచి అమలు చేయాలని భావిస్తున్న మహాలక్ష్మి పథకానికి రూ.80 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చే పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే విధి విధానాలు ప్రకటించిన విషయం తెలిసిందే. గుర్తించిన లబ్ధిదారుల ఖాతాల్లోకి రీఫిల్ సిలిండర్లు అందిన వెంటనే ఆయిల్ కంపెనీల నుంచి రూ.500 పోగా మిగిలిన మొత్తాన్ని జమ చేసేందుకు ఈ మొత్తాన్ని వినియోగిస్తారు. ఈ పథకం కింద 40 లక్షల లబ్ధిదారులు ఉంటారని ప్రాథమికంగా అంచనా వేసిన ప్రభుత్వం తొలి విడతగా రూ.80 కోట్లు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ఆయిల్ కంపెనీల ఖాతాల్లో జమ చేస్తారు.

'ధరణి' దరఖాస్తులను పరిష్కరించండి

తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

- ధరణి పోర్టల్ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- ఆర్‌వోఆర్ చట్టంలోనే లోపాలు ఉన్నాయని నివేదించిన ధరణి కమిటీ
- వీలుంటే చట్టసవరణ చేద్దామని లేదంటే కొత్త చట్టం తెద్దామన్న సీఎం
- ప్రస్తుతం ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న ప్రైవేటు ఏజెన్సీపై సమగ్ర విచారణకు ఆదేశం



సమావేశంలో పాల్గొన్న వేం నరేందర్‌రెడ్డి, కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ధరణి'పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 2.45లక్షల దరఖాస్తుల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ధరణిపై ఏర్పాటైన కమిటీ చేసిన సూచనలకు అనుగుణంగా విధివిధానాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయాల స్థాయిలో మార్చి తొలివారంలోనే దరఖాస్తుల పరిష్కారానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం సీఎం రేవంత్ రాష్ట్ర సచివాలయంలో ధరణి పోర్టల్‌పై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రేమండ్ పీటర్, నవీన్ మిట్టల్, మధుసూదన్, రాష్ట్ర ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, సీఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ వి.లచ్చిరెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధరణి కమిటీ ప్రాథమిక నివేదికను అందజేయగా.. కమిటీ సభ్యుడు రేమండ్ పీటర్ ఆ వివరాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఆర్‌వోఆర్ చట్టంలోనే లోపాలు..

రాష్ట్రంలో 2020లో అమల్లోకి వచ్చిన కొత్త ఆర్‌వోఆర్ చట్టంలోనే లోపాలున్నాయని, ఆ చట్టమే అన్ని అనర్థాలకు మూలమని ధరణి కమిటీ సభ్యులు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో చిక్కులు వచ్చాయని, ఆ రికార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో భూసమస్యలు, భూరికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని వివరించారు. లక్షలాదిగా సమస్యలు పేరుకుపోయాయని, రికార్డుల్లో చిన్న అక్షర దోషమున్నా సవరించుకునేందుకు జిల్లా కలెక్టర్ వరకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో 35 మాడ్యూల్స్ ఉన్నా.. ఎలాంటి సమస్యకు ఏ మాడ్యూల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన లేక రైతులు ఇబ్బందిపడుతున్నారని సీఎంకు వివరించారు. ఇప్పటికే లక్షలాది మంది రైతులు పెట్టుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని.. దరఖాస్తు చేసుకున్న ప్రతిసారీ వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించాల్సి రావడం రైతులకు భారంగా మారిందని తెలిపారు. ప్రస్తుత ధరణి పోర్టల్‌ను రైతులకు ఇబ్బంది లేకుండా మార్చాలంటే.. కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని సవరించాలని, లేదా మరో కొత్త చట్టాన్ని తీసుకురావాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా.. రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో.. నిషేధిత జాబితాలోని భూముల క్రయవిక్రయ లావాదేవీలు జరగడం, ఈ రికార్డుల ఆధారంగా రైతుబంధు జమచేయడంతో జరిగిన కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అంశాలపైనా సమావేశంలో చర్చించినట్టు తెలిసింది.

తుది నివేదిక ఆధారంగా శాశ్వత చర్యలు

వీలును బట్టి కొత్త ఆర్‌వోఆర్ చట్టానికి సవరణలు చేద్దామని.. లేదంటే మరో కొత్త చట్టం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలిద్దామని సమీక్షలో సీఎం రేవంత్ చెప్పారు. ధరణి కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగానే భూముల సమస్యలపై శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పుడున్న సమస్యల పరిష్కారం కోసం తీసుకునే నిర్ణయాలతో.. భవిష్యత్తులో కొత్త సమస్యలు రాకూడదన్నారు. ఎలాంటి భూవివాదాలు, కొత్త చిక్కులు లేకుండా దోషరహితంగా భూరికార్డులు తయారుచేసేలా చర్యలు తీసుకుందామన్నారు. ఇందుకోసం లోతుగా అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఇదే సమయంలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

ఎన్ఐసీకా... సీజీజీకా?

సమీక్షలో భాగంగా ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను ఎవరికి అప్పగించాలన్న అంశంపైనా చర్చ జరిగింది. ప్రస్తుతం పోర్టల్‌ను నిర్వహిస్తున్న ప్రైవేటు ఏజెన్సీ కాలపరిమితి కూడా ముగుస్తున్న నేపథ్యంలో.. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) లేదా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)కు అప్పగించే విషయాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించినట్టు సమాచారం. ధరణి పార్ట్-బీలో చేర్చిన 13.5లక్షల ఎకరాల భూముల విషయంపైనా సమీక్షలో చర్చించారు. ఈ భూముల సమస్యను పరిష్కరించేందుకు మార్గదర్శకాలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఎట్లా పరిష్కరిస్తారు?

ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో అగ్రికల్చర్ ఆఫీసర్, పారాలీగల్ వలంటీర్, ఒక సర్వేయర్‌తో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తారు. ఆ హెల్ప్‌డెస్క్ సదరు మండలం పరిధిలోని ధరణి దరఖాస్తులన్నింటినీ పరిశీలించి నివేదిక ఇస్తుంది. తహసీల్దార్లు ఆ నివేదిక మేరకు తమ స్థాయిలో సమస్యలను వెంటనే పరిష్కరిస్తారు. లేకుంటే ఉన్నతాధికారులకు (ఆర్డీవోలు/కలెక్టర్లకు) సిఫార్సు చేస్తారు. ఇందుకు సంబంధించిన సర్క్యులర్ ఒకట్రెండు రోజుల్లో విడుదల చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

గోప్యంగా ఉండాల్సిన వివరాలు.. ప్రైవేటుకు ఎలా?

సమీక్షలో భాగంగా ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న ప్రైవేటు ఏజెన్సీ వ్యవహారశైలిపై చాలాసేపు చర్చ జరిగింది. బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన పోర్టల్‌ను ప్రైవేటు ఏజెన్సీలకు ఎందుకు అప్పగించాల్సి వచ్చిందని రెవెన్యూ ఉన్నతాధికారులను సీఎం రేవంత్ ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన లక్షలాది మంది రైతుల భూరికార్డుల డేటా, వారి ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు ప్రైవేటు ఏజెన్సీ చేతుల్లోకి.. తద్వారా విదేశీ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసలు భూరికార్డులు సురక్షితంగా ఉన్నట్టా లేనట్టా? డేటాకు భద్రత ఉందా అని నిలదీశారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ అధికారులు మాట్లాడుతూ.. టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్డింగ్‌ల ఆధారంగా అప్పటి ప్రభుత్వం ఐఎల్ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి పోర్టల్ డిజైన్, డెవలప్‌మెంట్ బాధ్యతలను అప్పగించిందని వివరించారు. తర్వాత ఆ కంపెనీ దివాలా తీయడం, టెరాసిస్‌గా పేరు మార్చుకోవడం, డైరెక్టర్లు మారిపోవడం, ఆ తర్వాత మళ్లీ వాటాలు అమ్ముకుని ఫాల్కన్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీగా రూపాంతరం చెందడం వంటి పరిణామాలు జరిగాయని తెలిపారు. అయితే ఇలా బిడ్ దక్కించుకున్న కంపెనీ ఇష్టానుసారం పేర్లు మార్చుకుని కొత్త కంపెనీలను తెస్తే ప్రభుత్వం ఎలా అంగీకరించిందని రేవంత్ ప్రశ్నించారు. భూరికార్డుల డేటాను ప్రైవేటు సంస్థలకు అప్పగించేలా నిబంధనలు ఎక్కడున్నాయని రెవెన్యూ అధికారులను నిలదీశారు. రూ.116 కోట్లకు ధరణి పోర్టల్ నిర్వహణ టెండర్లు దక్కించుకున్న కంపెనీ.. తమ వాటాలను ఏకంగా రూ.1,200 కోట్లకు అమ్ముకోవడం విస్మయం కలిగించిందన్నారు. రికార్డులు వారి వద్దే ఉన్నందున విలువైన భూముల యజమానుల పేర్లు మార్చుకోలేదని గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. అర్ధరాత్రి కూడా భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్టు గతంలో ఫిర్యాదులు వచ్చాయని గుర్తు చేశారు. అసలు ధరణి పోర్టల్ నిర్వహణపై ప్రభుత్వానికి, రెవెన్యూ శాఖకు నియంత్రణ ఉందా? అని ప్రశ్నించారు. ఈ అంశాలన్నింటి నేపథ్యంలో సదరు ప్రైవేట్ ఏజెన్సీపై సమగ్ర విచారణ జరిపించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

పాస్‌పోర్టు ఈ సేవాకేంద్రంలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్ కారణం..

- కాలిబూడిదైన సామగ్రి, కంప్యూటర్లు, ఫైళ్లు



కామారెడ్డిలో పాస్‌పోర్టు కార్యాలయంలో మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయ ఆవరణలో ఉన్న పాస్‌పోర్టు ఈ సేవాకేంద్రంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో కార్యాలయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు పోస్టల్ అధికారులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో సామగ్రితోపాటు కంప్యూటర్లు, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, ఫైళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. గది పక్కనే పోస్టల్ శాఖ ఉత్తరాల గది ఉండటంతో హుటాహుటిన సిబ్బంది ఆ ఉత్తరాల సంచులను బయటకు తీసుకువచ్చి ఎదురుగా ఉన్న ప్రధాన కార్యాలయంలోకి తరలించారు. పాస్‌పోర్టు ఈ సేవాకేంద్రంలో మాత్రం అంతా అగ్నికి ఆహుతైంది. పాస్‌పోర్టులకు సంబంధించి అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయని, ఫైళ్లు ఎప్పటికప్పుడు తరలిస్తామని, ఎలాంటి డేటా, ముఖ్యమైన ఫైళ్లు నష్టపోలేదని, ఫర్నిచర్, కంప్యూటర్లు కాలిపోవడంతో స్వల్ప నష్టం వాటిల్లిందని పోస్టల్ శాఖ అధికారి రాజు తెలిపారు.

26 నుంచి కామారెడ్డి పీవోపీఎస్కేలో కార్యకలాపాలు నిలిపివేత

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): కామారెడ్డిలోని పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రంలో నిర్వహణ కారణాలతో ఈ నెల 26 నుంచి కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి జె. స్నేహజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 26 నుంచి అపాయింట్మెంట్లు బుక్ చేసుకున్న దరఖాస్తుదారులు వాటిని రీ షెడ్యూల్ చేసుకునే ఆప్షన్లను ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం తెలియచేస్తామన్నారు.

ఐదెకరాలా.. పదెకరాలా?

▶ మొదటి పేజీ తరువాయి

సరిపోతుందని అంచనా. దీనివల్ల గత ప్రభుత్వం కన్నా రూ.5 వేలు ఎక్కువ ఇచ్చినట్టు ఉంటుందని.. అదే సమయంలో ఏటా ఇచ్చే మొత్తంలో పెద్దగా మార్పు ఉండదని అధికార వర్గాలు చెప్తున్నాయి. పైగా రూ. 7,800 కోట్లు ఆదా చేసుకోవచ్చని అంటున్నాయి.

వాళ్లందరికీ కట్..!


సాగుభూములకే రైతుభరోసా ఇస్తామని కొత్త ప్రభుత్వం ప్రకటించింది. సాగుచేయని, సాగుకు పనికిరాని కొండలు, గుట్టలకు, ఆఖరికి రోడ్లు ఉన్న స్థలాలకు కూడా రైతుబంధు ఇచ్చారని ప్రస్తుత ప్రభుత్వం చెప్తోంది. ఈ నేపథ్యంలో రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ ద్వారా సాగు, బీడు భూములను గుర్తించనున్నామని.. తద్వారా అనర్హులను తొలగిస్తామని వ్యవసాయ శాఖ చెబుతోంది. అలాగే రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, సెలబ్రిటీలు, ఆదాయ పన్ను కట్టేవారికి కూడా పెట్టుబడి సాయం ఇవ్వకూడదని భావిస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వంపై రైతుభరోసా భారం మరింత తగ్గుతుందని పేర్కొంటున్నారు.

పనుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయండి

పెరుగుతున్న అంచనాలతో ఖజానాపై అదనపు భారం

- స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి
- ప్రాజెక్టుపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ వద్ద డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను శనివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించి ఇప్పటికే రెండుసార్లు అంచనా వ్యయాలు పెంచడంతో బడ్జెట్ భారీగా పెరిగిందని, ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారంగా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయకపోతే మోయలేని భారంగా పరిణమిస్తుందన్నారు.

ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వ సహకారం

ప్రాజెక్టు త్వరితగతిన పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని భట్టి విక్రమార్క హామీనిచ్చారు. ప్రాజెక్టు ద్వారా స్థానికంగా ఉన్న స్కిల్డ్, అన్ స్కిల్డ్ నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించే అంశంపై ఆలోచించాలన్నారు. బీహెచ్ఈఎల్ పేరున్న ప్రభుత్వ రంగ సంస్థ అని యాదాద్రి పనులు త్వరగా పూర్తి చేయకపోతే ఆ సంస్థకు చెడ్డ పేరు వస్తుందన్న విషయాన్ని సంస్థ అధికారులు, ఇంజనీర్లు దృష్టిలో పెట్టుకోవాలన్నారు.

సెప్టెంబర్ నాటికి 1,600 మెగావాట్ల విద్యుత్

ఈ ఏడాది సెప్టెంబర్‌లో రెండు యూనిట్ల ద్వారా 1,600 మెగావాట్ల విద్యుత్ పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తామని అధికారులు వివరించారు. 2025 మార్చి నాటికి మొత్తం ఐదు యూనిట్ల ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెస్తామని అధికారులు మంత్రులకు చెప్పుకొచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో జీరో పర్సంట్ ధూళి బయటికి వెళ్లకుండా నిర్మాణం జరుగుతుందని అధికారులు వివరించారు. అలాగే స్థానికంగా వినియోగించే నీటిని తిరిగి శుద్ధి చేసి ప్రాజెక్టు అవసరాలకే వినియోగిస్తామని తెలిపారు.

రుణాలపై ఆరా..

ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణాలు, వాటి వడ్డీ రేట్ల గురించి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. కమర్షియల్ బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేటు ఉంటే దానిని తగ్గించాలని కోరే అవకాశం ఉందని చెప్పారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా, సబ్ కాంట్రాక్టులు, ఇతర చిన్నచిన్న పనుల్లో స్థానికులకు అవకాశం కల్పించడం ద్వారా చేయూతనివ్వాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులను కోరారు. ప్రస్తుతం పవర్ ప్లాంట్‌లో జరుగుతున్న అన్ని రకాల అభివృద్ధి పనులను వీడియో ప్రజెంటేషన్ రూపంలో మంత్రుల బృందానికి వివరించారు. సమావేశంలో విద్యుత్ శాఖ సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, ట్రాన్స్‌కో డైరెక్టర్ అజయ్, పవర్ ప్లాంట్ సీఈ సమ్మయ్య పాల్గొన్నారు.

317 జీవోపై కేబినెట్ సబ్ కమిటీ

చైర్మన్‌గా మంత్రి రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల, పొన్నం

- వివాదాలు, ఉద్యోగుల అభ్యంతరాలపై కమిటీ అధ్యయనం
- జీవో 46పై కూడా కమిటీ పరిశీలన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కొత్త జోన్లు, కొత్త జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటు కోసం ఉద్దేశించిన జీవో నంబర్ 317పై ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల అభ్యంతరాల దృష్ట్యా మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా మంత్రి దామోదర, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఉంటారు. 2021లో ఇచ్చిన జీవో 317, జీవో 46పై వివాదాలు, ఉద్యోగుల అభ్యంతరాలపై ఈ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది.

పీఆర్‌టీయూటీఎస్ హర్షం

గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 317పై ఉద్యోగుల అభ్యంతరాలను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడం పట్ల పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

317 జీవోతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారు: టీఎస్‌యూటీఎఫ్

ఉద్యోగుల శాశ్వత కేటాయింపు కోసం గత ప్రభుత్వం జీవో 317 ద్వారా ఏకపక్షంగా విడుదల చేసిన మార్గదర్శకాల కారణంగా పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేయటం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

పీఆర్ కమిషనర్‌కు టీపీఎస్ఏ వినతిపత్రం

ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అంశాలు, బదిలీలపై గత సర్కార్ ఇచ్చిన జీవో 317తో ముడిపడిన సమస్యల పరిశీలనకు సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ సబ్‌కమిటీని నియమించడం పట్ల తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ (టీపీఎస్ఏ) హర్షం ప్రకటించింది. ఈ జీవో కారణంగా పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌కు టీఎస్‌పీఏ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం పీఆర్ కమిషనరేట్‌లో కమిషనర్‌కు టీఎస్‌పీఏ ప్రతినిధులు మధుసూదన్ రెడ్డి, .శ్రీనివాస్, పండరీనాథ్ వినతిపత్రం సమర్పించారు. ఈ జీవో వల్ల కొందరు కార్యదర్శులు స్థానికతను కోల్పోయి కుటుంబాలకు దూరంగా ఇబ్బందులుపడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

జీవో 46పై సబ్ కమిటీతో నిరుద్యోగులకు న్యాయం: బల్మూరి వెంకట్

జీవో నంబర్ 46పై కేబినెట్ సబ్ కమిటీ వేయడాన్ని ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ స్వాగతించారు. జీవో 46 వల్ల గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి తాము సూచనలు, సలహాలు చేసినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వం సబ్ కమిటీ వేసిందని వెంకట్ హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో నిరుద్యోగులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి ఉద్యోగ అవకాశాల్లో ఎలాంటి అన్యాయం జరగకుండా సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నిజాం షుగర్స్ పునఃప్రారంభానికి కట్టుబడి ఉన్నాం

- ఫ్యాక్టరీని తెరిపించి లాభాల బాటలో నడిపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం
- మంత్రి, నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కమిటీ సభ్యులతో కలసి బోధన్‌లోని ఫ్యాక్టరీ సందర్శన



ఫ్యాక్టరీని సందర్శిస్తున్న శ్రీధర్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి తదితరులు

బోధన్: నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి, నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో ఫ్యాక్టరీలను తెరిపించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చామని పేర్కొన్నారు. శనివారం బోధన్‌లోని ఫ్యాక్టరీని కమిటీ సభ్యులు సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన ఫ్యాక్టరీ ఆవరణలో చెరుకు రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతులు, కార్మికుల శ్రేయస్సు కోసం ఫ్యాక్టరీని తెరిపించి లాభాల బాటలో నడిపేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. రైతులకు మేలు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇప్పటికే వ్యవసాయ, పారిశ్రామికరంగ నిపుణులతో చర్చిస్తున్నామని వివరించారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, పెట్టుబడి సాయం, వడ్డీ లేని రుణాలు వర్తింపజేసేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఫ్యాక్టరీలను ప్రభుత్వమా లేక సహకార విధానంలోనా లేక ప్రైవేటు రంగంలోనా ఎలా నడపాలో ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. నిపుణులతో చర్చించి తుది నిర్ణయం తీసుకొనేందుకు ఆలోచించకపోతే నిజాం షుగర్స్ కూడా కాళేశ్వరం ప్రాజెక్టులా అవుతుందని వ్యాఖ్యానించారు.

మార్పు చేసి చూపుతాం..

ప్రజలు ఆకాంక్షించిన మార్పును చేసి చూపుతామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ నెల 27న రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. హైదరాబాద్ శివారులో జిల్లాలు, ముఖ్య పట్టణాలను కలుపుతూ రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మించేందుకు ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, నిజాం షుగర్స్ ఎండీ డాక్టర్ మక్సూద్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొన్నారు.

ఏపీలో నేడే గ్రూప్-2 ప్రిలిమ్స్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోఆదివారం నిర్వహించనున్న గ్రూప్-2 ప్రిలిమ్స్‌కు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన కలెక్టర్లు, ఎస్పీలు, ఏపీపీఎస్సీ అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గ్రూప్-2 ప్రిలిమ్స్ నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,327 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. నిరంతర పర్యవేక్షణ కోసం 24 మంది అఖిల భారత సర్వీసుల అధికారులు, 51 మంది ఏపీపీఎస్సీ అధికారులు, 450 మంది రూట్ అధికారులు, 1,330 మంది లైజనింగ్ అధికారులను నియమించినట్లు చెప్పారు. 24,142 మంది ఇన్విజిలేటర్లు, మరో 8,500 మంది ఇతర సిబ్బందిని ఆయా పరీక్షా కేంద్రాల్లో నియమించామన్నారు. పటిష్ట బందోబస్తు కోసం 3,971 మంది పోలీస్ సిబ్బంది.. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాలు తదితర మెటీరియల్‌ను సురక్షితంగా తరలించేందుకు 900 మంది ఎస్కార్ట్ సిబ్బందిని నియమించామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాలను సీసీటీవీ కెమెరాలతో అనుసంధానించామన్నారు.

27 నుంచి మరో 2 గ్యారంటీల అమలు

- చేవెళ్ల సభలో ప్రియాంకాగాంధీతో రెండు గ్యారంటీలకు శ్రీకారం
- డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి
- సూర్యాపేట జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులకు భట్టి శంకుస్థాపన

హుజూర్‌నగర్ (సూర్యాపేట)/ సింగరేణి(కొత్తగూడెం): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఈనెల 27 నుంచి మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం నక్కగూడెం గ్రామంలో రూ 37.70 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడుతూ...ఈనెల 27 నుంచి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ పథకాలకు చేవెళ్లలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ శ్రీకారం చుడతారని చెప్పారు. త్వరలో రాష్ట్రంలోని మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పారు. గిరిజనులకు పోడు పట్టాలు అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. సభ అనంతరం దొండపాడుకు వెళ్తూ మార్గమధ్యలో మిరపతోట వద్ద మంత్రులు కారు దిగి వెళ్లి కూలీలతో ముచ్చటించారు. ఆర్టీసీ బస్సులు ఎక్కుతున్నారా.. టికెట్ తీసుకుంటున్నారా అని మహిళలను అడిగారు. అందుకు వారు బదులిస్తూ ఉచితంగానే ప్రయాణిస్తున్నామని తెలిపారు. ఈ పొలం ఎవరిది, కూలీ ఎంత ఇస్తున్నారని వారు మహిళలను ఆరా తీశారు.

నేడు సోలార్ ప్లాంట్ ప్రారంభం

సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలోని కొత్తగా నిర్మించిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు ఆదివారం ప్రారంభించనున్నారు. కొత్తగూడెం ఏరియాలో సింగరేణి సంస్థ ఇప్పటికే త్రీఇంక్‌లైన్‌లో 48 ఎకరాల్లో రూ.56.76 కోట్లతో 10.5 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్ నిర్మించింది. త్రీఇంక్లైన్, గరిమెళ్లపాడు ప్రాంతాల్లో 37 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి.

క్లుప్తంగా...

నేడు నాగర్‌కర్నూల్ పరిధిలో కేటీఆర్ పర్యటన



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అచ్చంపేట, నాగర్ కర్నూల్ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల గురించి దిశానిర్దేశం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు అచ్చంపేట టౌన్ లోని డీకే ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో, మధ్యాహ్నం 2 గంటలకు నాగర్ కర్నూల్ నియోజకవర్గం జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు.

28న రైతు ఉద్యమానికి మద్దతుగా ర్యాలీ: అన్వేశ్



సాక్షి, హైదరాబాద్: పంటలకు మద్దతు ధర కోరుతూ జాతీయస్థాయిలో రైతులు కొనసాగిస్తున్న ఉద్యమానికి మద్దతుగా ఈ నెల 28న సంఘీభావ ర్యాలీ చేపట్టనున్నట్టు టీపీసీసీ కిసాన్ సెల్ అధ్యక్షుడు సుంకేట అన్వేశ్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపడతామని, నిజాం కళాశాల నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ జాబితా విడుదల

నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల ముసాయిదా జాబితాను శనివారం ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ నియోజకవర్గం పరిధిలో 4,27,289 మంది ఓటర్లు ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. ముసాయిదా జాబితాను మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని కలెక్టరేట్లు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు, 600 పోలింగ్ స్టేషన్లలో ప్రచురించినట్లు నల్లగొండ కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. ఈ నియోజకవర్గంలో గతంలో 5,05,565 మంది ఓటర్లుండగా.. ప్రస్తుతం 4,27,289మంది నమోదు చేసుకున్నారు.

హామీల అమల్లో మోసగించిన సీఎం: శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీల అమలు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో 13 హామీలున్నాయనే విషయాన్ని చెప్పకుండా.. మరో రెండు గ్యారంటీలు అమలు చేస్తాననడం శోచనీయమన్నారు. రూ.500కు సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచిత విద్యుత్ అని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు నిబంధనల పేరుతో మోసానికి తెర లేపారని ఆరోపించారు. రాష్ట్రంలో కోటి 24 లక్షల గ్యాస్ కనెక్షన్లు, 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉంటే 40 లక్షల మందికే రూ.500 గ్యాస్ సిలిండర్ ఇస్తామంటున్నారని విమర్శించారు. అలాగే 200 యూనిట్ల లోపు వాడేవారికి విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలి తప్ప.. డొంక తిరుగుడు నిబంధనలు పెట్టడం సరికాదన్నారు.

మహబూబాబాద్ బరిలోకి భూక్యా శోభన్




సాక్షి, హైదరాబాద్: మహబూబాబాద్ లోక్‌సభ బరిలో నిలవాలని ట్రైబల్ హబ్ వ్యవస్థాపకుడు భూక్యా శోభన్‌బాబు నిర్ణయించారు. బెంగళూరు ఐఐఎస్‌లో మాస్టర్స్, ఐఎస్‌బీ నుండి ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు పూర్తి చేసిన శోభన్‌బాబు నాలుగేళ్లుగా ట్రైబల్ హబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లోక్‌సభ పరిధిలో విస్తృతంగా అనుచరులు, బంధుగణం ఉన్న ఆయన వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జె.కల్యాణ్‌నాయక్ నియమించారు. కమిటీలో దాసరి శ్యామ్ రావు, డాక్టర్ బానోత్ బిల్లోజి నాయక్, పాడెం బాల్‌రాజ్, నేనావత్ మల్లేశ్‌నాయక్, రమావత్ ఉమా మహేశ్వరి, కత్రవత్ మోహన్‌నాయక్, ప్రధాన కార్యదర్శులుగా నేనావత్ రవినాయక్, కొట్నం విజయ్, కొత్త సురేందర్ నియమితులయ్యారు. రాష్ట్ర కార్యదర్శులుగా భూక్యా శ్రీనునాయక్, జి.శ్రీకాంత్‌నాయక్, మహేశ్, జి. రాంబాబు, ధరావత్ శ్రీను (అమ్మ శ్రీను), గణేష్ మోదీలను నియమించారు. కోశాధికారిగా డి.శ్రీనివాస్‌నాయక్, జాయింట్ సెక్రటరీ, ఆఫీస్ సెక్రటరీ, జాయింట్ ఆఫీస్ సెక్రటరీలు, అధికార ప్రతినిధులు, సోషల్ మీడియా, ఐటీ, లీగల్, మహిళా, పబ్లిసిటీ విభాగాలకు కన్వీనర్లు, కో–కన్వీనర్లను నియమించారు.

భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్

- ఫిబ్రవరిలో తొలిసారిగా 15 వేల మెగావాట్ల పీక్ డిమాండ్
- ప్రాజెక్టుల్లో నీళ్లు లేక పెరిగిన బోరుబావుల వినియోగం
- మార్చి చివరిలోగా 16,500– 17,000 మెగావాట్లకు పెరిగే అవకాశం
- గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 6.9% వినియోగం పెరుగుదల



సాక్షి, హైదరాబాద్: వేసవి తీవ్రత అప్పుడే పెరుగుతుండడంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిపోయింది. బోరుబావుల కింద వేసిన యాసంగి పంటలను రక్షించుకోవడానికి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఫిబ్రవరి నెలలో తొలిసారిగా గరిష్ట విద్యుత్ డిమాండ్ 15వేల మెగావాట్లను దాటింది. ఈ నెల 23న రాష్ట్రంలో 15,031 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. గతేడాది సరిగ్గా ఇదే రోజు 14,526 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ మాత్రమే నమోదైంది. గతేడాది మార్చి 30న రాష్ట్రంలో అత్యధికంగా 15497 మెగావాట్ల గరిష్ట విద్యుత్ నమోదు కాగా, ఈ ఏడాది మార్చి చివరి నాటికి 16,500 మెగావాట్లకు మించనుందని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు అంచనా వేస్తున్నాయి. ఈ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ఇంధన శాఖ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది.

1,200 మెగావాట్ల విద్యుత్ బ్యాంకింగ్‌కు ఏర్పాట్లు

1,600మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీ థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో 800 మెగావాట్ల నుంచి ఇప్పటికే వాణిజ్యపరమైన ఉత్పత్తి ప్రారంభం కాగా, 800 మెగావాట్ల రెండో ప్లాంట్ నుంచి ఉత్పత్తిని ప్రారంభించడానికి సర్వంసిద్ధం చేశారు. పొరుగు రాష్ట్రాలతో 1200 మెగావాట్ల విద్యుత్ బ్యాంకింగ్‌కు సైతం ఏర్పాట్లు చేశారు. దీని ద్వారా రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉన్నప్పుడు ఆ రాష్ట్రాలకు విద్యుత్ ఇచ్చి మన రాష్ట్రంలో లోటు ఉన్నప్పుడు తీసుకోవడానికి అవకాశం ఉండనుంది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది జనవరిలో 6.9 శాతం, ఫిబ్రవరి నెలలో 4.6 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. గతేడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సగటున రోజువారీ విద్యుత్ వినియోగం 242.95 మిలియన్ యూనిట్లు కాగా, ఈ ఏడాది ఇదే కాలంలో 256.74 మిలియన్ యూనిట్లకు చేరింది.

సాగునీరు లేక పెరగనున్న విద్యుత్ అవసరాలు

కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నిల్వలు అడుగంటిపోవడంతో కాల్వల కింద ఆయకట్టు సాగుకు నీళ్లు లేవు. మరమ్మతుల్లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సైతం ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో రాష్ట్రంలో బోరుబావుల కింద విద్యుత్ వినియోగం మరింత పెరగనుందని అంచనా వేస్తున్నారు. గరిష్ట విద్యుత్ డిమాండ్ మార్చి చివరిలోగా 16500–17000 మెగావాట్ల మధ్య నమోదు కావచ్చని భావిస్తున్నారు.

దక్షిణ డిస్కంల పరిధిలోనూ పెరిగిన వినియోగం

దక్షిణ తెలంగాణలోని ఐదు ఉమ్మడి జిల్లాలకు విద్యుత్ సరఫరా చేసే దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్) పరిధిలో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది జనవరిలో 6.67 శాతం, ఫిబ్రవరిలో 6.24 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. సంస్థ పరిధిలో ఫిబ్రవరి 2023లో గరిష్ట విద్యుత్ డిమాండ్ 9043 మెగావాట్లు నమోదు కాగా, 2024 ఫిబ్రవరి 23న 9253 మెగావాట్లకు పెరిగింది. గతేడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సగటున 158.71 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగగా, ఈ ఏడాది ఇదే కాలంలో 169.36 మిలియన్ యూనిట్లకు పెరిగింది.

గ్రేటర్‌లో డిమాండ్ పైపైకి..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది జనవరిలో 9.47 శాతం, ఫిబ్రవరిలో 12.27శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. ఫిబ్రవరి 2023లో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,930 మెగావాట్లుగా నమోదు కాగా, 2024 ఫిబ్రవరి 23న 3,174 మెగావాట్లుగా నమోదయ్యింది. నగరంలో గతేడాది జనవరి, ఫిబ్రవరిలో సగటు విద్యుత్ వినియోగం 51.69 మిలియన్ యూనిట్లు ఉండగా, ఈ ఏడాది జనవరిలో 57.34 మిలియన్ యూనిట్లు, ఫిబ్రవరిలో 65 మిలియన్ యూనిట్లకు పెరిగింది.

రాష్ట్రంలో రూ.621 కోట్ల రైల్వే అభివృద్ధి పనులు

▶ మొదటి పేజీ తరువాయి

ఫ్లై ఓవర్, రైల్ అండర్ పాస్‌లను మోదీ జాతికి అంకితం చేయనున్నారు.

17 రైల్వే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం

అమృత్ భారత్ స్టేషన్లతో పాటు మోదీ రాష్ట్రంలో రూ.169 కోట్లకు పైగా నిధులతో నిర్మించనున్న ఒక రైల్ ఫ్లై ఓవర్‌కు, 16 రైల్ అండర్ పాస్‌లకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. అందులో హైదరాబాద్ డివిజన్‌లోని బోధన్ వద్ద రైల్ ఫ్లై ఓవర్, మేళ్ల చెరువు, కురుమూర్తి వద్ద రెండు రైల్ అండర్ పాస్‌లు, చిలకమర్రి, గొడవల్లి, కీసర, రామాంతపూర్, పాలాట, కూచవరం వద్ద, మదనపూర్, గద్వాల్ వద్ద రైల్ అండర్ పాస్‌లు... సికింద్రాబాద్ డివిజన్‌లోని కురచపల్లి, వెలమల, చాగల్ వద్ద రైల్ అండర్ పాస్‌లు, గుంతకల్ డివిజన్‌లోని నారాయణపేట వద్ద రైల్ అండర్ పాస్‌ల నిర్మాణం జరగనుంది. వీటితోపాటు ఆయా డివిజన్లలో రూ.221 కోట్ల నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న 3 రైల్ ఫ్లై ఓవర్‌లను, 29 రైల్ అండర్ పాస్‌లను మోదీ జాతికి అంకితం చేయనున్నారు. అందులో హైదరాబాద్ డివిజన్‌లోని మహబూబ్‌నగర్ రూరల్, పెద్దదిన్నె, తిప్పాపూర్, గద్వాల్, సిద్దరామేశ్వర్‌నగర్, బైరవాపురం, తలమడ్ల, ఇటిక్యాల, అడ్లూర్, నవీపేట్, ఉండవల్లి వద్ద రైల్ అండర్ పాస్‌లను... సికింద్రాబాద్ డివిజన్‌లోని ఎర్రగుంట, ఉంకిచర్ల/నిరుపమకొండ, చర్లపల్లి వద్ద రైల్ ఫ్లై ఓవర్‌లు, విలాసాగర్, బిస్‌బాగ్, శివపురం, కాశీపేట్, మంచిర్యాల, బూడ, కాజీపేట్, గరిడపల్లి, మీనవోలు, బయ్యారం, దెందుకూరు, ముత్యాలగూడెం, రాజనెల్లి, ఉప్పరపల్లి వద్ద రైల్ అండర్ పాస్‌లను... గుంటూర్ డివిజన్‌లోని నార్కట్‌పల్లి, కీసరజూపల్లి, బుదారం వద్ద అండర్ పాస్‌లను... గుంతకల్ డివిజన్‌లోని తంగడి వద్ద ఉన్న అండర్ పాస్‌ను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారు.

మోదీ, రైల్వేమంత్రికి ధన్యవాదాలు: కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి పెద్ద ఎత్తున సహకరించడంపై ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఇంతవరకూ ఎలాంటి రైలు సౌకర్యం లేని మెదక్, సిద్దిపేట వంటి ప్రాంతాలకు కొత్తగా రైలు సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని, ఆదాయపరంగా అనుకూలం కాకపోయినా మల్లన్న భక్తుల కోసం కొమురవెల్లిలో నూతన రైల్వే హాల్ట్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

మార్చిలో చర్లపల్లి రైల్వే టర్మినల్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి రైల్వే టర్మినల్ మార్చిలో అందుబాటులోకి రానుందని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. టర్మినల్ పనులు చివరిదశలో ఉన్నాయని చెప్పారు. ఈ టర్మినల్ అప్రోచ్ రోడ్డును విస్తరించడంతోపాటు టర్మినల్‌కు చేరేందుకు అవసరమైన బస్సుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామన్నారు. శనివారం రైల్ నిలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో దాదాపు రూ.925 కోట్లతో చేపట్టే 57 స్టేషన్‌ల పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారని చెప్పారు. గత నాలుగేళ్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 415 మ్యాన్ లెవల్ క్రాసింగ్‌లను తీసేసినట్టు జైన్ పేర్కొన్నారు.

ప్రజాపాలన కాదు.. ఇది ప్రతీకార పాలన

- దళిత బహుజన జర్నలిస్టులే లక్ష్యంగా దాడులు... తెలంగాణ కోసం పోరాడిన వారిపై సీఎం రేవంత్ కక్ష
- పథకం ప్రకారమే జర్నలిస్ట్ శంకర్‌పై దాడి
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, క్రాంతికిరణ్



బాల్క సుమన్



క్రాంతికిరణ్

సాక్షి, హైదరాబాద్: ఎమర్జెన్సీ నాటి రోజులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుకుతెస్తూ నిజమైన ఇందిరమ్మ రాజ్యం ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తోందని మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, క్రాంతి కిరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలు ఆంజనేయ గౌడ్, పల్లె రవికుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు, కూల్చివేతలు, ప్రశ్నించే వారిపై దాడి చేయడమేనని మరోసారి నిరూపిత మవుతోందన్నారు. ఇది సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లు ప్రజా పాలన కాదనీ తెలంగాణ మీద ప్రతీకార పాలన అని వారు ధ్వజమెత్తారు. సీనియర్ జర్నలిస్టు శంకర్‌పై కాంగ్రెస్ గూండాలు పథకం ప్రకారం దాడి చేశారని, చంపాలని చూశారని ఆరోపించారు. చిలుక ప్రవీణ్ ,రంజిత్, ఆకుల ప్రవీణ్ అనే జర్నలిస్టుల మీద కూడా దాడులు, వేధింపులు జరిగాయన్నారు. సిద్దిపేట జర్నలిస్టు శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ కార్యకర్త చంపుతానని బెదిరిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సీఎంను కలిసిన తర్వాతే దాడి చేశాడు

జర్నలిస్ట్ శంకర్ మీద దాడి చేసింది కాంగ్రెస్ కార్యకర్త సాయిరాంరెడ్డి అని సీసీ టీవీ ఫుటేజీలో స్పష్టంగా కనిపిస్తున్నా, పోలీసు యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డిని సాయిరాం రెడ్డి కలిశాకే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. నయా దేశ్‌ముఖ్ రేవంత్ రెడ్డి పాలనలో దళిత బహుజన జర్నలిస్టులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని నిందించారు. అక్షరంతో ప్రశ్నిస్తే ఆయుధాలతో దాడి చేయడమే ఇందిరమ్మ రాజ్యమంటారా అనేది సీఎం చెప్పాలని డిమాండ్ చేశారు.

2,600 మంది బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు

కాంగ్రెస్ పాలన మూడు నెలలు కాకముందే అనేక అకృత్యాలు చోటు చేసుకుంటున్నాయని, ఇప్పటి వరకు 2600మంది బీఆర్ఎస్ కార్యకర్తల మీద అక్రమ కేసులు నమోదు అయ్యాయని వారు చెప్పారు. మేడారంలో సీఎం రేవంత్ ముందే భక్తులపై లాఠీ చార్జీ చేశారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన వారిపై రేవంత్ కక్ష కట్టారని విమర్శించారు.

రాష్ట్రాన్ని ప్రజలను కాపాడుకుంటాం

అటవీ, దేవాదాయ శాఖ మంత్రి సురేఖ



సాక్షి, హైదరాబాద్: అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా తెలంగాణను, రాష్ట్ర ప్రజలను పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకుంటామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ చెప్పారు. సమ్మక్క సారలమ్మల దయ తెలంగాణ ప్రజలపై సదా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. జాతరను విజయవంతం చేయడంలో సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు, దేవాదాయ, శానిటేషన్, ఇతర శాఖల సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను భక్తులు అనుక్షణం ఆస్వాదించేలా, జాతరను విజయవంతంగా నిర్వహించడంలో అందరూ సహకరించారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు ఏమైనా ఇబ్బందులకు గురైతే పెద్ద మనసుతో క్షమించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా తొలిసారి మేడారం జాతర నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను పూర్తి నిష్టతో చేపట్టినట్లు వెల్లడించారు. అమ్మవారి దయతో అనారోగ్యం నుంచి త్వరగా కోలుకొని అమ్మవార్లు గద్దెలకు చేరుకున్నాక దర్శించుకునే భాగ్యం కలిగిందని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

జర్నలిస్ట్ శంకర్‌పై పథకం ప్రకారమే దాడి

- న్యూస్‌లైన్ ఆఫీస్ ముందు రెక్కీ కూడా నిర్వహించారంటున్న బాధితుడు
- దాడి యాథృచ్ఛికంగానే జరిగిందంటున్న పోలీసులు

నాగోలు: జర్నలిస్ట్ శంకర్‌పై ఎల్‌బీనగర్‌లో జరిగిన దాడి పక్కా పథకం ప్రకారమే అధికార పార్టీ నాయకులే చేయించారని దాడి ఘటనలో జర్నలిస్ట్ శంకర్‌తో పాటు ఉన్న మరో బాధితుడు దండిగ నర్సింహ్మ ఆరోపిస్తున్నారు. ఈ నెల 21 ఎల్‌బీనగర్ హస్తినాపురానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాయిరాంరెడ్డి, మరో ఇద్దరు వ్యక్తులు సిరీస్ రోడ్డులో ఉండే న్యూస్‌లైన్ కార్యాలయం వద్ద రెక్కీ కూడా నిర్వహించారని ఆయన ఆరోపించారు. పథకం ప్రకారమే గురువారం రాత్రి శంకర్‌పై దాడి చేశారన్నారు. దాడి దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డులో ఉన్నాయని చెప్పారు. దాడి సమయంలో 10 మందికి పైగా అక్కడ ఉన్నా..పోలీసులు మాత్రం కొందరినే అరెస్ట్ చేశారని మిగత వాళ్లను పోలీసులు తప్పించారా అనే అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. కాగా, శంకర్‌పై దాడి చేసినట్లు భావిస్తున్న వ్యక్తి కాంగ్రెస్ నాయకులతో ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

ఆ దాడి యాక్సిడెంటల్‌గా జరిగింది: సీఐ

జర్నలిస్ట్ శంకర్‌పై జరిగిన దాడి యాక్సిడెంటల్‌గా జరిగిందని ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి స్పష్టం చేశారు. న్యూస్‌లైన్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాలను పోలీసులు సిబ్బంది పరిశీలించారని దాడిలో ఎలాంటి కుట్ర కోణం ఉన్నట్లు కనిపించడంలేదని తెలిపారు. దాడికి పాల్పడిన నలుగురి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

బీసీలకు 9 ఎంపీ సీట్లు ఇవ్వాలి: జాజుల



యాదగిరిగుట్ట: తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు కనీసం 9 స్థానాలను కేటాయించాలని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను డిమాండ్ చేస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన యాదగిరిగుట్టలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా రాజకీయ పార్టీలు అధికారంలోకి రావాలని గెలుపు గుర్రాల పేరిట ధనికులకు టిక్కెట్లు ఇచ్చాయని విమర్శించారు. బీసీలకు 34 టిక్కెట్లు ఇస్తామని ఓ పార్టీ మోసం చేస్తే.. మరో పార్టీ బీసీ సీఎంను చేస్తామని చెప్పి కనీసం శాసనసభపక్ష నేత పదవి ఇవ్వలేదని, ఇంకో పార్టీ బీసీలకు టిక్కెట్లు ఇవ్వనేలేదని తెలిపారు. 60శాతం ఉన్న బీసీలకు సగం పార్లమెంట్ స్థానాలు ఇవ్వాలని కోరుతున్నట్టు తెలిపారు.

ప్రణాళిక బోర్డు వైస్‌చైర్మన్‌గా చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్‌గా మాజీ మంత్రి జిల్లెల్ల చిన్నారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను కేబినెట్ హోదాలో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఉమ్మడి జిల్లాకు చెందిన చిన్నారెడ్డిని కీలకమైన ఈ పదవిలో నియమించడంతో రాష్ట్రంలో మరో ముఖ్యమైన నామినేటెడ్ పోస్టు భర్తీ చేసినట్టయింది. కాంగ్రెస్ పార్టీకి, గాంధీ కుటుంబానికి విధేయుడిగా, సీఎం రేవంత్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన చిన్నారెడ్డి నాలుగుసార్లు వనపర్తి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 1989, 1999 ,2004, 2014లో ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన 2007–09 మధ్య కాలంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి మంత్రిగా పనిచేశారు. అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు. చిన్నారెడ్డిని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా నియమించడం పట్ల పలువురు కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కాగా, తాజా నియామకంతో ఒకట్రెండు రోజుల్లోనే కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఊపందుకుంది.

గొర్రెల స్కాంపై కేంద్రం విచారణ

- అవినీతి అధికారుల పేర్లు పబ్లిక్ డొమైన్‌లో పెడతాం
- కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చోటు చేసుకున్న గొర్రెల స్కాంపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపడుతుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాలా ప్రకటించారు. ఈ విచారణలో భాగంగా కుంభకోణంలో ప్రమేయం ఉన్న వారందరిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యవహారంలో అవినీతికి పాల్పడిన అధికారుల పేర్లు పబ్లిక్ డొమైన్‌లో పెడతామని ఆయన వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీపరంగా చేపడుతున్న 'విజయసంకల్పయాత్ర'లో భాగంగా శనివారం పురుషోత్తం రూపాలా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగోల్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 2014కు ముందు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అవినీతి ప్రధాన ఎజెండాగా ఎన్నికలు జరిగాయన్నారు. ఐతే ఆ తర్వాత మోదీ ప్రధాని అయ్యాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయి కేవలం అభివృద్ధి ఎజెండాగానే ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. బీజేపీకి, కాంగ్రెస్ పార్టీకి అదే తేడా అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజలంతా కూడా అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందనీ, ఆ మేరకు లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీని అత్యధిక సీట్లలో గెలిపించాలని రూపాలా పిలుపునిచ్చారు.

ల్యాబ్‌కు ఆకాశ్ రక్త నమూనాలు

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి కేసులో శాస్త్రీయ ఆధారాల కోసం పోలీసుల దర్యాప్తు



ఆస్పత్రిలో ఆకాశ్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేసులో శాస్త్రీయ ఆధారాల సేకరణ కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కారు నడిపిన ఆమె పీఏ ఆకాశ్‌కు ఇప్పటికే బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించి ఆయన మద్యం సేవించలేదని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన పోలీసులు... తాజాగా ఆకాశ్ రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌తోపాటు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌కు పంపినట్లు తెలిసింది. అలాగే ఆకాశ్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని కాల్ డేటాను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఆకాశ్ స్టేట్‌మెంట్‌ను మేజిస్ట్రేట్ సమక్షంలో రికార్డు చేసినట్లు సమాచారం. ప్రమాదం జరిగినప్పుడు కళ్లు బైర్లు కమ్ముకున్నాయని.. ఏం జరిగిందో తెలిసేలోపే ప్రమాదం జరిగిందని ఆకాశ్ చెప్పినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ప్రమాదానికి ముందు రాత్రి ఆయనకు సరిగ్గా నిద్ర లేకపోవడంతోనే కారు డ్రైవ్ చేస్తున్నప్పుడు నిద్ర మత్తు ఆవహించిందా? లేదా ఇంకేదైనా కారణం ఉందా? అనే దానిపై ల్యాబ్ రిపోర్టులు వస్తేనే సైంటిఫిక్ ఎవిడెన్స్ లభిస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

వాహన తయారీ లోపాలేమైనా ఉన్నాయా?

ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాద కేసుకు సంబంధించిన వివరాల సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే ప్రయాణించిన వాహనంలో తయారీ లోపాలేమైనా ఉన్నాయా? అని పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి గురైనప్పుడు వాహనం గంటకు 100 కి.మీ. వేగంతో ప్రయాణించినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన అధికారులు.. ప్రమాద తీవ్రతకు కారు విడిభాగాలు సుమారు 100 మీటర్ల దూరం వరకు పడిపోవడాన్ని బట్టి చూస్తే అంతకంటే ఎక్కువ వేగంతో వాహనం ప్రయాణిస్తోందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పటాన్‌చెరు పోలీసులు ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం జరిగిన చోట ఏమైనా సీసీ కెమెరాలు ఉన్నాయా అని పరిశీలించారు.

వీఐపీల డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు

- సుమోటోగా అన్ని జిల్లాల్లో నిర్వహిస్తాం.. పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇస్తాం
- గాంధీభవన్ చిట్‌చాట్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఆ డ్రైవర్లను కొనసాగిస్తారా లేదా అన్నది వీఐపీల ఇష్టం
- మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది
- వెయ్యి కొత్త బస్సులు దశలవారీగా వస్తున్నాయి.. ఆర్టీసీ స్థలాలను పరిరక్షిస్తాం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ముఖ్యమైన వ్యక్తుల (వీఐపీ) డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. చిన్నచిన్న తప్పిదాలతో వీఐపీలు ప్రాణాలు కోల్పోతున్నారని.. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి ఘటన నేపథ్యంలో రవాణా శాఖ సుమోటోగా ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. వీఐపీలంతా తమ డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని కోరుతూ లేఖలు రాస్తామన్నారు. ఈ జాబితాలో చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, రాజకీయ నాయకులు ఉంటారని వివరించారు. వారి డ్రైవర్లకు అన్ని జిల్లాల్లో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేందుకు రెండు, మూడు రోజుల్లో ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ పరీక్షల అనంతరం డ్రైవర్లకు సర్టిఫికెట్లు జారీ చేస్తామని, వారిని కొనసాగించుకోవాలా వద్దా అనేది వీఐపీల ఇష్టమని చెప్పారు. పొన్నంప్రభాకర్ శనివారం గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది

మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం వల్ల ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగిందని మంత్రి పొన్నం చెప్పారు. గతంలో రోజూ సగటున 45లక్షల మంది వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారని, ఇప్పుడా సంఖ్య 55–60 లక్షల వరకు ఉంటోందని తెలిపారు. మహిళలతో పాటు పురుష ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఆర్టీసీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా నడుస్తోందని చెప్పారు. పురుషులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసే ఆలోచనేదీ లేదని, గ్రామాలకు బస్సుల కనెక్టివిటీ పెంచుతామని వెల్లడించారు. ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని.. పీపీపీ పద్ధతిలో ఆర్టీసీ స్థలాల్లో ప్రాజెక్టులు చేపడతామని వివరించారు. మహాలక్ష్మి పథకం కింద అనవసరంగా జీరో టికెట్లు కొట్టే కండక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీకి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, ప్రతిమా శ్రీనివాసరావు లాంటి వారు పాత బకాయిలు చెల్లిస్తున్నారన్నారు. ఆర్టీసీలోకి కొత్తగా వెయ్యి బస్సులు తీసుకువస్తామన్నారు. ఇప్పటికే 100 వచ్చాయని, దశలుగా మిగతావి తెస్తామని చెప్పారు. ఆర్టీసీ కార్గో ఆదాయం రూ.150 కోట్లకు చేరిందని, రూ.2 వేల కోట్ల ఆదాయార్జన ధ్యేయంగా ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు.

బీఆర్ఎస్, బీజేపీలది డ్రామా

బీఆర్ఎస్– బీజేపీ ఒకటేనని.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొత్త డ్రామా మొదలుపెట్టాయని పొన్నం విమర్శించారు. బీఆర్ఎస్–బీజేపీ ఒకటి కాదని చెప్పుకొనేందుకు ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇస్తున్నారని.. అందుకే వాయిదాల పద్ధతుల్లో నోటీసులు వస్తున్నాయని ఎద్దేవా చేశారు.

బిహార్ మోడల్‌లో కులగణన

త్వరలోనే రాష్ట్రంలో కులగణన చేపడతామని, ఇందుకోసం బిహార్‌లో అమలు చేసిన ప్రక్రియను అనుసరిస్తామని మంత్రి పొన్నం తెలిపారు. ఈ గణన కోసం ప్రభుత్వ ఉద్యోగులను ఉపయోగించుకుంటామన్నారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు శిక్షణ ఇస్తామని, కొత్త కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ అంశంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి సూచనలు తీసుకుంటామన్నారు. కులగణన బిల్లును దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఆమోదించలేదని, అలాంటిది ఏదైనా ఉంటే బీఆర్ఎస్ నేతలు చూపాలని సవాల్ చేశారు. ఆటో కార్మికులకు ఏటా రూ.12వేలు ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చామని.. దీనిపై కేబినెట్‌లోనూ చర్చించామని మంత్రి తెలిపారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటోల రంగం ఇబ్బంది పడుతుందనడంలో వాస్తవం లేదని.. అందుకు ప్రతి నెలా అమ్ముడవుతున్న ప్యాసింజర్ ఆటోల గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు.



సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు. చిత్రంలో టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి మందడి ఉపేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎ.పరమేశ్వర్ రెడ్డి, మహిళా ప్రతినిధి జి.దీపారెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పంతంగి యాదగిరి

ఆర్ఏఐ తెలంగాణ చాప్టర్ చైర్మన్‌గా అవినాష్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) తెలంగాణ చాప్టర్ చైర్మన్‌గా నీరూస్ ఎన్సెంబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అవినాష్‌కుమార్ నియమితులయ్యారు. కో–చైర్మన్‌గా అపోలో ఫార్మసీ సీఈవో పి.జయకుమార్ బాధ్యతలు చేపట్టారు. రిటైలర్స్ అసోసియేషన్ సమావేశం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫలప్రదంగా జరిగిన ఈ సమావేశంలో ఈ రంగానికి సంబంధించిన అనేక అంశాలపైన సమగ్రమైన చర్చలు జరిగాయి. సభ్యులు తమ ఆలోచనలను, సలహాలు,సూచనలను అందజేశారు.



ఆయనలో జీవముండెను:
ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.7.15 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** పుబ్బ రా.12.20 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ఉ.6.35 నుండి 8.24 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.27 నుండి 5.13 వరకు, **అమృతఘడియలు:** సా.5.5.13 నుండి 7.01 వరకు.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నవీన్ పట్నాయక్ (ఒడిశా సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందనే దానితో నిమిత్తం లేకుండా ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. పాలకుడు కూడా అలాగే ఉండాలి. ఎన్నికలు ఎప్పుడున్నాయనే దానితో నిమిత్తం లేకుండా ప్రజలకు దగ్గరగా ఉండాలి.

ఎంత దగ్గరగా? ప్రజలకు అవసరం లేనంత దగ్గరగా! ప్రజలకసలు పాలకుడే గుర్తుకు రానంత దగ్గరగా! మనసులో పటం కట్టుకుని ఉన్నా కూడా... 'మనిషిని ఒకసారి చూస్తే బావుణ్ను' అనిపించేంత దగ్గరగా! వేడుకలో 'ఇంకా రాడేం' అని వందల తలల పైనుంచి తలెత్తి వెతుక్కునేంత దగ్గరగా! విలాపంలో ఎప్పుడొచ్చాడో తెలియకనే వచ్చి గట్టిగా గుండెకు హత్తుకునేంత దగ్గరగా!

పాతికేళ్లుగా చూస్తున్నాను. ఒడిశా ప్రజలెప్పుడూ నన్ను ఇది కావాలి, అది కావాలి అని అడగలేదు. నేనూ పాతికేళ్లుగా ప్రజలకు ఇదిస్తాను, అదిస్తాను అని చెప్పలేదు. ప్రజలకు ఏం కావాలో పాలకుడికి తెలిసుంటే పాలకుడిని ఏమీ అడిగే పనిలేదని ప్రజలకు తెలిసుంటుంది.



ప్రకృతి ఏ నోటిఫికేషన్‌ను చూసి పండ్లు ఫలాలను ప్రసాదిస్తుంది?! పాలకుడు కూడా ప్రకృతిలా ఉండాలి. చెట్టులా నీడవ్వాలి. నదిలా నీరివ్వాలి. సూర్యుడిలా ప్రాణకణమై జీవం పోయాలి.

"మార్నింగ్ నవీన్ జీ!"

పాండియన్!! ఎప్పుడొచ్చాడో తెలియకుండా వచ్చి, పక్కన నిలుచుని ఉన్నాడు. అతడూ అంతే. నోటిఫికేషన్ లేకుండా వచ్చేస్తాడు.

"మార్నింగ్ పాండియన్..." అన్నాను.

నా చేతిలోని వాటర్ ట్యూబ్‌ను చొరవగా అందుకుని మొక్కలకు నీళ్లు పడుతూ...

"నవీన్‌జీ! ఏ మొక్కకు ఎన్ని గుటకల నీళ్లు అవసరం అవుతాయో అంత కచ్చితంగా మీకెలా తెలుస్తుంది?" అని అడిగాడు పాండియన్! ఇన్నేళ్లలో ఒక్కరు కూడా నన్నీ ప్రశ్న అడగలేదు!

"తెలుస్తుంది పాండియన్. మొక్కలకు దగ్గరగా ఉంటుంటే, రోజూ మొక్కలను దగ్గరగా చూస్తుంటే..." అన్నాను నవ్వుతూ.

పాండియన్ భలే మనిషి. భలేగా ఉండే మనుషులు ప్రజల పనుల్లో తలమునకలై ఉన్న పాలకుడిని ఎప్పుడూ హుషారుగా ఉంచుతారు.

"ఏమిటిలా వచ్చారు ఆఫీసర్?!" అని అడిగాను పాండియన్‌ని... అతడు మొక్కలను తడుపుతున్న తీరును శ్రద్ధగా గమనిస్తూ.

పాండియన్ ఐఏఎస్ ఆఫీసర్. పదకొండేళ్లుగా ఒడిశాకు నా పర్సనల్ సెక్రెటరీగా ఉన్నారు. ఈమధ్యే జాబ్ వదిలేసి పార్టీలోకి వచ్చేశారు. వయసులో బాగా చిన్నవాడు. నాకిప్పుడు 77 ఏళ్లు కాకుండా 49 ఏళ్లు ఉండి ఉంటే నేను పాండియన్‌లా ఉంటానని అనుకోవటం నాకు గొప్ప శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతలా పనిచేస్తాడు.

"నవీన్‌జీ... మనం ఈసారి కొన్ని సీట్లను పోగొట్టుకోబోతున్నామా?" అని అడిగాడు పాండియన్!

పార్టీకి ఇప్పుడున్నవి లోక్‌సభలో 12 సీట్లు, అసెంబ్లీలో 111 సీట్లు. పాండియన్ అడుగుతున్నది వీటిల్లో కొన్ని తగ్గబోతున్నాయా అని.

"నవీన్‌జీ... రాజ్యసభలో ఖాళీ అయిన మూడు సీట్లనూ మనం గెలవగలిగి ఉండీ వాటిలో ఒక సీటును బీజేపీకి ఇచ్చేశాం. అలాగే 'ఒడిశాలో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాకుండా ఎవరూ ఆపలేరు...' అని రాజ్‌నాథ్ సింగ్ అనడంపైన కూడా మీరేమీ మాట్లాడటం లేదు. ఈ రెండూ నెత్తి మీద పెట్టుకుని 'మా పార్టీకే ఓటు వెయ్యండి...' అని ఓటర్లను ఎలా అడుగుతాం అని మన పార్టీ వాళ్లు అంటున్నారు..." అన్నారు పాండియన్.

"మరి మీకేమనిపిస్తోంది?" అని అడిగాను.

పాండియన్ మౌనంగా ఉన్నారు.

కొన్ని క్షణాల తర్వాత – "మొక్కలకు అంటుకట్టడం మంచిదే కదా అనుకుంటున్నాను నవీన్‌జీ..." అన్నారు.

ఉదయపుటెండకు చెమట పట్టి మెరుస్తున్న అతడి ముఖంలో నాకొక తోటమాలి కనిపించాడు. ఒడిశాకొక కొత్త తోటమాలి!

యెల్లో సేనలు డీలా!





జనతంత్రం

వర్ధెల్లి మురళి

పెత్తందారు ప్రమాదకరమైనవాడు. వాడు దశకంఠుడిలా కనిపిస్తాడు. మహాబలాఢ్యునిగా గోచరిస్తాడు. నల్లధనం కొండ మీద పడగవిప్పి కూర్చున్న నల్లతాచు వాడు. కనుక భయంకరంగానే కనిపిస్తాడు. వేయి పడగల కర్కోటకుడు పెత్తందారు. ఒక్కో వ్యవస్థలోకి ఒక్కో పడగను దూర్చి ప్రజాస్వామ్యాన్ని చెరపట్టిన విషసర్పం వాడు. ఆ సర్పరాజు పేరు ఏదైనా కావచ్చు. తక్షకుడు, కర్కోటకుడు, కాలకేయుడు, పింజారకుడు, చంద్రబాబు నాయుడు, రామోజీరావు... ఇలా! పేరేదైనా సరే పెత్తందార్ల దోపిడీకి కాపుకాయడమే ఆ రాజు పని. భయంకరంగా కనిపిస్తున్నాడని వాడికి భయపడితే పేదల బతుకులు ఎప్పటికీ మారవు. మన ఏడున్నర దశాబ్దాల ప్రజాస్వామ్యం ఇదే విషయాన్ని నిరూపించింది. ఈ విషసర్పపు కోరలు పీకేస్తేనే పేదలకు శాప విమోచనం దొరుకుతుంది. ఆ పని చేయడానికి నేను సిద్ధమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటిస్తున్నారు. తనతో కలిసి నడవడానికి సిద్ధమా అని ప్రశ్నిస్తూ జనసామాన్యాన్ని ఆయన సమాయత్తం చేస్తున్నారు.

పేద పిల్లలకు బంట్రోతు చదువులు... సంపన్నులకు దొరబాబు చదువులా? ఎన్నాళ్లీ దుర్నీతి? ఇది ప్రజాస్వామ్యమా... పెత్తందారీస్వామ్యమా?... ఇన్నాళ్లూ పెత్తందారీస్వామ్యమే విద్యారంగాన్ని పరిపాలించింది. ఈ దుష్పాలన ఇంకానా... ఇకపై చెల్లదని ఐదేళ్ల కింద జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో చాటింపు వేశారు. ఒక్క చదువే కాదు, సమస్త జీవన రంగాల్లోని అమానవీయత, అసమానతలపై ఆయన యుద్ధం ప్రకటించారు. రాజ్యాంగం ప్రసాదించిన సమాన అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాన్ని పేదవర్గాలకు సమకూర్చేందుకు కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. నవయుగానికి అవసరమైన 'మాగ్నాకార్టా'ను తనదైన పద్ధతిలో అమలు చేయడం ప్రారంభించారు. అది సత్ఫలితాలనిస్తున్నది.

రెండేళ్లు కోవిడ్ కోతకు గురైన ఈ అయిదేళ్ల పదవీ కాలంలోనే వైఎస్ జగన్ ప్రభుత్వం అద్భుతాలు చేసి చూపెట్టింది. ఒకపక్క ఆర్థికాభివృద్ధి సూచికలు ఊర్ధ్వ చలనాన్ని సూచిస్తుంటే, అదే సమయంలో మానవాభివృద్ధి సూచికలు కూడా అంతకంటే వేగంగా పరుగులు తీశాయి. ఇది గతంలో ఎన్నడూ చూడని అనుభవం. మానవాభివృద్ధిరంగంలో జగన్ ప్రభుత్వం చేస్తున్న వ్యయం ఇంకో పది పదిహేనేళ్లలో సమాజాన్ని ఉన్నత స్థాయికి చేర్చబోతున్నదని పలువురు ఆర్థిక నిపుణులు అంచనాలు వేస్తున్నారు. కొన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలపై చేసే వ్యయాన్ని గతంలో కొందరు ఆర్థికవేత్తలు తప్పుపట్టేవారు. 'గుడ్ ఫిలాసఫీ బట్ బ్యాడ్ ఎకనామిక్స్' అంటూ వెటకారం చేసేవారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భారీ ఎత్తున చేపట్టిన మానవాభివృద్ధి కార్యక్రమాల్లో ఏ ఒక్కదానిపైనా ఆర్థికవేత్తలు ఇటువంటి వ్యాఖ్యానం చేయకపోవడం విశేషం. పైపెచ్చు ఈ ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం కూడా 'గుడ్ ఫిలాసఫీ అండ్ గుడ్ ఎకనామిక్స్'గా పరిగణన పొందాయి. అందువల్లనే అవి సత్ఫలితాలనిస్తున్నాయి. మానవాభివృద్ధి సూచికల్లో, స్థూల ఉత్పత్తి పెరుగుదలలో, ఉపాధి కల్పనలో ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని పేద వర్గాల్లో ఒక గొప్ప రాజకీయ చైతన్యం తొణికిసలాడుతున్నది. సాధికారతలోని ఆత్మగౌరవ భావన వారి అనుభవంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తున్నది. సాధికారత పథంలో మహిళలు ముందడుగు వేశారు. ఈ కారణాల వలన రాష్ట్రంలో వైఎస్ జగన్ రాజకీయ శిబిరం శత్రు దుర్భేద్యంగా కనిపిస్తున్నది. అతి భయంకరుడూ, గండర గండడనుకున్న పెత్తందారులను తరిమికొట్టొచ్చన్న భావన బలపడుతున్నది. ఈ పెత్తందారీ శిబిరానికి తెలుగు నాట కాపలాదార్లయిన సర్పరాజులు చంద్రబాబు, రామోజీ వగైరాలని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చంద్రబాబు పార్టీ కూడా చాలా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని చెబుతున్నది కదా! మరి వాళ్లెట్లా పెత్తందారీ వర్గాల ప్రతినిధులవుతారు? ఈ సంశయం కొంతమందికి కలగవచ్చు.

చంద్రబాబు పార్టీది పూటకూళ్ల సంక్షేమ సిద్ధాంతం. అన్న క్యాంటీన్లు, అక్క క్యాంటీన్లకు ఇందులో ప్రాధాన్యం ఉంటుంది. ప్రతి సంక్షేమ పథకం వెనుక ఒక ఫిలాసఫీ ఉండాలి. ఆ పథకాన్ని అమలు చేయడం వల్ల లబ్ధిదారుకు కలిగేది తాత్కాలిక ఉపశమనమైతే దాన్ని కంటితుడుపు సంక్షేమమంటారు. తాత్కాలిక ఉపశమనంతోపాటు లబ్ధిదారుని అభ్యున్నతికీ, సాధికారతకూ ఉపయోగపడే విధంగా పథకాన్ని డిజైన్ చేస్తే అది మానవాభివృద్ధి పథకం కింద లెక్క. ఉదాహరణకు పేద జంటలకు పెళ్లి కానుక అందజేసే పథకాన్ని చంద్రబాబు కూడా అమలు చేశారు. పద్దెనిమిది వేల అర్హులైన జంటలకు ఎగవేసినందువల్ల తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం వారికి చెల్లించిందనేది

చంద్రబాబు పార్టీది పూటకూళ్ల సంక్షేమ సిద్ధాంతం. అన్న క్యాంటీన్లు, అక్క క్యాంటీన్లకు ఇందులో ప్రాధాన్యం ఉంటుంది. ప్రతి సంక్షేమ పథకం వెనుక ఒక ఫిలాసఫీ ఉండాలి. ఆ పథకాన్ని అమలు చేయడం వల్ల లబ్ధిదారుకు కలిగేది తాత్కాలిక ఉపశమనమైతే దాన్ని కంటితుడుపు సంక్షేమమంటారు. తాత్కాలిక ఉపశమనంతోపాటు లబ్ధిదారుని అభ్యున్నతికీ, సాధికారతకూ ఉపయోగపడే విధంగా పథకాన్ని డిజైన్ చేస్తే అది మానవాభివృద్ధి పథకం కింద లెక్క. ఉదాహరణకు పేద జంటలకు పెళ్లి కానుక అందజేసే పథకాన్ని చంద్రబాబు కూడా అమలు చేశారు. పద్దెనిమిది వేల అర్హులైన జంటలకు ఎగవేసినందువల్ల తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం వారికి చెల్లించిందనేది వేరే విషయం. దాన్ని కాసేపు పక్కన పెడదాం. ఇదే పథకాన్ని 'కల్యాణమస్తు' పేరుతో జగన్ ప్రభుత్వం కూడా అమలు చేసింది. కానీ అది కాదు అసలు విషయం. పథకానికి అర్హత ప్రమాణాలను కొత్తగా నిర్దేశించింది. వధువుకు 18 యేళ్లు, వరుడికి 21 యేళ్లు వయఃపరిమితి చట్టపరమైన నిబంధన. దాన్ని ఖచ్చితంగా అమలుచేయాలని నిర్ణయించింది. దాంతోపాటు పదవ తరగతి ఉత్తీర్ణతను కూడా అర్హతగా చేర్చింది. అందువల్ల తప్పనిసరి టెన్త్ పాసవుతారు. ఆడపిల్లలకు పెళ్లి కోసం ఇంకో మూడేళ్ల గడువుంటుంది. ఇంటర్ వరకూ 'అమ్మ ఒడి' కూడా లభిస్తున్నందువల్ల ఆ పిల్లలు ఖచ్చితంగా ఇంటర్ కూడా పూర్తి చేస్తారు. డిగ్రీలో చేరుతారు. ఈ విధంగా ఒక్కో సంక్షేమ పథకాన్ని వారి కాళ్ల మీద నిలబడటానికి తోడ్పతే విధంగా డిజైన్ చేశారు. ఇది ఉదాహరణ మాత్రమే! జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమం వెనుక ఇటువంటి ఎంపవర్‌మెంట్ ఫిలాసఫీ ఉంటుంది.

వేరే విషయం. దాన్ని కాసేపు పక్కన పెడదాం. ఇదే పథకాన్ని 'కల్యాణమస్తు' పేరుతో జగన్ ప్రభుత్వం కూడా అమలు చేసింది. కానీ అది కాదు అసలు విషయం. పథకానికి అర్హత ప్రమాణాలను కొత్తగా నిర్దేశించింది. వధువుకు 18 యేళ్లు, వరుడికి 21 యేళ్లు వయఃపరిమితి చట్టపరమైన నిబంధన. దాన్ని కచ్చితంగా అమలుచేయాలని నిర్ణయించింది. దాంతోపాటు పదవ తరగతి ఉత్తీర్ణతను కూడా అర్హతగా చేర్చింది. అందువల్ల తప్పనిసరి టెన్త్ పాసవుతారు. ఆడపిల్లలకు పెళ్లి కోసం ఇంకో మూడేళ్ల గడువుంటుంది. ఇంటర్ వరకూ 'అమ్మ ఒడి' కూడా లభిస్తున్నందువల్ల ఆ పిల్లలు కచ్చితంగా ఇంటర్ కూడా పూర్తి చేస్తారు. డిగ్రీలో చేరుతారు. ఈ విధంగా ఒక్కో సంక్షేమ పథకాన్ని వారి కాళ్ల మీద నిలబడటానికి తోడ్పతే విధంగా డిజైన్ చేశారు. ఇది ఉదాహరణ మాత్రమే! జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమం వెనుక ఇటువంటి ఎంపవర్‌మెంట్ ఫిలాసఫీ ఉంటుంది.

ఈ ఫిలాసఫీ సంక్షేమ పథకాలకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రభుత్వ ప్రాధమ్యాల్లో కూడా ఇది ప్రతిఫలిస్తుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, స్వయం ఉపాధి వంటి రంగాలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ పేదవర్గాల ప్రజలు కూడా పెద్ద వారితో సమానంగా నిలబడేందుకు అవకాశాలు కల్పించింది. ఇండియాలోని అత్యున్నతస్థాయి కార్పొరేట్ విద్యను రాష్ట్రంలోని పేద విద్యార్థి కూడా అభ్యసించగలిగే ఏర్పాట్లు చేసింది. నాణ్యమైన వైద్యం పేదల ఇళ్ల వాకిళ్లకు చేరువైంది. చిన్న సన్నకారు రైతులు కూడా లాభసాటి సేద్యం చేయడానికి అనేక కార్యక్రమాలను అమలుచేస్తూ ఆర్బీకే సెంటర్ల పేరుతో గ్రామ గ్రామానా ఊతకర్రలను నిలబెట్టింది. పేదవర్గాల తలరాతలు మార్చే ఇటువంటి ప్రాధమ్యాలు చంద్రబాబు సర్కారులో కనిపించలేదు. విభజిత రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో చంద్రబాబు దేనికి ప్రాధాన్యతనిచ్చారో అందరికీ తెలిసిందే. అమరావతి సింగిల్ పాయింట్ ఎజెండా. అదో అతి పెద్ద రియల్ ఎస్టేట్ వెంచర్. కాంట్రాక్టర్లకూ, పెట్టుబడులు పెట్టిన పెత్తందార్లకూ మాత్రమే ఉపయోగపడే ఎజెండా. ఒక తాత్కాలిక సెక్రటేరియట్‌ను కట్టి అందులో 30 శాతం కమిషన్‌ను తీసుకున్నట్టు ఇప్పుడు ఆధారాలు లభించాయి.

పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏటీఎమ్‌గా మార్చుకున్నారని ఈ దేశ ప్రధాని స్వయంగా చెప్పిన విషయాన్ని ఈ రాష్ట్ర ప్రజలు ఇంకా మరచిపోలేదు. కమిషన్ల కక్కుర్తికి ప్రతిష్ఠాత్మకమైన పోలవరాన్ని ఆయన బలిపెట్టారు. నాసిరకం పనుల కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని పనుల్లో అవాంఛనీయమైన ఆలస్యం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి ఈ రకంగా చంద్రబాబు తీరని ద్రోహం చేసిన వారయ్యారు. ఇదొక్కటే కాదు ఆయన ప్రభుత్వ ప్రాధమ్యాల వల్ల భారీగా లబ్ధిపొందిన వారు ఆయన, ఆయన అంతరంగికులు, కాంట్రాక్టర్లు, సంపన్నులు. చిల్లర లబ్ధి పొందిన వాళ్లు జన్మభూమి కమిటీల్లోని టీడీపీ కార్యకర్తలు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ప్రాధమ్యాల వల్ల లబ్ధి పొందినవారు రాష్ట్రంలోని 85 శాతం కుటుంబాల ప్రజలు.

ఈ ప్రాధమ్యాల కారణంగానే జగన్ ప్రభుత్వానికి 'పేదల ప్రభుత్వం' అనే పేరు వచ్చింది. ఈ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే తెలుగుదేశం, యెల్లో మీడియా కూటమికి పెత్తందార్లు అనే పేరు వచ్చింది. ఇంగ్లీషు మీడియం, అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులు మన పేదవర్గాల భవిష్యత్తును సుందరంగా మార్చివేస్తాయి. జగన్ ప్రభుత్వ వైద్య విధానాలు బీదా బిక్కీ తేడా లేకుండా ఆరోగ్య సమాజాన్ని నిర్మిస్తాయి. వ్యవసాయ విధానాలు సాగుబాటను సంపన్నం చేస్తాయి. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్నారు కనుకనే వారిని పెత్తందారుల తొత్తులుగా పరిగణించవలసి వస్తున్నది. ఈ ఫిలాసఫీని పక్కన పెట్టి జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడా? ఆయనది పేదల ప్రభుత్వం ఎట్లా అవుతుందని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు వితండవాదాన్ని లేవదీస్తున్నారు. ఒక నాయకుడు ధనికుడా, పేద వాడా అన్నది కాదు సమస్య. ఆ నాయకుని విధానాలు ఎవరి పురోభివృద్ధికి తోడ్పడుతున్నాయనేదే ముఖ్యం. ఆ లెక్కన జగన్ ప్రభుత్వం నిస్సందేహంగా పేదల ప్రభుత్వమే! చంద్రబాబు పార్టీ పెత్తందార్ల వేదికే!

జనసేన పార్టీని తన ప్రయోజనాల కోసం చంద్రబాబే పెట్టించాడనే అభిప్రాయానికి ఇవ్వాళ్టి అభ్యర్థుల ప్రకటన మరింత బలం చేకూర్చింది. కనీసం మూడో వంతు సీట్లయినా వస్తాయని ఆశిస్తున్న జనసేన కార్యకర్తలు 24 సీట్ల లెక్కతో తీవ్ర నిరాశలో కూరుకొని పోయారు. ఈ రెండు పార్టీల బలంతోనే జగన్ పార్టీని ఎదుర్కోలేమనీ, బీజేపీని కూడా తమ తరఫున రంగంలోకి దించాలనేది చంద్రబాబు తలపోత. బీజేపీ వాళ్లు తన వంటి ఊసరవెల్లిని నమ్ముతారో లేదోనని నాలుగేళ్లుగా పవన్ కల్యాణ్ ద్వారా లాబీయింగ్ నడిపిస్తున్నారు. అదేకాకుండా తన సొంత మనుషులను కూడా ఆ పార్టీలోకి జొప్పించారు. ఇప్పటివరకు బీజేపీ ఈ కూటమిలో చేరుతుందో లేదో స్పష్టత లేదు.

పరిస్థితులను గమనిస్తుంటే చంద్రబాబు వంటి మోసకారి నేతను నమ్మలేమని బీజేపీ భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. అదే నిజమైతే చంద్రబాబు – పవన్ పార్టీలే కూటమిగా పోటీ చేయాలి. 24 సీట్లతో జూనియర్ భాగస్వామి పాత్ర పవన్‌ది. ఈ మాత్రం సీట్లకే ఎన్ని గంభీరోపన్యాసాలు చేశారు పవన్? వాళ్లు 'సిద్ధం' అంటే మేము 'యుద్ధ'మని మొన్ననే ఆయన గర్జించినట్టు కూడా గుర్తు.

రాష్ట్రంలోని పేదవర్గాల్లో ఈ రకమైన అవగాహన బలపడుతున్నది. ఫలితంగా పెత్తందారీ రాజకీయ శిబిరం తీవ్ర సంక్షోభంలోకి కూరుకొని పోయింది. జనసేన పార్టీని తన ప్రయోజనాలకోసం చంద్రబాబే పెట్టించాడనే అభిప్రాయానికి తాజా అభ్యర్థుల ప్రకటన మరింత బలం చేకూర్చింది. కనీసం మూడో వంతు సీట్లయినా వస్తాయని ఆశిస్తున్న జనసేన కార్యకర్తలు 24 సీట్ల లెక్కతో తీవ్ర నిరాశలో కూరుకొని పోయారు. ఈ రెండు పార్టీల బలంతోనే జగన్ పార్టీని ఎదుర్కో లేమనీ, బీజేపీని కూడా తమ తరఫున రంగంలోకి దించాలనేది చంద్రబాబు తలపోత. బీజేపీ వాళ్లు తనవంటి ఊసరవెల్లిని నమ్ముతారో లేదోనని నాలుగేళ్లుగా పవన్ కల్యాణ్ ద్వారా లాబీయింగ్ నడిపిస్తున్నారు. అదేకాకుండా తన సొంత మనుషులను కూడా ఆ పార్టీలోకి జొప్పించారు. ఇప్పటివరకు బీజేపీ ఈ కూటమిలో చేరుతుందో లేదో స్పష్టత లేదు.


పరిస్థితులను గమనిస్తుంటే చంద్రబాబు వంటి మోసకారి నేతను నమ్మలేమని బీజేపీ భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. అదే నిజమైతే చంద్రబాబు – పవన్ పార్టీలే కూటమిగా పోటీ చేయాలి. 24 సీట్లతో జూనియర్ భాగస్వామి పాత్ర పవన్‌ది. ఈ మాత్రం సీట్లకే ఎన్ని గంభీరోపన్యాసాలు చేశారు పవన్? వాళ్లు 'సిద్ధం' అంటే మేము 'యుద్ధ'మని మొన్ననే ఆయన గర్జించినట్టు కూడా గుర్తు. ఒకసారెప్పుడో జనసేన కార్యకర్తల సభలో అభిమానులు 'సీఎం... సీఎం' అనే నినాదాలు చేశారు. అందుకు పవన్ చెప్పిన సమాధానం ఏమిటి? 'మొన్నటి ఎన్నికల్లో కనీసం 40 సీట్లలో గెలిపించి ఉన్నట్లయితే సీఎం పదవి అడిగేవాడిని. ఇప్పుడెలా అడుగుతామ'ని అశక్తతను ప్రకటించాడు. ఇప్పుడు కూడా అంతే! 40 సీట్లలో పోటీ కూడా చేయడం లేదు. పోటీ చేస్తున్న 24 సీట్లలో పావలా పర్సెంట్ గెలిచినా 6 సీట్లే. కనుక ఐదేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో కూడా ఆయన సీఎం పదవి అడగలేరు. ఎందుకంటే అయిదేళ్ల తర్వాత కూడా కూటమి కొనసాగుతుందని ఆయనే చెప్పారు కనుక!

రెండు పార్టీలూ కలిసి 99 మంది అభ్యర్థులను ప్రకటించాయి. ఇందులో 18 మందే బీసీ వర్గాలకు చెందినవారు. ఇంకా ప్రకటించాల్సింది 76 సీట్లు. అందులో 14 రిజర్వుడు సీట్లున్నాయి. పోతే 62 సీట్లు. వాటిలో బీసీలకు, మైనారిటీలకు ఏమాత్రం కేటాయిస్తారో చూడాలి. ఆ వర్గాల గురించి మాట్లాడే అర్హత టీడీపీ కోల్పోయినట్టే! బీసీ ఓట్లు పూర్తిగా దూరమైనట్టే! అభ్యర్థుల ఎంపికలో ప్రయోగాలు చేయడానికి కూడా చంద్రబాబు భయపడినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. పవన్ కల్యాణయితే తన అభ్యర్థిత్వాన్ని కూడా తొలి జాబితాలో ప్రకటించుకోలేని స్థితిలో ఉన్నారు. కేటాయించిన 24 సీట్లలో ఐదుగురి పేర్లే ఆయన ప్రకటించగలిగారు. పాపం, ఆయన ముఖకవళికల్లో ఎక్కడా ఉత్సాహం కనిపించలేదు. పార్టీ శ్రేణులు జావగారి పోకుండా ఉండేందుకే కుప్పం నుంచి తన పేరును బాబు ప్రకటించారు గానీ, చివరి నిమిషంలో అక్కడ మార్పు ఉంటుందనేది విశ్వసనీయ సమాచారం. కానీ తొలి జాబితాతోనే శ్రేణులు డీలా పడ్డాయి. అధికార వైసీపీ ఇప్పటికే సగం యుద్ధాన్ని గెలిచింది. మన పెత్తందారు ఇంతెంతమాత్రమూ బలాఢ్యుడు కాదు. అతడొక గాలి తీసిన బెలూన్ మాత్రమే.

vardhelli1959@gmail.com

పెరిగే వయసుతో... నచ్చే రుచుల మార్పు

విశ్లేషణ



కె.బి. గోపాలం

రుచి కేవలం నాలుక మీద మాత్రమే తెలుస్తుంది అని చాలామంది అనుకుంటారు. ఒక రకం తిండి మనకు ఇష్టమా లేదా అని తెలియడానికి నాలుక ఒక్కటే ఆధారం కాదు. ఉదాహరణకు మనం ఏదో ఒక పండును కొరుకుతాము. ఒక్కసారిగా మెదడుకు రకరకాల నాడీ రసాయన స్పందనలు అందుతాయి. వాటి కారణంగా ఆ పండును మరొకసారి మనం కొరుకుతామా లేదా అన్నది నిర్ణయం అవుతుంది. నాలుక మీద ఉండే రుచిని గుర్తించే కణాలను 'టేస్ట్ బడ్స్' అంటారు. అంగిలి అంటే నోటిలో పైభాగం, గొంతు లోపలి పక్క, ఇంకొంచెం కిందకు ఉండే ఈసోఫేగస్ లాంటివన్నీ తిండి గురించిన సమాచారాన్ని మెదడుకు చకచకా పంపిస్తాయి. దానితో నోటిలోకి అందిన తిండి రుచి తెలుస్తుంది.

మనకు కలకాలంగా ఆరు రుచులు అన్న సంగతి గురించి చెబుతున్నారు. శాస్త్రజ్ఞులు ఇంకొక పక్కన ఉన్నది ఐదు రుచులు మాత్రమే అంటున్నారు. తీపి, పులుపు, ఉప్పు, చేదులతోపాటు ఉమామి అనే ఒక కొత్త రుచిని కూడా ఈ మధ్యన చెబుతున్నారు. మనిషి వయసు పెరుగుతున్న కొద్దీ ఈ రుచులు తెలుసుకొని ఇష్టపడే లక్షణాలు మారుతూ ఉంటాయట.

'రుచులు తెలిసేది మెదడు కారణంగానే! ఈ మెదడు మొండిగా ఉండదు. మారుతూ ఉంటుంది. కనుకనే వయస్సుతో పాటు రుచి, వాసనలను గ్రహించే తీరు మారుతూ పోతుంది' అంటున్నారు ఫిలడెల్ఫియా పరిశోధకురాలు జూలీ మెనెల్లా. ముఖ్యంగా బాల్యంలో అంటే మరీ చిన్న వయసులో రుచులను ఇష్టపడడంలో చాలా మార్పులు వస్తాయి అంటారావిడ. మరీ చిన్న వయసులో రుచి గురించిన తీరు చాలా వేరుగా ఉంటుంది. అయితే ఆ ప్రభావం మాత్రం చాలా కాలంగా కొనసాగుతుంది అని ఆమె వివరించారు.

తీపి, ఉప్పు రుచిగల తిండి పదార్థాలను ఇష్టపడడం అన్నది బాల్యంలో మెదడులో గట్టిగా పాతుకుపోయి ఉంటుంది. మానవ పరిణామం దృష్ట్యా చూస్తే తీపి అన్నది ఎక్కువ శక్తి గల ఆహార పదార్థాలతో సంబంధం కలిగిన విషయం. ఇక శరీరానికి ఎంతో అవసరమైన ఖనిజలవణాలు ఉప్పగా ఉండే తిండితో అందుతాయి. చిన్న వయసులో ఉన్న వారికి శరీరం పెరుగుదల కారణంగా చాలా శక్తి అవసరం ఉంటుంది అన్నది తెలుసు. 'అందుకే ఆ వయసులో ఎక్కువ శక్తిని అందించగల తీయని పదార్థాల వైపు దృష్టి ఉంటుంది. ఈ లక్షణం శరీరంలోనే సహజంగా ఉంటుంది.



శరీరానికి శక్తి ఆ రకంగా అందుతుంది' అంటారు మెనెల్లా. ఇక చేదు రుచి గురించి చూస్తే, చేదు రుచి మనకు ఇష్టం లేని పదార్థాలతో గట్టిగా ముడిపడి ఉంటుంది. అయినప్పటికీ వాటిని తిన్నందువల్ల నష్టం జరగదు, మంచి జరగవచ్చు అని అర్థమైతే అప్పుడు వాటిని అంగీకరించే మానసిక పరిస్థితి వస్తుంది.

బిడ్డలు తల్లి కడుపులో ఉండగానే ఆహార పదార్థాల రుచి అలవాటు అవుతుంది అని గమనించారు. గర్భంతో ఉన్న స్త్రీలకు చేదు రుచి పట్ల ఏవగింపు ఉంటుంది. తల్లి తీసుకుంటున్న ఆహారం ప్రభావం కడుపులోని బిడ్డ మీద కూడా పడుతుంది. తల్లి ఏదో మందు మింగితే కడుపులోని పాప ముఖం ముడుచుకుంటున్నట్టు అల్ట్రాసౌండ్ పరీక్షలలో కనిపించింది.

బాల్యం, యవ్వనం గడుస్తున్న కొద్దీ ఆ మేర రుచులకు స్పందించడం తగ్గుతుంది. చేదును అంగీకరించడం మొదలైన కొద్దీ, తీపి, ఉప్పుల మీద కొంత ఆసక్తి తగ్గినా తగ్గవచ్చు. కనుకనే యుక్త వయసు దాటిన తరువాత తిండి విషయంగా అంతగా పట్టింపు ఉండకపోవచ్చు. అప్పుడిక అంతకు ముందు ఏవగించుకున్న తిండి పదార్థాలను కూడా తినే పద్ధతి మొదలవుతుంది.

50వ పడిలో పడిన తరువాత నాలుక మీద అంతవరకు ఉన్న పదివేల రుచి కణాల సంఖ్య రాను రాను తగ్గుతుంది. అవి మళ్లీ తిరిగి పెరగవు. అంతకు ముందు మాత్రం అవి పది రోజులకు ఒకసారి సమసిపోయి తిరిగి పుడుతుంటాయి. పాడయిన కణాల స్థానంలో కొత్తవి రాకపోవడంతో రుచి తెలియడం తగ్గుతుంది. వాసన విషయంగా కూడా ఇదే పరిస్థితి ఉంటుంది.

అయితే ఈ మార్పులు అంతగా గుర్తించగలిగే స్థాయిలో ఉండకపోవచ్చు. ఏదో ఒక్క రుచీ, ఒక్క వాసనకే పరిమితం కాకపోవచ్చు. అంటే అన్ని వాసనలూ తెలియకుండా పోయే పరిస్థితి ఉండదు. ఏవో కొన్ని రకాలు, ఉదాహరణకు మల్లెల వాసన తెలియకపోవచ్చు, ఉల్లివాసన మాత్రం బాగా తెలియవచ్చు.

రుచులు తెలియకుండా పోవడానికి వయసు ఒకటే కారణం కాదు. రక్తపు పోటును తగ్గించడానికి వాడే కొన్ని మందులు కూడా ఈ రకం ప్రభావాన్ని చూపిస్తాయి. శ్వాస మండలంలోని పైభాగంలో వచ్చే ఆరోగ్య సమస్యల చికిత్సకు ఇచ్చే మందులు కూడా రుచి, వాసనలు తెలియకుండా చేస్తాయి. ఈ విషయం కోవిడ్ వల్ల తెలిసింది. అసలు కోవిడ్ గురించి మొదటి సూచనలుగా ఈ లక్షణాలను ఎంచుకున్నారు. ప్రభావం తగ్గిన తర్వాత చాలామందికి రుచి, వాసనలు తెలియడం తిరిగి మొదలయింది. కొందరికి మాత్రం ఆ రకంగా జరగలేదు.

వ్యాసకర్త సైన్స్ రచయిత । 98490 62055

తెరిచివున్నా చూడని కళ్ళు!

ఒక్కొక్కసారి మంచి పనులు చేయటానికి అబద్ధం చెప్పవలసి వస్తుంది. లోకోపయోగ కార్యం కోసం అసత్యం తప్పనిసరి అవుతుంది. ఏదో అతీత శక్తి మనిషి చేత ఆ విధంగా తానే చెప్పిస్తుంది.

ఒక అడవిలో ఓ మునీశ్వరుడు కనులు తెరచుకొని మౌనంగా తపోనిష్ఠలో ఉన్నాడు. ఒక వేటగాడు ఒక లేడిని తరుముకుంటూ రాగా, లేడి ఆ తాపసి ముందు పరుగెత్తుతూ అదృశ్యమైంది. వేటగాడు తాపసిని చూసి 'లేడి ఎటువైపు వెళ్ళింది' అని అడిగాడు. తాపసి తాను చూడలేదని సైగలతో చెప్పాడు. వేటగాడు 'కళ్ళు తెరచే ఉండి, చూసి కూడా చూడలేదని చెప్పటం తప్పు కాదా' అన్నాడు. అప్పుడు ముని, ''ఓ వేటగాడా! నువ్వన్నది నిజమే! నేను కళ్ళు తెరిచే ఉన్నాను. నేను పలికింది సత్యమే. నా వంటి తాపసులం కొందరం ఈ అడవిలో తపస్సు చేసుకుంటూ జీవిస్తున్నాము. మా మనసు మమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళిపోయి చాలా కాలమైంది. మెలకువ, కల, నిద్ర అనే మూడు అవస్థలు దాటి ఉన్న మాకు కన్ను తెరచినా ఏదీ కనబడదు. అలాగే మిగిలిన ఇంద్రియాలు కూడా! నా కళ్ళు తెరచి ఉండటం వల్ల నేను చూశానని నువ్వు భ్రమ పడుతున్నావు. అది సరి కాదు. ఈ లౌకిక నేత్రం తెరచి వున్నా దాని వెనక ఉండి చూసేది మనసే కదా! మనసు లేనపుడు కనులు తెరచినా, మూసినా జరిగేది ఒకటే. కాబట్టి మేం చూసినా చూడని వారమే!'' అన్నాడు.



ఈ మాటలలో ఒక్క మాట కూడా వేటగానికి అర్థం కాలేదు. అయినా, తపోధనుల పట్ల ఉండే శ్రద్ధాభక్తుల వల్ల ఎక్కువ వాదించకుండా వెళ్ళిపోయాడు. ఒక విధంగా మౌని చెప్పింది నిజమే. మనసు లేనపుడు కనులు తెరచినా చూడలేదు. మరొక విధంగా, లేడిని కాపాడటానికి బోయవానికి అసత్యం చెప్పి ఉండవచ్చు. మేలు కలిగించే అసత్యం చెప్పినా దోషం లేదని ఆర్యోక్తి ఉండనే ఉంది.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

వనం చేరిన సమ్మక్క..

తిరిగి అడవికి చేరిన వన దేవత.. కన్నెపల్లికి సారలమ్మ

- నిత్యపూజ స్థలాలకు చేరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు..
- ఉద్విగ్నంగా సాగిన చివరి ఘట్టం.. భారీగా భక్తుల రాక
- ముగిసిన మేడారం మహాజాతర.. బుధవారం తిరుగువారం పండుగ
- మళ్లీ 2026 మాఘమాసంలో జరగనున్న మహా జాతర


శనివారం మధ్యాహ్నం మేడారం గద్దెల ప్రాంగణంలో అమ్మవార్లను దర్శించుకోవాడినికి తరలివచ్చిన భక్త జనం

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం మహాజాతర ముగిసింది. నాలుగు రోజులుగా కోటిన్నర మంది భక్తుల మొక్కులందుకున్న వన దేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను శనివారం సాయంత్రం వడ్డెలు (గిరిజన పూజారులు) ప్రత్యేక పూజల మధ్య వనప్రవేశం చేయించారు. ఉద్విగ్నంగా సాగిన ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు జాతర చివరిరోజు కూడా భక్తులు పోటెత్తారు. వనదేవతలు అడవికి చేరే వేడుక సమయంలో వాన జల్లులు కురవడం గమనార్హం.

చివరిరోజు కార్యక్రమం ఇలా..

సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల వన ప్రవేశం ప్రక్రియ శనివారం సాయంత్రం 4 గంటలకు మొదలై సుమారు రాత్రి ఏడున్నర వరకు సాగింది. తల్లులను వనం నుంచి జనంలోకి తీసుకొచ్చిన పూజారులే తిరిగి అడవిలోకి చేర్చారు. ఈ క్రమంలో మధ్యాహ్నం నుంచే గద్దెల దగ్గర గిరిజన ఆచారాలతో ప్రత్యేక పూజలు జరిగాయి. సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య నేతృత్వంలోని వడ్డెల బృందం గద్దెలపైకి చేరుకుంది. పూజల తర్వాత సమ్మక్క తల్లిని గద్దెల ప్రాంగణం నుంచి భక్తులను దాటుకుంటూ బయటికి తీసుకెళ్లి రాత్రి 7.27 గంటల సమయంలో చిలకలగుట్టకు చేర్చారు. ఇలా ఓవైపు వనప్రవేశ పూజలు జరుగుతుండగానే గిరిజన సంప్రదాయం ప్రకారం.. సమ్మక్క గద్దెలపై భక్తులు సమర్పించిన చీరసారెలు, బంగారం, పసుపు కుంకుమలను స్థానికులు తీసుకునే కార్యక్రమం జరిగింది. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా ఈ ప్రసాదాన్ని తీసుకునేందుకు పోటీపడ్డారు. దీనితో ఒక్కసారిగా గద్దెల ప్రాంగణమంతా కోలాహలంగా మారింది.

కన్నెపల్లికి సారలమ్మ..

సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య, ఇతర వడ్డెలు సారలమ్మ గద్దె వద్ద గిరిజన సంప్రదాయం ప్రకారం రహస్య పూజలు నిర్వహించారు. గద్దెలపై ఉన్న సారలమ్మ రూపాన్ని కాక సారయ్య నేతృత్వంలోని పూజారుల బృందం కన్నెపల్లికి తీసుకెళ్లింది. గద్దెపై ప్రతిష్ఠించిన మొంటె (వెదురుబుట్ట)ను తీసుకుని జంపన్న వాగు మీదుగా కన్నెపల్లికి చేర్చారు. ఈ సమయంలో భక్తులు పూజారులను తాకడానికి ప్రయత్నించారు. మరోవైపు గోవిందరాజులు, పగిడిద్దరాజుల గద్దెల వద్ద కూడా చివరిరోజు పూజలు జరిగాయి. ఊరేగింపుగా పగిడిద్దరాజును మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లకు.. గోవిందరాజులును ఏటూరు నాగారం మండలం కొండాయికి తీసుకెళ్లారు. కాగా గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి దేవతల వనప్రవేశ సమయంలోనూ భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. దేవతల వనప్రవేశంతో మేడారం మహాజాతర ముగిసిందని ములుగు జిల్లా కలెక్టర్ త్రిపాఠి ప్రకటించారు. ప్రస్తుత మేడారం జాతరకు మొత్తంగా 1.45 కోట్ల మంది భక్తులు వచ్చారని.. వారు ఇక్కడికి చేరుకునేందుకు లక్షన్నర వాహనాలు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

బుధవారం తిరుగువారం పండుగ..

సమ్మక్క–సారలమ్మలకు ఈనెల 28న పూజారులు తిరుగువారం పండుగ నిర్వహించనున్నారు. మహాజాతర ముగిసిన తర్వాత ఇలా తిరుగువారం పండుగ సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని.. జాతరకు వచ్చిన భక్తులు చల్లంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని వేడుకుంటామని పూజారులు తెలిపారు. తిరుగువారం పండుగ సందర్భంగా బుధవారం మేడారం గ్రామస్తులు, ఆదివాసీలు, పూజారుల కుటుంబీకులు ఇళ్లను అలికి శుద్ధి చేస్తారు. సమ్మక్కకు ప్రత్యేక పూజలు చేస్తారు. మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి వద్ద అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. పూజారులు జాతర సమయంలో తమకు ఇళ్లకు ఆహ్వానించిన బంధువులకు కొత్త వస్త్రాలు పెట్టి సాగనంపుతారు. మేడారం మహాజాతర తిరిగి 2026 మాఘమాసంలో జరగనుంది.


సారలమ్మను వనప్రవేశం చేయానికి తీసుకెళ్తున్న వడ్డెలు, పూజారులు

గద్దెను వీడి వనప్రవేశం చేసినదిలా..

5.10 గంటలకు గోవిందరాజులు
5.30 గంటలకు పగిడిద్దరాజు
7.27 గంటలకు సమ్మక్క వనప్రవేశం
7.40 గంటలకు సారలమ్మ వనప్రవేశం
ఆనవాయితీ ప్రకారం తొలుతగా గోవిందరాజులు, పగిడిద్దరాజులను గద్దెల మీది నుంచి సాగనంపుతారు. వారు వెళ్లగానే సమ్మక్క వన ప్రవేశ కార్యక్రమం ఉంటుంది. చివరిగా సారలమ్మను తీసుకెళతారు.

క్లుప్తంగా...

ఆర్ఎస్సైపై ఎస్పీ దాడి

- మేడారం జాతరలో రోప్‌పార్టీ ఇన్‌చార్జిపై దూషణలు

వరంగల్ క్రైం: మేడారం మహాజాతరలో విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఎస్సై రవీందర్‌పై ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం దాడి చేయడాన్ని వరంగల్ పోలీస్ అధికారుల సంఘం శనివారం తీవ్రంగా ఖండించింది. రోప్ పార్టీ ఇన్‌చార్జి బాధ్యతల్లో 10 ఏళ్లుగా సేవలందిస్తున్న రవీందర్ తన కుటుంబసభ్యులను దర్శనం కోసం తీసుకెళ్తున్న క్రమంలో 'నీ విధులెక్కడ, నువ్వు ఏం చేస్తున్నావు' అని ఎస్పీ దాడి చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. విధులను నిబద్ధతతో నిర్వర్తించి గ్యాలంటరీ అవార్డు అందుకున్న రవీందర్‌పై కుటుంబసభ్యుల సమక్షంలోనే దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వరంగల్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ ప్రశ్నించారు. తిరిగి రవీందర్ దాడి చేస్తే ఈ రోజు పరిస్థితి ఎలా ఉండేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ చర్యపట్ల అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రేమవేధింపులకు విద్యార్థిని బలి

- రంగారెడ్డి జిల్లా ఆకులమైలారంలో ఘటన


నవ్య

యాచారం: ప్రేమపేరుతో పెడుతున్న వేధింపులను భరించలేక ఓ పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన శుక్రవారం రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ నరేశ్, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... యాచారం మండలం ఆకులమైలారం గ్రామానికి చెందిన గుత్తి జంగయ్య, పద్మ దంపతుల కూతురు నవ్య(14) కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. ఇదే గ్రామానికి చెందిన తోటి విద్యార్థి కొమ్మగోని నందీశ్వర్ తనను ప్రేమించాలని నవ్యను కొద్దికాలంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆరునెలల క్రితమే బాలిక తన కుటుంబసభ్యులకు చెప్పడంతో నందీశ్వర్‌ను హెచ్చరించారు. ఆ తర్వాత కొద్దిరోజులకు మళ్లీ వెంటపడటం ప్రారంభించాడు. బాలిక ఇంటి చుట్టూ తిరుగుతూ మానసికంగా ఇబ్బంది పెడుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన క్లాస్‌మేట్ రాజేశ్‌తోపాటు మరోతోటి విద్యార్థిని సహకారంతో ఇన్‌స్టాగామ్(బాలిక కుటుంబసభ్యుల ఫోను)లో నవ్యను వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. వ్యవసాయ పనులు ముగించుకుని రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఇంటికి చేరిన తల్లిదండ్రులు తలుపులు తెరిచి చూసేసరికి చీరతో ఉరేసుకుని కనిపించింది. నవ్య తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఆత్మహత్యకు కారణంగా భావిస్తున్న ముగ్గురు విద్యార్థులను పిలిచి విచారిస్తున్నారు. బాలిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్వామి పాదాలపై సూర్య కిరణాలు



జైనథ్: మండలంలోని అతి ప్రాచీన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సూర్యకిరణాలు స్వామి వారి పాదాలను తాకాయి. శనివారం వేకువజామున సూర్యకిరణాలు కోనేరు మీదుగా నేరుగా స్వామి వారి పాదాలను తాకాయి. దీంతో గర్భగుడిలోని స్వా మి వారు సువర్ణ కాంతులతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు, భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మరికొన్ని రోజులపాటు స్వామి వారి పాదాలను సూర్య కిరణాలు తాకుతాయని, భక్తులు వేకువజామున వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

మీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం

- ప్రవీణ్‌కుమార్ లేఖపై సీఎం రేవంత్ సానుకూల స్పందన



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ నియామకాల్లో రిలింక్విష్‌మెంట్ ఆప్షన్‌ను ఏర్పాటు చేయాలంటూ 'ఎక్స్'ద్వారా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ రాసిన లేఖపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్లు 'ఎక్స్'లో రిప్లై ఇచ్చారు. 'తెలంగాణ యువతకు సంబంధించిన సమస్యను ప్రజాప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే మీ ప్రయత్నానికి నా ధన్యవాదాలు. గురుకుల టీచర్ల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి మీరు లేవనెత్తిన విషయాలను, ఇచ్చిన సూచనలను నిశితంగా పరిశీలించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తాం'అని రిప్లైలో పేర్కొన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా తెలంగాణ పునర్నిర్మాణానికై ఎవరు కలసి వచ్చినా వారి సూచనలు తీసుకోవడానికి ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.

వైభవంగా శ్రీచక్ర తీర్థం



యాదగిరిగుట్ట: యాదాద్రి పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీచక్ర తీర్థం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యారాధనల అనంతరం మహా పూర్ణా హుతి నిర్వహించి.. శ్రీస్వామి, అమ్మ వార్లను పల్లకిపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో శ్రీచక్ర తీర్థ వేడుక నిర్వహించారు. రాత్రి దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం నిర్వహించారు. ఆదివారం శతఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

గొర్రెల పంపిణీ కొనసాగిస్తారా? లేదా ?

- బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందా లేదా అన్నది స్పష్టం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గండమళ్ల ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో గొర్రెల పంపిణీలో జరిగిన అవినీతి, అక్రమాలు బయట పెట్టాలన్నారు. బీసీలను అన్యాయం చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందేనని మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారులకు రూ.2 లక్షలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హామీని నిలబెట్టుకోకుంటే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

మా భూములు మాకివ్వాలి

- 'జయభేరి' నిర్మాణ స్థలంలో దళితుల ఆందోళన
- సంస్థ అధినేత మురళీమోహన్ వచ్చి జవాబు చెప్పాలని డిమాండ్


కోకాపేటలో జయభేరి సైట్‌లో ఆందోళన చేస్తున్న దళితులు

మణికొండ: అనాదిగా తాము సాగు చేసుకొని జీవనోపాధి పొందిన భూములను జయభేరి సంస్థ లాక్కొని తమను పట్టించుకోవట్లేదని ఆరోపిస్తూ కోకాపేట గ్రామానికి చెందిన దళితులు ఆందోళనకు దిగారు. గండిపేట మండలం కోకాపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 291, 292లలోని 5.25 ఎకరాల భూమిని స్థానిక దళితులు అనాదిగా సాగు చేసుకుంటున్నారు. అయితే తమ నుంచి ఆ భూమిని జయభేరి సంస్థ లాక్కొని అందులో నిర్మాణాలు చేస్తోందని... ఈ విషయంలో తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడచినా పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జయభేరి సంస్థ అధినేత, మాజీ ఎంపీ మురళీమోహన్ వచ్చి తమకు సమాధానం చెప్పాలని నిర్మాణ స్థలంలో ఆందోళనకు దిగారు. సుమారు 100 మంది దళితులు 3 గంటలపాటు నిర్మాణాలు జరగకుండా అడ్డుకొని నిరసన చేపట్టారు. కాందిశీకులకు చెందిన భూమిని అనాదిగా తాము సాగు చేసుకుంటున్నామని, అలాంటి భూమి 'జయభేరి'కి ఎలా వెళ్లిందని వారు ప్రశ్నించారు. తమ భూములు తిరిగి ఇవ్వకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిర్మాణ సంస్థతో మాట్లాడుకోవాలని నచ్చచెప్పి నిరసనకారులను పంపించారు. రెండు రోజుల్లో నిర్మాణ సంస్థ తమకు న్యాయం చేయకపోతే మళ్లీ ఆందోళన చేస్తామని దళితులు హెచ్చరించారు.

గురుకుల నియామకాల్లో రిలింక్వెష్‌మెంట్ ఆప్షన్ పెట్టాలి

- అవరోహణ క్రమంలో ఉద్యోగాలు భర్తీ చేయాలి
- సీఎం రేవంత్‌కు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ నియామకాల్లో రిలింక్వెష్‌మెంట్ (ఒక పోస్టును వదులుకోవడం) ఆప్షన్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అవరోహణ క్రమంలో ఆయా ఉద్యోగాలను భర్తీ చేయాలని సూచించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. గతేడాది గురుకుల బోర్డు డిగ్రీ లెక్చరర్, లెక్చరర్, పీజీటీ, టీజీటి వంటి ఉద్యోగాలకు వరుస నోటిఫికేషన్లు జారీ చేయడంతో వేలాది మంది నిరుద్యోగులు అన్ని ఉద్యోగాలకు దరఖాస్తు చేసు కొని పరీక్షలు రాశారని ఆయన పేర్కొన్నారు. బోర్డు ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల్లో 350 మంది అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. దీనివల్ల ఆయా అభ్యర్థులు ఏదో ఒక ఉద్యోగాన్ని ఎంచుకొని మిగతా వాటిని వదిలేస్తే ఆ ఉద్యోగాలు ఖాళీగా ఉండిపోవడం వల్ల తర్వాత మెరి ట్ లిస్టులో ఉన్న అభ్యర్థులకు తీరని నష్టం జరుగుతుందన్నా రు. అందువల్ల బోర్డు జనరల్ ర్యాంకింగ్ ప్రకటించి అవరోహణ క్రమంలో ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.

గురుకులాలను విలీనం చేయొద్దు

- రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలను విలీనం చేయాలనే ప్రతిపాదనలను వెంటనే విరమించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నందగోపా ల్, వేముల వెంకటేష్, రఘుపతి, రాజేందర్, నిఖిల్‌తో కూడిన ప్రతినిధి బృందం శనివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలను సమర్థంగా నిర్వహిస్తున్నారని బృందం వివరించింది. వీటిని విలీనం చేయాలని ఏ సంఘం, ఏ పార్టీ కోరలేదని పేర్కొంది. వీటన్నింటిని కలిపి సమగ్ర గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం అన్యాయమని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో మంచి విద్యా ప్రమాణాలు కొనసాగుతున్నందున విలీనం చేయవద్దని బృందం విజ్ఞప్తి చేసింది.

జేఎల్, డీఎల్ తుది జాబితా నేడే

▶ మొదటి పేజీ తరువాయి

గతేడాది సెప్టెంబర్‌లో విడుదల చేయగా ఈ నెల రెండో వారంలో ఆయా పోస్టులకు 1:2 నిష్పత్తిలో ప్రాథమిక జాబితాలను విడుదల చేసింది. ప్రాథమిక జాబితాల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించింది. ఆ ప్రక్రియకు సమాంతరంగా డెమో పరీక్షలు సైతం నిర్వహించింది. డెమో పరీక్షలతోపాటు అర్హత పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితాలను తయారు చేసి తుది జాబితాలను దాదాపు ఖరారు చేసింది.

రెండ్రోజుల్లో టీజీటీ ప్రాథమిక జాబితా...

గురుకుల విద్యాసంస్థల్లో భర్తీ చేస్తున్న ఉద్యోగాల్లో అత్యధికంగా ఉన్నవి ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) ఉద్యోగాలు. మొత్తం 9 వేల ఉద్యోగాల్లో టీజీటీ ఉద్యోగాల సంఖ్య 4,020. వాటికి సంబంధించి అభ్యర్థుల టెట్ మార్కుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. పావు వంతు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మార్కులను తప్పుగా నమోదు చేయడంతో పరిశీలన ప్రక్రియ ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో విద్యాశాఖ నుంచి అధికారులు టెట్ మార్పులతో అభ్యర్థుల దరఖాస్తులను సరిపోల్చి చూస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కానుంది. వెంటనే 1:2 నిష్పత్తిలో టీజీటీ ప్రాథమిక ఎంపిక జాబితా విడుదల చేసేలా గురుకుల బోర్డు ఏర్పాట్లు చేస్తోంది.

కారణాలు చూపకుండా పరిధి విభజన సరికాదు

- రాష్ట్ర వినియోగదారుల కమిషన్ నిర్ణయంపై తీర్పులో హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని మూడు జిల్లా వినియోగదారుల కమిషన్ల ప్రాదేశిక అధికార పరిధిని నిర్ణయిస్తూ 2022 నాటి సర్క్యులర్‌ను పక్కన పెడుతూ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. రాష్ట్ర కమిషన్ అధ్యక్షుల హోదాలో జిల్లా కమిషన్ల అధికార పరిధిని నిర్ణయించవచ్చన్న న్యాయస్థానం.. ఆ నిర్ణయం మాత్రం పారదర్శకంగా ఉండాలని వ్యాఖ్యానించింది. పరిధి మార్పు ఎందుకు చేస్తున్నారో స్పష్టమైన వివరణ ఉండాలని పేర్కొంది. జిల్లా కమిషన్ల న్యాయవాదుల సంఘం ఇచ్చిన వినతి పత్రానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబట్టింది. హైదరాబాద్‌లోని మూడు జిల్లా కమిషన్ల ప్రాదేశిక అధికార పరిధిపై 2022లో జారీ చేసిన సర్క్యులర్‌ను నిలిపివేస్తూ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ గతేడాది ఏప్రిల్‌లో రాసిన లేఖను సవాల్‌చేస్తూ న్యాయవాది రాఘవేంద్ర సింగ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ పి. శ్యామ్ కోసీ, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టి ఇటీవల తీర్పు చెప్పింది. హైదరాబాద్‌లోని మూడు జిల్లా కమిషన్లు నాంపల్లిలోని చంద్రవిహార్ నుంచి విధులు నిర్వహిస్తున్నాయి. కమిషన్–1లో కేసులు ఎక్కువగా ఉండగా మిగిలిన రెండు కమిషన్లలో కేసులు లేక మధ్యాహ్నంలోగానే విచారణ పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా వినియోగదారుల కమిషన్ న్యాయవాదుల సంఘం వినతి మేరకు కేసుల విభజన బాధ్యతను కమిషన్–1కి అప్పగిస్తూ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ రిజిస్ట్రార్ లేఖ రాశారు. కేసుల విభజనలో వివక్ష చూపుతున్నారని పిటిషనర్ వాదించారు. దీనిపై స్పందించిన హైకోర్టు కేసుల సంఖ్య తక్కువగా ఉన్న విషయాన్ని వివరిస్తూ విభజన చేయవచ్చని, న్యాయవాదుల సంఘం ఇచ్చిన వినతిపై నిర్ణయం తీసుకోవడం తగదని స్పష్టం చేసింది. తగిన కారణాలు చూపకుండా... దానిపై వివరణ లేకుండా విభజన చేయడం సరికాదని స్పష్టం చేసింది.

ఐదో వంతు జీవ జాతులు... అంతరించే ముప్పు

ఐరాస తాజా నివేదిక వెల్లడి | పర్యావరణ విధ్వంసమే కారణం

ప్రపంచవ్యాప్తంగా పలు కారణాలతో ఏటా వలస బాట పట్టే అసంఖ్యాక జీవ జాతులపై తొలిసారిగా సమగ్ర అధ్యయనానికి ఐక్యరాజ్య సమితి తెర తీసింది. ఇందులో భాగంగా 1997 ఐరాస ఒప్పందం ప్రకారం రక్షిత జాబితాలో చేర్చిన 1,189 జీవ జాతులను లోతుగా పరిశీలించారు. పరిశోధనలో తేలిన అంశాలను 5,000 పై చిలుకు జీవ జాతుల తీరుతెన్నులను 50 ఏళ్లుగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ ద కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్), లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ సంస్థల గణాంకాల సాయంతో విశ్లేషించారు. విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 22 శాతం జీవ జాతులు అతి త్వరలో పూర్తిగా అంతరించనున్నట్టు తేలింది. మొత్తమ్మీద 44 శాతం జీవ జాతుల సంఖ్య నిలకడగా తగ్గుముఖం పడుతూ వస్తున్నట్టు వెల్లడైంది. ఈ వివరాలతో కూడిన తాజా నివేదికను ఐరాస ఇటీవలే విడుదల చేసింది. ''ప్రపంచవ్యాప్తంగా ఏకంగా ఐదో వంతు వలస జీవజాతులు అంతరించే ప్రమాదంలో పడ్డాయి. జీవజాతుల వలసలు కొత్తగా మొదలైనవి కావు. అనాదిగా భూమ్మీదా, సముద్రంలోనూ అత్యంత కఠినతరమైన, భిన్న వాతావరణ పరిస్థితుల గుండా ఏటా వందల కోట్ల సంఖ్యలో సాగుతుంటాయి. ఇన్నేళ్లలో ఏనాడూ లేని ముప్పు ఇప్పుడే వచ్చి పడటానికి ప్రధాన కారణం మానవ జోక్యం, తత్ఫలితంగా జరుగుతున్న వాతావరణ మార్పులు, సాగుతున్న పర్యావరణ విధ్వంసమే'' అని తేల్చింది. ఇప్పటికైనా కళ్లు తెరిచి నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరముందని ఐరాస వలస జాతుల సంరక్షణ సదస్సు కార్యదర్శి అమీ ఫ్రాంకెల్ అన్నారు. గత వారం ఉజ్బెకిస్తాన్‌లోని సమర్ఖండ్‌లో జరిగిన సదస్సు భేటీలో ఈ అంశాన్నే ఆయన నొక్కిచెప్పారు. ''ప్రపంచవ్యాప్తంగా 30 శాతం భూ, సముద్ర భాగాల సమగ్ర పరిరక్షణకు కృషి చేస్తామంటూ 2022 గ్లోబల్ బయో డైవర్సిటీ సమిట్‌లో పాల్గొన్న దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. దాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది'' అన్నారు.

> ఆహారం, పునరుత్పాదన వంటి అవసరాల నిమిత్తం వేలాది జీవ జాతులు వలస బాట పట్టడం ప్రపంచవ్యాప్తంగా అనాదిగా జరుగుతూ వస్తున్న ప్రక్రియ. పలు జంతు, పక్షి జాతులైతే కోట్ల సంఖ్యలో వలస వెళ్తుంటాయి. ఈ క్రమంలో కొన్ని పక్షి జాతులు ఏటా 10 వేల కిలోమీటర్లకు పైగా సుదీర్ఘ ప్రయాణాలు చేస్తుంటాయి! పర్యావరణ సంతులన పరిరక్షణకు కూడా ఎంతగానో దోహదపడే ప్రక్రియ ఇది. కానీ గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల ప్రభావం జంతువులు, పక్షుల వలసపై కూడా విపరీతంగా పడుతోంది. ఈ ప్రమాదకర పరిణామంపై ఐరాస తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. దీనికి తక్షణం అడ్డుకట్ట వేయకపోతే కనీసం ఐదో వంతు వలస జీవులు అతి త్వరలో అంతరించి పోయే ప్రమాదం పొంచి ఉందని తాజా నివేదికలో హెచ్చరించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



ప్రమాదపుటంచుల్లో...

1979 ఐరాస రక్షిత జాబితాలోని 1,189 జీవ జాతులను నివేదిక లోతుగా పరిశీలించింది. అనంతరం ఏం చెప్పిందంటే...

- ప్రపంచవ్యాప్తంగా 44 శాతం వలస జీవ జాతుల సంఖ్య నానాటికీ భారీగా తగ్గుముఖం పడుతోంది.
- 22 శాతం అతి త్వరలో అంతరించేలా ఉన్నాయి. మొత్తమ్మీద ఐదో వంతు అంతరించే ముప్పు జాబితాలో ఉన్నాయి.
- ఇది జీవవైవిధ్యానికి తీవ్ర విఘాతం. మన జీవనాధారాలపైనా, మొత్తంగా ఆహార భద్రతపైనా పెను ప్రభావం చూపగల పరిణామం.
- ఆవాస ప్రాంతాలు శరవేగంగా అంతరిస్తుండటం మూడొంతుల జీవుల మనుగడకు మరణశాసనం రాస్తోంది.
- జంతువులు, చేపల వంటివాటిని విచ్చలవిడిగా వేటాడటం కూడా ఆయా జాతుల మనుగడను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.
- కార్చిచ్చులు, గ్లోబల్ వార్మింగ్ వంటివి ఇందుకు తోడవుతున్నాయి.
- భారీ డ్యాములు, గాలి మరలకు తోడు ఆకస్మిక వరదలు, అకాల క్షామాలు తదితరాల వల్ల వలస దారులు మూసుకుపోవడం, మారిపోవడం జరుగుతోంది. ఇది పలు జీవ జాతులను అయోమయపరుస్తోంది.


తక్షణం వలస జీవ జాతుల సంరక్షణ చర్యలకు పూనుకోవాల్సిన ఆవశ్యకతను నివేదిక నొక్కిచెప్పింది. అందుకు పలు సిఫార్సులు చేసింది...

ఏం చేయాలి?

- జీవావరణాల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలి.
- భారీ డ్యాములు తదితరాల పర్యావరణ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తగు నష్ట నివారణ చర్యలు తీసుకోవాలి.
- ఈ అన్ని సమస్యలకూ తల్లి వేరు పర్యావరణ విధ్వంసం. కార్చిచ్చులకైనా, అకాల వరదలు, క్షామాలకైనా, గ్లోబల్ వార్మింగ్‌కైనా అదే ప్రధాన కారణం. కనుక దానికి వీలైనంత త్వరలో చెక్ పెట్టేందుకు దేశాలన్నీ కృషి చేయాలి.

కాంగ్రెస్ ఎజెండాలో 'అభివృద్ధి' లేదు: మోదీ

రాయ్‌పూర్: బంధుప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు మినహా కాంగ్రెస్ మరొకటి ఆలోచించలేకపోతోందని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. దేశాభివృద్ధి ఆ పార్టీ అజెండాలోనే లేదన్నారు. ''సుదీర్ఘ పాలనలో దేశ నిర్మాణంపై కాంగ్రెస్ దృష్టి పెట్టలేదు. దేశ భవిష్యత్తును పట్టించుకోలేదు. ప్రభుత్వాలను ఎలా ఏర్పాటు చేయాలి? సొంత ప్రయోజనాలు ఎలా నెరవేర్చుకోవాలి అనే దానిపైనే దృష్టంతా ఉండేది'' అన్నారు. కాంగ్రెస్ దశ, దిశ ఇప్పటికీ మారలేదని మండిపడ్డారు. శనివారం 'వికసిత్ భారత్, వికసిత్ ఛత్తీస్‌గఢ్' కార్యక్రమంలో మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. రూ.34,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. వచ్చే ఐదేళ్లలో మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని పునరుద్ఘాటించారు.



రూ.1.25 లక్షల కోట్లతో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం
వచ్చే ఐదేళ్లలో వేలాది గోదాములు: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం అమలుకు రూ.1.25 లక్షల కోట్లకుపైగా నిధులు వెచ్చించనున్నారు. అలాగే వచ్చే ఐదేళ్లలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సృష్టించనున్నారు. ఇందులో భాగంగా 11 రాష్ట్రాల్లో 11 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీ) పరిధిలో నిర్మించిన 11 గోడౌన్లను మోదీ ప్రారంభించారు. రాబోయే ఐదేళ్లలో వేలాది గోదాములు నిర్మించబోతున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. 500 పీఏసీల పరిధిలో గోదాముల నిర్మాణానికి, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన పనులకు మోదీ శంకుస్థాపన చేశారు. 18,000 పీఏసీలను కంప్యూటీకరించే ప్రాజెక్టును ప్రారంభించారు. దేశంలో ఆహార ధాన్యాల నిల్వకు సరైన సదుపాయాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమస్యను గత ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదని తప్పుపట్టారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ.1.25 లక్షల కోట్లలో వ్యయంతో రాబోయే ఐదేళ్లలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం సృష్టించే పథకానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చని, వాటిపై రుణం పొందవచ్చని, మార్కెట్‌లో సరైన ధర లభించినప్పుడు పంటలు విక్రయించుకోవచ్చని తెలియజేశారు.

కేబినెట్ భేటీకి యాక్షన్ ప్లాన్‌తో రండి

కేంద్ర మంత్రులకు ప్రధాని మోదీ సూచన

లోక్‌సభ ఎన్నికలు మరో 100 రోజులలోపే జరుగనున్న నేపథ్యంలో మార్చి 3వ తేదీన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయించారు. ఈ భేటీని ఆయన కీలకంగా భావిస్తున్నారు. స్పష్టమైన, ఆచరణ యోగ్యమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని కేబినెట్ సమావేశానికి హాజరు కావాలని మంత్రులకు ఆయన సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు శనివారం వెల్లడించాయి. కేబినెట్ భేటీలో మంత్రులంతా వారి యాక్షన్ ప్లాన్ సమర్పించాలని ప్రధానమంత్రి పేర్కొన్నట్లు తెలియజేశాయి.

నాలుగు రాష్ట్రాల్లో పొత్తు

కాంగ్రెస్, ఆప్ ఒప్పందం

- ఢిల్లీలో కాంగ్రెస్‌కు 3, ఆప్‌కు 4
- ఆప్‌కు గుజరాత్‌లో 2, హరియాణాలో ఒక స్థానం
- పంజాబ్‌లో విడిగానే బరిలోకి

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ సహా నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ పొత్తు ఖరారైంది. ఢిల్లీ, గుజరాత్, గోవా, హరియాణాల్లో సీట్ల పంపకం పూర్తయింది. ఢిల్లీలో కాంగ్రెస్ 4, ఆప్ 3 చోట్ల బరిలో దిగుతాయి. న్యూఢిల్లీ, వెస్ట్ ఢిల్లీ, సౌత్ ఢిల్లీ, ఈస్ట్ ఢిల్లీ స్థానాల్లో ఆప్, చాందినీ చౌక్, నార్త్ ఈస్ట్ ఢిల్లీ, నార్త్ వెస్ట్ ఢిల్లీ సీట్లలో కాంగ్రెస్ బరిలో ఉంటాయి. గుజరాత్‌లో 24 స్థానాల్లో కాంగ్రెస్, రెండు స్థానాల్లో (భావ్‌నగర్, భరూచ్) ఆప్ పోటీ చేస్తాయి. హరియాణాలో కురుక్షేత్ర స్థానంలో ఆప్, మిగతా 9 చోట్లా కాంగ్రెస్ బరిలో ఉంటాయి. గోవాలో మొత్తం రెండు సీట్లతో పాటు చండీగఢ్ లోక్‌సభ స్థానంలోనూ కాంగ్రెసే పోటీ చేస్తుంది. కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్, ఆప్ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్ శనివారం ఈ మేరకు మీడియాకు వెల్లడించారు. పంజాబ్‌లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పొత్తుతో సంబంధం లేకుండా అక్కడి 13 స్థానాల్లో విడిగానే పోటీ చేయాలని రెండు పార్టీలూ నిర్ణయించాయి. గుజరాత్‌లో భరూచ్ స్థానాన్ని ఆప్‌కు కేటాయించడాన్ని దివంగత కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ కుమారుడు ఫైజల్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అక్కడ అహ్మద్ పటేల్ పలుమార్లు గెలిచారు. ఈసారి కూడా కాంగ్రెస్ టికెట్‌పై తాను పోటీ చేస్తానని, దీనిపై పార్టీ అధిష్టానాన్ని కలిసి చర్చిస్తానని ఫైజల్ చెప్పారు.

సొంత జిల్లాల్లో 'నో పోస్టింగ్'

రాష్ట్రాలకు ఈసీ ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ అధికారుల బదిలీలపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఒక జిల్లాలో మూడేళ్లుగా పనిచేస్తున్న వారిని బదిలీపై అదే లోక్‌సభ స్థానం పరిధిలోని మరో జిల్లాకు పంపొద్దని పేర్కొంది. వారు ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయొచ్చనే కారణంతో ఈ నిర్ణయం తీసుకుంది. బదిలీల్లో ఈ నిబంధనను విధిగా పాటించాలని ఆదేశిస్తూ అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సొంత జిల్లాల్లో అధికారులకు పోస్టింగులు ఇవ్వకూడదని ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులను సొంత జిల్లాల్లో కొనసాగించరాదని ఉత్తర్వుల్లో పేర్కొంది. మూడేళ్లకు మించి ఒకే జిల్లాలో పనిచేస్తున్న అధికారులను కొనసాగించవద్దంటూ ఆదేశాలిచ్చింది.

ఒడిస్సియస్ ఒరిగింది

చంద్రుడిపై దిగగానే పడిపోయిన ల్యాండర్

వాషింగ్టన్: చంద్రునిపై కుదురుగా దిగని లాండర్ల జాబితాలోకి ఒడిస్సియస్ కూడా చేరింది. అమెరికాకు చెందిన ప్రైవేటు సంస్థ ఇంట్యూటివ్ మెషీన్స్ ప్రయోగించిన ఈ ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై దిగుతూనే ఓ పక్కకు పడిపోయింది. చంద్రుడి నేలకు సమాంతరంగా వాలిపోయింది. దాంతో ల్యాండర్ సమాచార వ్యవస్థల నుంచి సంకేతం అందుకోవడానికి కొన్ని నిమిషాల ముందు ల్యాండర్ పక్కకు పడిందని ఇంట్యూటివ్ మెషీన్స్ (ఏఎం) సీఈవో స్టీవ్ ఆల్టెమస్ ధ్రువీకరించారు. అది నిర్దేశిత ప్రదేశంలోనో, ఆ దగ్గర్లోనో దిగి ఉంటుందన్నారు. ఒడిస్సియస్ నుంచి డేటా స్వీకరిస్తున్నట్టు ఏఎం, నాసా వెల్లడించాయి. అది మోసుకెళ్లిన పరికరాల్లో చాలా పేలోడ్స్ పని చేసే స్థితిలోనే ఉంటాయని భావిస్తున్నట్టు చెప్పాయి. జపాన్ అంతరిక్ష సంస్థ 'జాక్సా' తాజాగా పంపిన 'మూన్ స్నైపర్' ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై తలకిందులుగా దిగడం తెలిసిందే.

చంద్రుడి దక్షిణ ధ్రువ సమీపంలో ల్యాండర్ కాలుమోపిన 'మాలాపెర్ట్ ఎ' బిలం వాస్తవానికి ల్యాండింగ్‌కు ప్రమాదభరితమైన ప్రదేశం. కానీ చంద్రుడిపై శాశ్వత స్థావరం నెలకొల్పడానికి దోహదపడే గడ్డకట్టిన నీరు అక్కడ పుష్కలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఆ చోటునే ఎన్నుకున్నారు. లాండింగ్‌కు 30 సెకండ్ల ముందు ఒడిస్సియస్‌లోని 'ఈగిల్ కామ్' ల్యాండర్ నుంచి దూరంగా వెళ్లి ల్యాండింగ్ ఘట్టాన్ని చిత్రీకరించాల్సి ఉంది. కానీ నేవిగేషన్ అవసరాల దృష్ట్యా ల్యాండింగ్ సమయంలో కామ్‌ను స్విచాఫ్ చేశారు. ''ఒడిస్సియస్ పొజిషనింగ్‌కు సంబంధించిన ఫొటో చాలా ముఖ్యం. అందుకోసం ఈగిల్ కామ్‌ను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. అది సుమారు 8 మీటర్ల దూరం నుంచి ఒడిస్సియస్‌ను ఫొటో తీస్తుందని ఆశిస్తున్నాం'' అని ఏఎం తెలిపింది. అయితే లాండింగ్‌కు కాస్త ముందు చంద్రునిపై షోంబర్గర్ క్రేటర్ ప్రాంతాన్ని దాదాపు 10 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఒడిస్సియస్ ఫొటో తీసి పంపింది. సౌరఫలకాలు లాండర్ పై భాగంలో, యాంటెన్నా కింది భాగంలో ఉండిపోవటంతో దాన్నుంచి డేటా సేకరణ కూడా కష్టసాధ్యమవుతోంది. చంద్రుడి కక్ష్యలో పరిభ్రమిస్తున్న నాసా ఉపగ్రహం లూనార్ రీకానసన్స్ ఆర్బిటర్ (ఎల్ఆర్వో) త్వరలో ఒడిస్సియస్ ఆనుపానులు కనిపెట్టనుంది. ల్యాండర్ కచ్చితంగా ఏ ప్రాంతంలో ఉందో గుర్తించి ఫొటోలు తీయనుంది.





ఇటీవల ల్యాండింగ్‌కు ముందు ఒడిస్సియస్ తీసిన చంద్రుని ఉపరితలం ఫొటో (ఇన్‌సెట్‌లో) ల్యాండర్ ఇలా పక్కకు ఒరిగిందంటూ వివరిస్తున్న ప్రయోగ సంస్థ సిబ్బంది

అమాయకుల ఇళ్లపైకే బుల్డోజర్లు

యోగి సర్కారుపై ప్రియాంక ధ్వజం



శనివారం యూపీలోని మొరాదాబాద్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో రాహుల్, ప్రియాంక

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా నిప్పులు చెరిగారు. బుల్డోజర్లతో అమాయక ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్నారని, ప్రభుత్వ నిర్వాకం వల్ల నేరగాళ్లు మాత్రం నిక్షేపంగా తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. ఆమె శనివారం ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో తన సోదరుడు రాహుల్ గాంధీతోపాటు భారత్ జోడో న్యాయ్ యాత్రలో పాల్గొన్నారు. బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు రోజుల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. రైతుల మొర ఆలకించే తీరిక పాలకులకు లేదా? అని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో రైతులపైకి జీపులు నడిపించి చంపిన నాయకుల ఇళ్లపైకి, మహిళలను వేధించిన దుర్మార్గుల ఇళ్లపైకి, ప్రశ్నాపత్రాలను లీక్ చేసినవారి ఇళ్లపైకి బుల్డోజర్లు వెళ్లడం లేదని ధ్వజత్తారు. అమాయకుల ఇళ్లు మాత్రమే బుల్డోజర్ల కింద నలిగిపోతున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా మహిళలు, చిన్నారులు, రైతులకు అన్యాయం జరుగుతుండడం వల్లే యాత్రలో 'న్యాయ్' పదాన్ని చేర్చామన్నారు. ఆదివారం ఆగ్రాలో యాత్రలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

ఆ పిల్లలు రీల్స్ చూడరు: రాహుల్

దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఇక యువత రోజుకు 12 గంటలు మొబైల్ ఫోన్లు చూడక ఏం చేస్తారని రాహుల్ ప్రశ్నించారు. ఆయన శనివారం యూపీలోని సంభాల్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో మాట్లాడారు. రోజుకు ఎన్ని గంటలు ఫోన్ వాడుతున్నారని యువతను ప్రశ్నించగా 12 గంటలని బదులిచ్చారు. దాంతో రాహుల్ ఈ మేరకు స్పందించారు. సంపన్నులు, బడా వ్యాపారవేత్తల పిల్లలు ఫోన్లలో రీల్స్ చూడరని, రోజంతా డబ్బులు లెక్కపెట్టుకొనే పనిలోనే ఉంటారని అన్నారు.

జూలై 1 నుంచి 'భారత' చట్టాలు

న్యూఢిల్లీ: వలసపాలన నాటి నేర న్యాయ వ్యవస్థ చట్టాలను సంస్కరించి నేటి ఆధునిక సమాజ అవసరాలకు తగ్గట్లుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా చట్టాలు జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించిన నిబంధనలు మాత్రం ఇప్పుడే అమలుకావు. హిట్ అండ్ రన్ కేసులపై ట్రక్కు డ్రైవర్లు దేశవ్యాప్తంగా కొద్దివారాల క్రితం ధర్నాకు దిగిన నేపథ్యంలో ఈ నిబంధనల అమలును ప్రస్తుతానికి పక్కనబెట్టారు. ఈ మూడు నూతన చట్టాలకు గత ఏడాది డిసెంబర్ 21న పార్లమెంట్ ఆమోదం తెలపగా డిసెంబర్ 25వ తేదీన రాష్ట్రపతి ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్1872ల స్థానంలో ఈ మూడు చట్టాలు తెచ్చిన సంగతి తెల్సిందే. దోషులను శిక్షించడంకంటే ముందు బాధితులకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతోనే ఈ చట్టాలను తెచ్చామని బిల్లులపై చర్చ సందర్భంగా పార్లమెంట్‌లో హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. ఐపీసీలో లేని ఉగ్రవాదం అనే దానికి తొలిసారిగా కొత్త చట్టంలో సరైన నిర్వచనం పొందుపరిచారు. రాజద్రోహం అనే పదాన్ని తొలగించి దాని స్థానంలో 'దేశ వ్యతిరేక నేరాలు' అనే సెక్షన్‌ను జతచేశారు. వేర్పాటువాదం, సాయుధపోరాటాలు, దేశ సార్వభౌమత్వాన్ని భంగపరిచే చర్యలు, దేశ, విదేశాల్లో ఉంటూ చేసే విధ్వంసకర కుట్రలు, దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే కుట్ర, విద్వేష ప్రసంగాలు.. ఇలా పలు రకాల నేరాలను ఇకపై దేశవ్యతిరేక నేరాలుగా పరిగణిస్తారు. ఈ నేరాలకు గరిష్టంగా జీవితఖైదు పడొచ్చు. రాజద్రోహం అనే పదాన్ని తొలగించి దేశద్రోహం అనే నిర్వచించారు. దోషులకు మేజిస్ట్రేట్ విధించే జరిమానా మొత్తాలను పెంచారు. అన్ని భాగస్వామ్య వర్గాల సలహాలు, సూచనలు స్వీకరించి సమగ్ర చర్చలు, సంప్రతింపుల తర్వాతే ముసాయిదా బిల్లులు చట్టాలుగా రూపుదాల్చాయని అమిత్ షా అన్నారు.

ఐదు గంటలపాటు విమానంలోనే..

ముంబై ఎయిర్‌పోర్టులో నిలిచిన ఎయిర్ మారిషస్ విమానం

ముంబై: సాంకేతిక సమస్యతో ముంబై ఎయిర్‌పోర్టులో నిలిచిపోయిన ఎయిర్ మారిషస్ విమానంలో సుమారు 200 మంది ప్రయాణికులు ఐదు గంటల పాటు బందీలుగా మారారు. చివరికి ఆ విమానాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎయిర్ మారిషస్‌కు చెందిన ఎంకే 749 విమానం శనివారం ఉదయం 4.30 గంటలకు ముంబై విమానాశ్రయం నుంచి టేకాఫ్ తీసుకోవాల్సి ఉంది. బయలుదేరాల్సిన సమయానికి విమానంలో సమస్య గుర్తించారు. నిపుణులొచ్చి లోపాన్ని సరిచేసినా, ఫలితం లేకపోయింది. చివరికి ఉదయం 10 గంటల సమయంలో సర్వీసును రద్దు చేస్తున్నట్లు పైలట్ ప్రకటించారని బాధిత ప్రయాణికులు చెప్పారు. ఐదు గంటలపాటు తమను కిందికి కూడా దిగనివ్వలేదన్నారు. ఏసీ సరిగ్గా పనిచేయక ఆరోగ్య సమస్యలున్న వారు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని చెప్పారు. ఈ ఘటనపై ఎయిర్ మారిషస్ స్పందించలేదు.

'హల్ద్వానీ' సూత్రధారి ఢిల్లీలో అరెస్ట్

హల్ద్వానీ: ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఈ నెల 8వ తేదీన మదరసా కూల్చివేత సమయంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు ప్రధాన సూత్రధారి అబ్దుల్ మాలిక్ ఎట్టకేలకు దొరికాడు. పరారీలో ఉన్న అతన్ని ఢిల్లీలో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 81కి చేరింది. హల్ద్వానీలో ప్రభుత్వ స్థలంలో మాలిక్ అనుమతుల్లేకుండా మదరసా నిర్వహిస్తున్నాడు. దాన్ని అధికారులు కూల్చడంతో పథకం ప్రకారమే స్థానికులను పోలీసులపైకి ఉసిగొల్పినట్లు అనుమానిస్తున్నారు.

చైనాలో ఘోర అగ్ని ప్రమాదం..

15 మంది మృతి, మరో 44 మందికి గాయాలు

బీజింగ్: చైనాలోని జియాంగ్సు ప్రావిన్సులోని నాన్జింగ్ నగరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 15 మంది చనిపోగా మరో 44 మంది గాయాలపాలయ్యారు. శుక్రవారం ఉదయం ఓ బహుళ అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులోని ఎలక్ట్రికల్ సైకిళ్లు ఉంచే ప్రాంతంలో మంటలు మొదలైనట్లు అధికారులు చెప్పారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. నెల వ్యవధిలో చైనాలో జరిగిన రెండో అతిపెద్ద అగ్ని ప్రమాదమిది.

పాక్ భూభాగంలో ఇరాన్ సర్జికల్ స్ట్రైక్స్

ఇస్లామాబాద్: ఇరాన్ వైమానిక దళం పాకిస్తాన్ భూభాగంలో సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. ఈ దాడుల్లో జైష్–అల్–ఆదిల్ అనే ఉగ్ర సంస్థ కమాండర్ సహా పలువుర్ని హతమార్చినట్లు అక్కడి మీడియా తెలిపింది. పాక్ భూభాగంలో ఉన్న జైష్–అల్–ఆదిల్ కమాండర్ ఇస్మాయిల్ షా బక్ష్, తదితర ఉగ్రవాదులు దాడుల్లో మృతి చెందినట్లు ఇరాన్ మిలటరీ తెలిపినట్లు అందులో పేర్కొంది. ఇరాన్ నెల క్రితం కూడా పాక్ భూభాగంలో సర్జికల్ స్ట్రైక్ జరిపింది. పాక్ సరిహద్దు భూభాగంలోకి ప్రవేశించి జైష్–అల్–ఆదిల్ స్థావరాలపై దాడులు చేపట్టింది.

చెరువులోకి ట్రాక్టర్.. 24 మంది మృతి

కాస్‌గంజ్(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని కాజ్‌గంజ్ జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ప్రమాదంలో 8 మంది చిన్నారులు సహా మొత్తం 24 మంది చనిపోయారు. ఈటా జిల్లా జైథారా గ్రామం నుంచి కొందరు గంగా నదిలో స్నానాలు చేసేందుకు ట్రాక్టర్‌లో బయలుదేరారు. పటియాలి–దరియావ్‌గంజ్ రహదారిలో వెళ్తూ ముందున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసేందుకు ట్రాక్టర్ డ్రైవర్ యత్నించాడు. ఈ క్రమంలో అదుపుతప్పిన ట్రాలీ రోడ్డు పక్కనే ఉన్న సుమారు 8 అడుగుల లోతయిన చెరువులోకి దూసుకుపోయింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది చిన్నారులు సహా 24 మంది చనిపోగా 20 మంది గాయపడ్డారు.

హామీలపై సమాచారం.. ఓటర్ల హక్కు: సీఈసీ

చెన్నై: ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు ఆచరణ సాధ్యమేనా? అనేది తెలుసుకొనే హక్కు ఓటర్లకు ఉందని ముఖ్య ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ చెప్పారు. అయితే, ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని గుర్తుచేశారు. మేనిఫెస్టోలో హామీలను పొందుపర్చే హక్కు రాజకీయ పార్టీలకు ఉన్నట్లే.. ఆయా హామీల్లో నిజమెంత? వాటిని అమలు చేయడానికి నిధులు ఎక్కడి నుంచి ఎలా సేకరిస్తారో తెలుసుకునే హక్కు ఓటర్లు ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై న్యాయస్థానం విచారణ కొనసాగిస్తోందని వెల్లడించారు. రాజీవ్ కుమార్ శనివారం చెన్నైలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలు, వాటిని అమలు చేసే విధానం, నిధుల సేకరణ మార్గాలను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా వెల్లడించేలా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఒక 'ప్రొఫార్మా' సిద్ధం చేశామని తెలిపారు.

రష్యా నిఘా విమానాన్ని కూల్చేశాం: ఉక్రెయిన్

కీవ్: యుద్ధం మూడో ఏడాదిలోకి అడుగిడిన వేళ రష్యా ఏ50 నిఘా విమానాన్ని కుప్పకూల్చినట్టు ఉక్రెయిన్ ప్రకటించింది. రష్యా నిఘా విమానాన్ని ఉక్రెయిన్ బలగాలు నేలమట్టం చేయడం ఈ నెల రోజుల్లో ఇది రెండోసారి! అజోవ్ తీర ప్రాంతంలో భారీ యుద్ధవిమానం మంటల్లో కాలిపోతున్న వీడియోను ఉక్రెయిన్ మీడియా ప్రసారం చేసింది. రూ.2,900 కోట్ల విలువైన ఆ నిఘా విమానం అందించే కచ్చితమైన సమాచారంతోనే 650 కిలోమీటర్ల దూరంలోని లయాలపై కూడా రష్యా సేనలు క్షిపణి దాడులు చేస్తాయని తెలుస్తోంది. దాన్ని కోల్పోవడం రష్యాకు పెద్ద దెబ్బేనని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

రెండో ప్రపంచయుద్ధం నాటి బాంబు వెలికితీత

లండన్: రెండో ప్రపంచయుద్ధంకాలంలో బ్రిటన్‌పై శత్రుదేశం జారవిడిచిన 500 కేజీల బరువైన పేలని బాంబును అధికారులు తాజాగా కనుగొన్నారు. ఇప్పటికీ అది పేలే సామర్థ్యం కల్గిఉండటం విశేషం. దీంతో హుటాహుటిన ఏకంగా 10,000కుపైగా స్థానికులను అక్కడి నుంచి ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. యుద్ధంకాకుండా శాంతికాలంలో బ్రిటన్‌లో ఇలా పౌరులను తరలించడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. నైరుతి బ్రిటన్‌లోని ప్లైమౌత్ తీరపట్టణంలో ఈ ఘటన జరిగింది. పట్టణంలోని ఒక ఇంటి పెరట్లో నేలలో మంగళవారం ఈ భారీ బాంబును కనుగొన్నారు. అందర్నీ వేరే చోటుకు తరలించాక దీనినీ దగ్గర్లోని సముద్రజలాల్లోకి తీసుకెళ్లి పేల్చేశామని బ్రిటన్ రక్షణ మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది.

నవాల్నీ మృతదేహం అప్పగింత

మాస్కో: రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నవాల్నీ మృతదేహాన్ని అధికారులు ఎట్టకేలకు తల్లి లుడ్మిలాకు అప్పగించినట్లు సన్నిహితుడొకరు తెలిపారు. తాజా పరిణామాన్ని నవాల్నీకి చెందిన యాంటీ కరప్షన్ ఫౌండేషన్ శుక్రవారం ఈ మేరకు ధ్రువీకరించింది. నవాల్నీ గత వారం దుర్భరమైన ఆర్కిటిక్ పీనల్ జైల్లో వివాదాస్పద రీతిలో మృతి చెందడం తెలిసిందే.

జాహ్నవి కేసుపై పునఃసమీక్షకు వినతి

వాషింగ్టన్: అమెరికాలో నిర్లక్ష్యంగా వాహనం నడిపి, తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి ప్రాణాలను బలిగొన్న పోలీసు అధికారిపై చర్యలు తీసుకోలేమన్న ప్రాసిక్యూషన్ కార్యాలయం నిర్ణయాన్ని పునస్సమీక్షించాలని అక్కడి భారత కాన్సులేట్ కార్యాలయం పోలీసు విభాగాన్ని కోరింది. ప్రాసిక్యూషన్ అటార్నీ కార్యాలయం నిర్ణయంతో జాహ్నవి కుటుంబం తీవ్ర నిరుత్సాహానికి గురైందని తెలిపింది. 'జాహ్నవి కందుల మృతిపై కింగ్ కౌంటీ ప్రాసిక్యూషన్ అటార్నీ ఇటీవల విడుదల చేసిన దర్యాప్తు నివేదిక గురించి బాధిత కుటుంబంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నాం. జాహ్నవి కుటుంబానికి న్యాయం జరిగేందుకు అవసరమైన అన్ని రకాల సాయాన్ని అందజేస్తాం'అని భారత కాన్సులేట్ శుక్రవారం 'ఎక్స్'లో పేర్కొంది.

ముంబై లోకల్ రైల్లో ఆర్థిక మంత్రి నిర్మల

ముంబై: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ముంబై లోకల్ ట్రైన్‌లో ఘాట్‌కోపర్ నుంచి కళ్యాణ్ దాకా దాదాపు 30 కిలోమీటర్లు ప్రయాణించారు. ప్రయాణికులంతా ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ముంబై సబర్బన్ రైళ్లలో రోజుకు 65 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. నిర్మలతో ప్రయాణికుల సెల్ఫీలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. లోకల్ రైలు ప్రయాణ కష్టాలను కొందరు మహిళా ప్రయాణికులు ఆమెకు ఏకరవు పెట్టారు. గతేడాది నవంబర్‌లో కేరళలో నిర్మల వందేభారత్ రైలులో ప్రయాణించి అందులోని ప్రయాణికులను ఆశ్చర్యపరిచారు.

సాక్షి
కరీంనగర్
ఆదివారం | 25 | ఫిబ్రవరి | 2024

3 ఎకరాలు..14 పంటలు

వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలు కాకుండా వినూత్నంగా సాగుచేస్తున్నాడు సిరిసిల్ల శివారులోని పెద్దబోనాలకు చెందిన రైతు బాలరాజు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయలు సాగుచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాడు. తన మూడెకరాలలో 14 రకాల కూరగాయలను పండిస్తూ సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటున్నాడు. ఇలా తనతోపాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు నాన్న బాటలో పయనిస్తున్న కూరగాయల రైతు బాలరాజు. ఈ యువరైతు సక్సెస్ స్టోరీ ఈ సండే స్పెషల్..

– వివరాలు 8లో..



న్యూస్‌రీల్

సాధారణ కాన్పులపై దృష్టిపెట్టండి



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత

కరీంనగర్‌టౌన్: జిల్లాలో వందశాతం గర్భిణుల వివరాలు నమోదు చేసి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు అయ్యేలా ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. శనివారం జిల్లాలోని అన్ని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లతో డీఎంహెచ్ కార్యాలయం నుంచి జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్నీ ఆరోగ్య కార్యక్రమాలు ఆన్ లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎండాకాలం ప్రారంభమైనందున వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలకు తగినన్ని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బకు గురైనవారిని త్వరగా గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. మార్చి 3న పల్స్ పోలియో నిర్వహించేందుకు సిబ్బందిని గుర్తించి శిక్షణ నిర్వహించాలని ఆదేశించారు. 0–5 సంవత్సరాల పిల్లల జాబితా సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. సమీక్షలో డీఐవో డాక్టర్ సాజిదాఅతహరి, ఎంసీహెచ్ పీవో సనా జవేరియా, డెమో రంగారెడ్డి, డీపీవో రవీందర్, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు పాల్గొన్నారు.

27న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా

కరీంనగర్: మాక్స్‌లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్ జిల్లా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ హైదరాబాద్‌లో బిజినెస్ అసోసియేట్స్, ఫైనాన్షియల్ ప్లానర్స్ తదితర ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 27న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.దేవేందర్‌రావు ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, బీబీఏ, ఎంబీఏ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని, వేతనం రూ.15 వేల నుంచి రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీయువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 70950 99666, 72076 59969 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు

కరీంనగర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట)లో ఒకటో తరగతిలో ఖాళీగా ఉన్న రెండు సీట్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి పి.నేతానియల్ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో లభిస్తాయని, గ్రామీణ ప్రాంతాలవారి వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతం వారు రూ.2 లక్షల లోపు ఆదాయం సర్టిఫికెట్ సమర్పించాలని పేర్కొన్నారు. జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించి జత పరచాలని తెలిపారు. మార్చి 12 లోపు దరఖాస్తులు అందజేయాలని, 15న మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తు ఫాంలు, సంబంధిత సర్టిఫికెట్స్(జిరాక్స్)కాపీలు జత చేయని దరఖాస్తులు తిరస్కరించబడునని తెలిపారు.

పన్ను చెల్లించని 400 ఇండ్లకు రెడ్ నోటీస్

కరీంనగర్ కార్పొరేషన్: ఆస్తిపన్ను బకాయి పడ్డ ఇండ్లకు రెడ్ నోటీస్, వారెంట్ జారీ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తెలిపారు. రూ.50 వేలకు పైబడి ఆస్తి పన్ను బకాయిలు ఉన్న 400 ఇండ్లకు రెడ్ నోటీసు ఇచ్చామని ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున నగరపాలకసంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను వెంటనే చెల్లించి సహకరించాలని కోరారు. నగరపాలక పరిధిలో 82,605 ఇండ్లు (అసెస్మెంట్లు) ఉండగా, ఇప్పటివరకు 50,859 అసెస్మెంట్లు మాత్రమే ఆస్తి పన్ను చెల్లించారని పేర్కొన్నారు. మిగిలిన అసెస్మెంట్లు వెంటనే చెల్లించాలన్నారు. ఆస్తి పన్ను రూ.19.12 కోట్లు రావాల్సి ఉందని, రూ.50 వేలకు పైబడి డిఫాల్టర్లు 400 మంది వరకు గుర్తించామన్నారు. ఆర్థిక సంవత్సరం లోగా బకాయిదారులు పన్ను చెల్లించాలని పేర్కొన్నారు. లేకుంటే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు.

ఖాకీలకు తాఖీదులు!

భూమాఫియాతో పదేపదే మంతనాలు





తమ ఇళ్లు కూల్చారని కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా (ఫైల్)

- ఇక్కడ పనిచేసిన టైంలో కబ్జాలకు సహకారం?
- నిందితులపై ఫిర్యాదులు రాగానే మీటింగ్‌లు
- తీవ్రంగా పరిగణిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు
- ఇప్పటికే లిఖితపూర్వకంగా సమాధానమిచ్చిన ఇద్దరు పోలీసులు
- జాబితాలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల ఉద్యోగులు!

సాక్షి ఎక్స్‌క్లూజివ్

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కరీంనగర్‌లో పట్టణంలో గతంలో జరిగిన భూ కబ్జాలకు, పోలీసులకు లింకుందా? ఇదే విషయంలో ఎవరెవరి పాత్ర ఏంటి? అన్న విషయంపై ప్రస్తుత సీపీ అభిషేక్ మహంతి దృష్టి సారించారా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ, సీఐ, ఏసీపీ ర్యాంకుల వరకు అధికారులు కమిషనరేట్ వస్తుండటంతో ఈ చర్చ మొదలైంది. అసలు నేరస్తులకు పోలీసులతో పనేంటి? ల్యాండ్ గ్రాబర్స్‌తో అంత సాన్నిహిత్యంగా మెదలాల్సిన అవసరం ఏంటి? అన్న విషయంపై స్పష్టత వచ్చేలా కరీంనగర్ పోలీసులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగా ఇప్పటికే పోలీసు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలో కొందరు అవినీతి అధికారులుగా ముద్రపడ్డ వారిని పోలీసు ఉన్నతాధికారులు గుర్తించారు. వారు ప్రస్తుతం రేపో మాపో అరెస్టు కాబోతున్నవారు, అరెస్టు అయ్యేవారితో పదే పదే సమావేశం కావడంపై ఉన్నతాధికారులు సీరియస్ అవుతున్నారు. ముఖ్యంగా పోలీసు డిపార్ట్‌మెంట్‌లోని ఎస్సై నుంచి ఏసీపీ వరకు ఆరుగురు అధికారుల వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తించడమే దీనికి కారణంగా తెలుస్తోంది.

నోటీసులకు రంగం సిద్ధం

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారులు ఇప్పుడు వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్నారు. భూకబ్జాలపై సీపీ వరుసగా ఫిర్యాదులు తీసుకోవడం, నిందితులు ఎంతటివారైనా అరెస్టు చేస్తుండటంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇప్పటి వరకూ దాదాపు 720 వరకు బాధితులు తమ భూములు కబ్జా అయ్యాయని ఫిర్యాదులు చేశారంటే గతంలో పోలీసుల పనితీరును చెప్పకనే చెబుతోంది. ఈ ఫిర్యాదులపై సీపీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎకనమిక్ అఫెన్స్ వింగ్ (ఈవో డబ్ల్యూ) విభాగం ఆధారాలు సేకరిస్తోంది. ఈ క్రమంలో పోలీసుల నుంచి నిందితులకు నోటీసులు రాగానే వారంతా ఆందోళనతో తాము కబ్జా పెట్టిన సమయంలో అధికారులుగా ఉన్న పోలీసులను సంప్రదించే పనిలో పడ్డారు. ఈ విషయంలో ముందే నిఘా ఉంచిన పోలీసు ఉన్నతాధికారులు విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. తమ డిపార్ట్‌మెంట్ వారితో కబ్జాదారులకు ఏం పని? పైగా రేపోమాపో అరెస్టు కాబోయే వ్యక్తులతో ఏం మాట్లాడుతున్నారు? ఎక్కడో సూదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న వీరికి నిందితులతో పదే పదే మాట్లాడాల్సిన అవసరం ఎందుకు వస్తోంది? అన్న విషయాలపై స్పష్టత తీసుకోవాలని భావించారు. కబ్జాల సమయంలో ఎస్‌హెచ్‌వోలుగా వ్యవహరించిన దాదాపు ఆరుగురు పోలీసు అధికారుల (ఎస్సై నుంచి ఏసీపీ వరకు)కు తాఖీదులు జారీ చేయాలని నిర్ణయించారని తెలిసింది. వీరిలో ఇద్దరికి ఇప్పటికే నోటీసులు ఇవ్వగా.. వారు వేర్వేరు సమయాల్లో కమిషనరేట్‌కు వచ్చి ఉన్నతాధికారులను కలిసి తామెందుకు నిందితులతో మాట్లాడాల్సి వచ్చింది? అన్న విషయంపై లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చి వెళ్లినట్లు తెలిసింది. మిగిలిన నలుగురికి సైతం త్వరలోనే నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

కబ్జాదారులతో చెట్టాపట్టాల్..

ఉన్నతాధికారులు గుర్తించిన ఆరుగురు వ్యక్తులు అవినీతిపరులన్న విమర్శలు ఉన్నాయి. వీరంతా ఇప్పుడు అరెస్టవుతున్న పలువురు ప్రజాప్రతినిధులతో గతంలో చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగారన్న ఆరోపణలు ఉన్నాయి. పైకి మాత్రం పాత పరిచయాలతో వారిని కలిశామని వీరు వివరణ ఇస్తున్నా.. తప్పకుండా కేసును ఎలా ఎదుర్కోవాలో? సలహాలు ఇచ్చి ఉంటారని పై అధికారులు అనుమానిస్తున్నారు. ఎందుకంటే.. పలుమార్లు సదరు అధికారులు వ్యవహరించిన తీరు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వివాదాస్పదంగా మారడమే అందుకు కారణం. తన ఇంటిని కబ్జా చేశారని ఠాణాకు వెళ్తే.. ఇంటి యజమానిపైనే 'ట్రెస్‌పాస్' కేసు పెట్టడం, ఇంటిని రాసివ్వకపోతే నకిలీ ఎఫ్‌ఐఆర్‌లు సృష్టించి లాక్కోవడం, నిందితులతో రాజీ కుదుర్చుకోవాలని బెదిరించడం, అక్రమంగా గంటలపాటు నిర్బంధించడం, నిర్మాణంలో ఇళ్లను కూల్చినా కనీసం అరెస్టు చేయకపోవడం, సాక్షాత్తూ కలెక్టరేట్ ఎదురుగా ధర్నా చేసినా..పట్టించుకోకపోవడం వంటి దాష్టీకాలను ప్రస్తుతం పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. గతంలో వారికి సహకరించి, ప్రస్తుతం కూడా టచ్‌లో ఉండటంపై వివరణ కోరుతూ తాఖీదులు జారీ చేస్తున్నారు. అలాగే రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లోనూ ఇలాంటి అధికారులపై నిఘా ఉంచి, వారికి కూడా నోటీసులు ఇవ్వనున్నారు.

జలగల దందా!

- ధనార్జనే ధ్యేయం.. నాణ్యతా ప్రమాణాలు తూచ్
- జిల్లాలో వందల్లో అనుమతి లేని వాటర్ ప్లాంట్లు
- ఐఎస్‌ఐ స్టాండర్డ్ ఉన్నవి నాలుగే
- నిత్యం లక్షల లీటర్ల నీటి వ్యాపారం

సాక్షి ఫోటోస్



క్యాన్లు తీసుకెళ్తున్న వాటర్‌ప్లాంట్ సిబ్బంది



ఇది జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటలో అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న శుద్ధజల కేంద్రం. పాకురుపట్టిన నేల, యంత్రాల లీకేజీల మధ్య ఫిల్టర్ చేసిన నీటిని బబుల్స్‌లో నింపి విక్రయిస్తున్నారు. అయితే ఈ కేంద్రానికి పేరు మాత్రం లేదు.



ఈ చిత్రంలోని నీటి క్యాన్ అడుగుభాగంలో పచ్చగా ఏదో ఫంగస్ పేరుకుపోయి ఉంది. దీన్ని శుభ్రం చేయకుండానే ఇలాగే ఫిల్టర్‌వాటర్ నింపి విక్రయిస్తున్నారు. ఇందులోని నీళ్లు తాగితే ఆస్పత్రి పాలు కావడం ఖాయం.



ఈ క్యాన్లలో ఒక్కటి కూడా శుభ్రంగా లేదు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లోని ఓ శుద్ధజల కేంద్రానికి చెందిన వాహనం. నిత్యం వేల లీటర్ల నీటిని విక్రయిస్తున్నా శుభ్రత మాత్రం పాటించడం లేదు.

కరీంనగర్‌అర్బన్: ఎండాకాలాన్ని క్యాష్ చేసుకునేందుకు జిల్లాలో విచ్చలవిడిగా శుద్ధనీటి కేంద్రాలు వెలుస్తున్నాయి. అయితే ఏ ఒక్క కేంద్రంలోనూ నిబంధనలు పాటించడం లేదు. కరీంనగర్, జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి, కొత్తపల్లి, తిమ్మాపూర్, మానకొండూరు, గంగాధర, రామడుగు, శంకరపట్నం ప్రాంతాల్లో సుమారు 400 వరకు శుద్ధజల కేంద్రాలు ఉన్నాయి. బీఎస్‌ఐ అనుమతి ఉన్న కేంద్రాలు కేవలం నాలుగు మాత్రమే. మిగతావి నామమాత్రపు అనుమతితో నడుస్తున్నాయి.

కంపుకొడుతున్న మున్సిపల్ నీరు

జిల్లాలోని మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీలు సరఫరా చేస్తున్న తాగునీరు కంపుకొడుతుండడంతో ప్రజలు శుద్ధనీటి కేంద్రాలపై ఆధారపడుతున్నారు. కరీంనగర్‌తోపాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లోనూ శుద్ధనీటి కేంద్రాల నుంచే తాగునీరు తెచ్చుకుంటున్నారు. సురక్షితమని భావిస్తున్నా నీరే వారి ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడం, అపరిశుభ్ర పరిసరాల్లో శుద్ధి చేస్తుండడమే ప్రధాన కారణం.

విచ్చలవిడిగా కేంద్రాలు.. లక్షల్లో వ్యాపారం

కరీంనగర్ మున్సిపాలిటీ పరిధిలోనే 200 వరకు శుద్ధజల కేంద్రాలు అనధికారికంగా నిర్వహిస్తున్నారు. కూల్‌వాటర్, మినరల్‌వాటర్ పేరుతో దందా చేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండానే వాటర్‌ప్లాంట్లు వెలుస్తున్నాయి. గంటకు 2వేల లీటర్ల నుంచి వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ప్లాంట్లు నివాస ప్రాంతాల్లో చిన్నపాటి గదుల్లో నిర్వహిస్తున్నారు. వాటర్‌ప్లాంట్లలో వినియోగించే పైపులు, నిల్వ చేసే ట్యాంకులు స్టీలువి వినియోగించాల్సి ఉండగా ప్లాస్టిక్‌వి వాడుతున్నారు. నిత్యం శుద్ధనీటి కేంద్రాలను తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. నగరంలో మున్సిపల్ అనుమతి లేకుండానే బోర్లు వేస్తూ.. ఆ నీటిని ఫిల్టర్ చేస్తూ వ్యాపారం సాగిస్తున్నారు.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

విచ్చలవిడిగా వెలుస్తున్న శుద్ధనీటి కేంద్రాలను అధికారులు ఏనాడు తనిఖీ చేసిన పాపాన పోలేదు. నీటి లభ్యత ఆధారంగా భూగర్భజలశాఖ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. నీటి శుద్ధికి ఏ పదార్థాలు ఎంత పరిమాణంలో ఉపయోగిస్తారనే దానిని ఆహార తనిఖీ అధికారులు పరీక్షించాలి. శుద్ధిచేసిన నీరు తాగేందుకు అనువుగా ఉందా? లేదా? అనేది వైద్యారోగ్యశాఖ అధికారులు నిర్ధారించాలి. కేంద్రం సామర్థ్యం ఎంత, ఎంత నీరు విక్రయిస్తున్నారనే దాని ఆధారంగా అమ్మకపు పన్ను శాఖ అధికారులు పన్ను వేయాలి. కానీ సదరు అధికారులు ప్లాంట్ల వైపు కన్నెత్తి చూడడం లేదు.

నిబంధనలు ఇవీ..

- ప్లాంట్ ఏర్పాటుకు ముందుగా మున్సిపాలిటీల్లో కమిషనర్, గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ పొందాలి.
- ఎన్‌వోసీ ఆధారంగా ప్లాంటు స్థాపించేందుకు విద్యుత్‌శాఖ నుంచి కనెక్షన్ కోసం అనుమతి పొందాలి.
- భారత ప్రమాణాల సంస్థ నిర్ణయించిన నిబంధనల ప్రకారం మైక్రో బయోలజిస్టు, కెమిస్టులు ఉండాలి.
- శుద్ధి చేసిన నీటిలోని పీహెచ్‌ను తనిఖీ చేస్తూ ఉండాలి.
- కొత్తగా నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే కనీసం 10 గదులు ఉండాలి.
- ఫిల్లింగ్ సెక్షన్, ఆర్‌వో సిస్టంలో మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రమ్ములు ఏర్పాటు చేయాలి.
- శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసేందుకు 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీలు డ్రమ్ములు వాడాలి.
- ఈ నీటికి తప్పకుండా ఓజోనైజేషన్ చేయాలి.
- మినరల్ వాటర్‌ను బబుల్స్(క్యాన్)లోకి పట్టే ముందు అల్ట్రావయోలెట్ కిరణాలతో శుద్ధి చేయాలి.
- క్యాన్లను ప్రతీసారి పొటాషియం పర్మాంగనేట్ లేదా హైపో సొల్యూషన్‌తో శుభ్రం చేయాలి.
- నీటిని శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబర్ సీలుపై ముద్రించాలి.

రోగాలు వచ్చే అవకాశం



అల్కలైన్ తగిన మోతాదులో వాడకపోతే ఎముకల పటుత్వంలో సమస్యలు ఏర్పడుతాయి. సరైన శుద్ధి చేయకుండా నీరు తాగితే గొంతు సంబంధిత సమస్యలు, ఒంటినొప్పులు, వివిధ రకాల రోగాలు వస్తాయి. ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, క్యాన్లలో ఎక్కువ కాలం నిలువ ఉంచిన నీరు తాగితే కేన్సర్లు వచ్చే ప్రమాదముంది.

– సాయిని నరేందర్, ఎండీ, చెస్ట్ క్రిటికల్ కేర్

బల్దియాకు మరో అవార్డు

- 'పే జల్ సర్వేక్షణ్' జాతీయ పురస్కారానికి ఎంపిక
- మార్చి 5న ఢిల్లీలో స్వీకరించనున్న మేయర్ సునీల్‌రావు



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ ఖాతాలో మరో జాతీయ అవార్డు చేరింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయస్థాయిలో నిర్వహించిన సర్వే ఆధారంగా 'పే జల్ సర్వేక్షణ్' అవార్డును తాజాగా సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా ప్రకటించిన అవార్డుల జాబితాలో రాష్ట్రం నుంచి వరంగల్, గ్రేటర్ హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం నగరపాలక సంస్థలకు చోటు లభించింది. మార్చి 5న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పురస్కారం అందుకోనున్నారు. రోజూ ప్రజలకు అందిస్తున్న తాగు నీరు, త్వరలో అందించ బోయే 24 గంటల తాగు నీటి సరఫరా లాంటి పారామీటర్స్‌పై గతంలో ప్రత్యేక బృందం నగరంలో సర్వే చేసి అవార్డుకు ఎంపిక చేసింది.

నగరపాలక సంస్థకు ఆరో అవార్డు

ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయిలో నగరపాలకసంస్థకు ఐదు అవార్డులు రాగా, తాజాగా జల్ సర్వేక్షణ్‌అవార్డుతో ఈ సంఖ్య ఆరుకు చేరింది. మెరుగైన స్వచ్ఛ్ సర్వేక్షణ్ ర్యాంకులతో పాటు సపాయి మిత్ర సురక్షా చాలెంజ్ కింద గతంలో రూ.4 కోట్ల నగదు అవార్డు, వాటర్ ప్లస్ అవార్డు, హరితహారం అవార్డులను అందుకుంది. తాజాగా పే జల్ సర్వేక్షణ్‌లో జాతీయ అవార్డు అందుకోనుంది.

పనితీరుకు నిదర్శనం: మేయర్ సునీల్‌రావు

నగరపాలకసంస్థకు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు రావడం తమ పాలకవర్గం పనితీరుకు నిదర్శనమని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఇందుకు సహకరిస్తున్న నగర ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో వందల కోట్ల రూపాయల నిధులతో నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని, నగరాన్ని ఆధునీకరించామని చెప్పారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సహకారంతో నగర ప్రజల జీవన ప్రమాణాలు పెంచామన్నారు. తమ పాలకవర్గం వచ్చాకే రోజూ తాగునీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. త్వరలో హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల తాగునీటి సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం నగరవ్యాప్తంగా దశలవారీగా అందిస్తామని, 24 గంటలు నీటి సరఫరా చేసే మొట్ట మొదటి నగరంగా కరీంనగర్ త్వరలోనే పేరు సంపాదించుకోబోతుందని పేర్కొన్నారు.

పేదరిక నిర్మూలన, చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

సప్తగిరికాలనీ(కరీంనగర్)/కరీంనగర్‌క్రైం: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల విద్యార్థులకు పేదరిక నిర్మూలన, చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం బాలబాలికలకు కల్పిస్తున్న హక్కులు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొని బహుమతి పొందిన విద్యార్థులతో మాట్లాడారు. ప్రపంచ స్థాయికి ఎదగాలని సూచించారు. లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లీలప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక స్థోమతలేని ఖైదీలకు న్యాయసేవలు

కరీంనగర్ జిల్లా జైలును శనివారం డీఎల్‌ఎస్‌ఏ (డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ) కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేశ్ సందర్శించారు. జైలులో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలకు చట్టాల గురించి వివరించారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వం తరుపున న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. జైలర్ పి.శ్రీనివాస్, డిప్యూటీ జైలర్లు ఎ.శ్రీనివాసరెడ్డి, ఎల్.రమేశ్, ఎన్.సంగీత, న్యాయవాది మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లాజెల్లా సల్లగుండాలె..



రేకుర్తిలో అమ్మవార్ల దర్శనానికి బారులుతీరిన భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి హరిశంకర్



మొక్కులు చెల్లిస్తున్న కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రాజు



హౌసింగ్‌బోర్డుకాలనీలో ఎస్‌ఈ గంగాధర్..

వరాల తల్లులు సమ్మక్క–సారలమ్మ శనివారం సాయంత్రం జనం వీడి వనంలోకి ప్రవేశించారు. పిల్లాజెల్లాను సల్లంగా సూడాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకున్నారు. రేకుర్తిలో డిప్యూటీ మేయర్‌చల్లా స్వరూపారాణి హరిశంకర్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ఎంపీ బండి సంజయ్ సతీమణి అపర్ణ, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా సమ్మక్క–సారలమ్మ హుండీలను కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. మంగళవారం రాజరాజేశ్వర కల్యాణ మండపంలో హుండీలను లెక్కించనున్నట్లు ఈవో ఎండపల్లి మారుతి తెలిపారు. అలాగే కరీంనగర్ మండలం ఇరుకుల్ల, నగునూరు, బొమ్మకల్ హౌసింగ్‌బోర్డు కాలనీ జాతరప్రాంగణాల్లో చివరిరోజు భక్తుల సందడి నెలకొంది. హౌసింగ్‌బోర్డు కాలనీలో అమ్మవార్లకు టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు.

–కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

ప్రైవేట్ కళాశాల లెక్చరర్‌పై కేసు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థిని తీవ్రంగా కొట్టిన కొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ లెక్చరర్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. విద్యార్థి తండ్రి నబీషరీఫ్ ఫిర్యాదు మేరకు ఈచర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇది ఇలాఉంటే విద్యార్థిపై చేయిచేసుకున్న అధ్యాపకుడిని ఉద్యోగం నుంచి తొలగించినట్లు విద్యాసంస్థల చైర్మన్ తెలిపారు.

గ్యాస్ లీకేజీతో మంటలు



నిరాశ్రయులైన బాధితులు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని ఓ ఇంట్లో శనివారం గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. గ్రామానికి చెందిన దేవునూరి పోచమ్మ వంట చేసేందుకు గ్యాస్ స్టౌవ్ వెలిగించగా గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. పోచమ్మ కుమారుడు శ్రీనివాస్ కర్రసాయంతో సిలిండర్‌ను బయటకు లాగేయడంతో పెద్దప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంతో పోచమ్మ కుటుంబం రోడ్డున పడింది. రూ.30వేల ఆస్తినష్టం వాటిల్లిందని వాపోయింది.

పట్టుబడిన దొంగ

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని శాంతినగర్‌లో అడ్డగట్ల మురళీ ఇంట్లో ఈనెల 13న దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన పోలీసులు ఇంటిలో దొంగతనం చేసిన దొంగను శనివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. స్థానిక శాంతినగర్‌లో నివసించే అడ్డగట్ల మురళీ విహారయాత్రకు వెళ్లగా ఈనెల 13న చోరీ జరిగింది. బాధితులు ఇంటి కొచ్చిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇంటిలో అద్దెకు ఉంటున్న రాజేంద్రప్రసాద్ దొంగతనానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీని ఆధారంగా పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేయగా అతని నుంచి మురళీ ఇంటిలో దొంగలించిన బంగారు నగలు, కొంత నగదును రికవరీ చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు.

ఎల్‌ఎండీలో దూకి మహిళ ఆత్మహత్య



నందిని (ఫైల్)

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్‌కు చెందిన నందిని(48) లోయర్ మానేరు డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాలు... కొన్నిరోజులుగా నందిని మానసిక సమస్యతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు చికిత్స చేయించినా ఆరోగ్యం మెరుగుపడలేదు. మనస్తాపం చెందిన ఆమె చనిపోతానంటూ తరచూ కుటుంబ సభ్యులకు చెప్పేది. ఈనెల 22న మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎల్‌ఎండీ వద్ద వెంట తెచ్చుకున్న ఫినాయిల్ తాగి జలాశయంలోకి దూకింది. మృతదేహం శనివారం బయటకు తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నందిని భర్త కోడెం రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

3 ఎకరాలు.. 14 పంటలు



- కలగూరగంప.. ఆ వ్యవసాయ క్షేత్రం
- మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి పంటల సాగు
- నలుగురికి ఉపాధినిస్తున్న బాలరాజు
- వ్యవ'సాయం'లో నేత కుటుంబం

సిరిసిల్ల: నేతన్న కుటుంబంలో పుట్టిన బాలరాజు.. కులవృత్తి వైపు వెల్లకుండా పంటల సాగుపై దృష్టి పెట్టాడు. తండ్రిని చూస్తూ పెరిగిన బాలరాజు.. నాన్న చూపిన బాటలోనే పయనిస్తున్నాడు. సంప్రదాయ పంటలను సాగు చేయకుండా కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకున్న మూడు ఎకరాలలో 14 రకాల కూరగాయలు సాగుచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాడు. తనతోపాటు మరికొందరికి ఉపాధి చూపుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.







పెద్దబోనాలలో బాలరాజు సాగు చేసిన వివిధ రకాల కూరగాయల పంటలు

నాన్నే స్ఫూర్తి



మా నాన్న చంద్రయ్యనే స్ఫూర్తి. ఆయన 25 ఏళ్ల కిందటే అనేక రకాల పంటలు పండించాడు. ఇప్పుడు అదే భూమిలో కూరగాయలు పండించడం, మార్కెట్లో అమ్ముకోవడంతో వ్యాపారం బాగుంది. ఇది నాన్న చూపిన బాటనే. సీజన్‌లో నెలకు అన్ని ఖర్చులు పోను రూ.50వేల వరకు వస్తాయి. ఇప్పుడు రూ.30 వేలు వస్తున్నాయి. కాలానుగుణంగా అన్ని కూరగాయలను సాగుచేస్తాను. మార్కెట్‌లో డిమాండ్ ఉంటే ఎక్కువ గిట్టుబాటు అవుతుంది. లేకుంటే తక్కువ వస్తాయి. ఒకే పంటను నమ్ముకొని నష్టపోయేకంటే చాలా రకాలు వేసుకుంటే మంచిది. ఒకదాంట్లో నష్టం వచ్చినా మరో పంటలో కలిసివస్తుంది. ఇప్పటికైతే వ్యాపారానికి ఢోకా లేదు.

– దొంతుల బాలరాజు, పెద్దబోనాల

తండ్రి బాటలో.. సాగుపై ఆసక్తితో..

సిరిసిల్ల శివారులోని పెద్దబోనాలకు చెందిన దొంతుల బాలరాజుది నేతకార్మిక కుటుంబం. వాళ్ల తాతలు మగ్గం నేసేవారు. వస్త్రపరిశ్రమలో బతుకుదెరువు లేదని గ్రహించిన బాలరాజు తండ్రి చంద్రయ్య వ్యవసాయం చేశాడు. తండ్రి బాటలో పయనిస్తూ కూరగాయలు సాగుచేస్తున్నాడు. అందరు రైతుల్లాగా.. బోర్లు వేయకుండా.. బావి నీటితోనే కూరగాయలను పండిస్తున్నాడు.



చదివింది ఐదో తరగతి

బాలరాజు ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. తనకున్న మూడెకరాల ఎర్రభూమిలో పుదీన, క్యాబేజీ, టమాట, వంకాయ, మిర్చి, పచ్చకూర, పాలకూర, తోటకూర, కొత్తిమీర, మెంతి, కరివేపాకు, జామా, మామిడి, నిమ్మ చెట్లను సాగు చేస్తున్నాడు. ఒక్కో పంటను రెండు నుంచి ఐదు గుంటల విస్తీరణంలో వేస్తాడు. ప్రస్తుతం 14 రకాల పంటలు ఉండగా.. సీజన్‌లో 20 రకాల కూరగాయలు సాగు చేస్తాడు. కాలానుగుణంగా పంటలను మార్చుతూ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఆయా పంటలను వేసుకుంటున్నాడు. పట్టుదలే పెట్టుబడిగా వ్యవసాయంలో నిమగ్నమైన బాలరాజు నిత్యం వ్యవసాయ క్షేత్రంలోనే తల్లి, భార్యతో కలిసి శ్రమిస్తున్నాడు. భూసారాన్ని కాపాడుకునేందుకు సేంద్రియ ఎరువులను వేస్తున్నాడు. నిత్యం తన పొలంలో ఓ నలుగురు కూలీలకు పని కల్పిస్తున్నాడు. తన పొలంలోనే ప్రయోగాలు చేస్తూ.. కలగూరగంపలా వ్యవసాయక్షేత్రాన్ని మార్చాడు.

సిరిసిల్ల మార్కెట్‌లో వ్యాపారం

తాను పండించిన కూరగాయలు, పంటలను సిరిసిల్ల మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. ట్రాలీ ఆటో కొని.. హోల్‌సేల్‌గా ఫంక్షన్లకు సరఫరా చేస్తాడు. సిరిసిల్ల ప్రాంతంలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాలయాలకు సైతం కూరగాయలు సరఫరా చేస్తున్నాడు. ఏ సీజన్‌లో ఏ పంటకు గిరాకీ ఉంటుందో అవగాహన ఉన్న బాలరాజు ఆయా పంటలనే సాగు చేస్తుంటాడు. ముందస్తు ప్రణాళికతో మూడెకరాల్లో పంటను మార్చుతూ పండిస్తుంటాడు. అందరిలా వరి పంట సాగు చేయడు. తనకున్న మరో రెండు ఎకరాలను ఓ డాక్టర్‌కు కౌలుకు ఇచ్చాడు. అందులో డ్రాగన్ పంటను ఆ డాక్టర్ సాగు చేయడం విశేషం. మొత్తంగా బాలరాజు ఐదెరాలు ఉండగా.. మూడు ఎకరాల్లోనూ 14 రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నాడు.

గ్రామీణ పాడి రైతులను ఆదుకుంటాం



మాట్లాడుతున్న డెయిరీ వ్యవస్థాపకుడు మారుతి

- ఎస్‌ఆర్‌కే డెయిరీ వ్యవస్థాపకుడు బండారి మారుతి
- వెంకటేశ్వరపల్లిలో డెయిరీ ప్రారంభం

జమ్మికుంట: గ్రామీణ ప్రాంత పాడి రైతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా, అందుబాటులో ఉంటూ పాల సేకరణ, రుణ సాయంతో ఆదుకుంటామని ఎస్‌ఆర్‌కే (శివరామకృష్ణ) డెయిరీ వ్యవస్థాపకుడు బండారి మారుతి అన్నారు. శనివారం మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ. 22 కోట్ల వ్యయంతో అత్యాధునికి యంత్ర సామగ్రితో కూడిన డెయిరీని బండారి మారుతి, కూమార్తె శివాత్మిక, కుమారుడు శివరామ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ తరహాలో డెయిరీ ఆధ్వర్యంలో తక్కువ వడ్డీకి గేదెలు, ఆవులు కొనుగోలు చేసుకోవడానికి, పాలు డెయిరీలో అమ్ముకునే విధంగా లక్షా ముప్పైవేల లీటర్ల పాలను ఉత్పత్తి లక్ష్యంగా డెయిరీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు, అత్యధిక క్వాలిటీతో తక్కువ ధరలకు పాల ఉత్పత్తుల అమ్మకంతో వినియోగదారులకు అందుబాటులో ఉంటామన్నారు. అంతేకాకుండా తెలంగాణ టీ సంస్థలను ఏర్పాటు చేసి పని చేస్తున్న ఉద్యోగులను సంస్థలో భాగస్వాములుగా చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు నరసింహారావు, మండల అధ్యక్షుడు రాజమౌళి, సీఈవో కృష్ణారావు, ఏజీఎం భాస్కర్, జీఎం మధు, ఆర్‌ఎం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొలం ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు

జమ్మికుంట: సాగు చేసుకున్న పొలాన్ని ధ్వంసం చేసిన ఇద్దరిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మహేష్ బుచ్చమ్మ అనే మహిళకు 2006లో తన తల్లితండ్రుల నుండి వరకట్నంగా రాసి ఇచ్చారు. బుచ్చమ్మ, భర్త తిరుపతిలు ఆ భూమిని వరి వేసుకొని సాగు చేసుకుంటు,కూలీ పని చేసుకుంటు జీవనం సాగిస్తున్న క్రమంలో అన్నదమ్ములైన సోల్లేటి లక్ష్మిరాజం, ఓదేలులు ఆ పోలం బుచ్చమ్మ దంపతులకు తెలువకుండా రిజిస్టేషన్ చేసుకున్నారు.కాగా సాగులో ఆ దంపతులు ఉన్నారు. ఆ వివాదం కొనసాగుతుండగా పోలం ధ్వంసం చేసేందుకు గడ్డి మందు పిచికారి చేశారు.దింతో బాధితురాలు బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.


ప్రమాదవశాత్తు వలస కార్మికుడి మృతి



సుమిత్ చౌదరి మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలం సుద్దాలలోని ఓ పత్తిమిల్లులో ప్రమాదవశాత్తు కార్మికుడు మృతిచెందాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు. బిహార్ రాష్ట్రంలోని జమాలాబాద్‌కు చెందిన సుమిత్ చౌదరి(20) కోనరావుపేట మండలంలోని సుద్దాల శివారులోని పత్తిమిల్లులో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం చందన్‌కుమార్ అనే కార్మికుడు ట్రాక్టర్ క్రేన్‌కు డోజర్ వేసుకునేందుకు మిల్లు నుంచి బయటకు తీస్తుండగా సుమిత్ చౌదరికి వాహనం తాకడంతో ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని సీఐ కిరణ్‌కుమార్ పరిశీలించారు. మృతుని సోదరుడు అజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..



నాగరాజు (ఫైల్)

రాయికల్: రాయికల్ పట్టణానికి చెందిన బత్తిని నాగరాజు (25) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. నాగరాజు తన స్నేహితుడైన మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన సిరిపురం చరణ్‌తో కలిసి ఈనెల 20న ఉప్పుమడుగు నుంచి ద్విచక్రవాహనంపై రాయికల్ వస్తున్నారు. అయోధ్య శివారులోకి రాగానే వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. బంధువులు వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. నాగరాజును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గంమధ్యలో మృతిచెందాడు. నాగరాజు ఇటీవలే దుబాయ్ నుంచి వచ్చాడు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో గాయపడి చనిపోవడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

హామీలను విస్మరిస్తే ప్రజలు సహించరు

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఫైర్
- కొత్త పథకాల అమలుకు జీవో జారీ చేయాలని డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, చిత్రంలో లక్ష్మీనర్సింహారావు, బాపురెడ్డి

కథలాపూర్(వేములవాడ): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను త్వరగా అమలు చేయాలని, ఎన్నికల కోడ్ పేరిట విస్మరించాలని చూస్తే ప్రజలు సహించబోరని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ పొలిట్ బ్యూరో సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో విలేకరులతో మాట్లాడారు. మహాలక్ష్మి గ్యారంటీలో మూడు పథకాలు ఉన్నాయని.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేసి ఒక్క హామీ పూర్తిగా అమలు చేసినట్లు సీఎం చెప్పుకోవడం విడ్డూరమన్నారు. మహాలక్ష్మి గ్యారంటీలోనే రూ.500కు వంటగ్యాస్ సిలిండర్, ప్రతి మహిళకూ రూ.2500 అందించే పథకాలు ఉన్నాయనే విషయాన్ని సీఎం గుర్తించాలని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో కోటి ఎకరాల్లో రైతులు వరి, ఇతర పంటలు సాగుచేయడంతో భూములు పచ్చదనంతో కళకళలాడాయని, ఇప్పుడు సరిగా సాగునీరందక సగం భూములు బీడుగా కనిపిస్తున్నాయని తెలిపారు. నెలరోజుల్లో వరి పంట చేతికొస్తుందని, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఎప్పుడిస్తారో తేల్చి జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు డబ్బులు మూడెకరాల వరకే ఇచ్చారని.. మిగతావారికి ఇవ్వడంతోపాటు రూ.2లక్షల రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. మార్చి 13వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని, మహాలక్ష్మి గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తే ప్రజలు బుద్ధి చెప్పుతారన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, నాగేశ్వర్‌రావు, గుండారపు గంగాధర్, పాలెపు రాజేశ్, కల్లెడ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజలకు చేస్తుందేమీ లేదు

- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

గోదావరిఖని(రామగుండం): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తుందేమీ లేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి విమర్శించారు. శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం పేరు చెప్పి రూ.లక్షన్నర కోట్లు మింగితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజలకు ఫ్రీ బస్సు తప్ప ఏమీ ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పుడేమో 17 ఎంపీ సీట్లు గెలిస్తే తప్ప గ్యారంటీలు ఇవ్వమని ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తోందన్నారు. దేశం కోసం పనిచేసే నాయకుడు కావాలా, దేశాన్ని దివాలాతీసే నాయకులు కావాలా ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి మద్దతుగా నిలిచి, బీజేపీని గెలిపించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ ప్రభారి కొప్పు బాషా, జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నాయకులు రావుల రామ్‌నాథ్, బొడిగె శోభక్క, ఎస్.కుమార్, బల్మూరి వనిత, మెరుగు హనుమంతుగౌడ్, వడ్డేపల్లి రాంచందర్, రావుల రాజేందర్, క్యాతం వెంకటరమణ, అయోధ్య రవి తదితరులు పాల్గొన్నారు.

కాకిని బలిచ్చి, హుండీల చోరీ

- దొంగతుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘటన



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యుడు

ధర్మారం(ధర్మపురి): కాకిని బలిచ్చి, హుండీలు చోరీ చేసిన ఘటన ధర్మారం మండలంలోని దొంగతుర్తి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోటుచేసుకుంది. ఎస్సై సత్యనారాయణ కథనం ప్రకారం.. ఈ నెల 19న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తర్వాత సమ్మక్క–సారలమ్మ జాతర ఉండటంతో గుడికి తాళం వేసి, గోదాదేవి, వేంకటేశ్వరస్వామిలకు సంబంధించిన రెండు హుండీలను లెక్కించకుండానే గర్భగుడిలో ఉంచారు. ఇది తెలుసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఆలయం ఎదుట కాకిని బలిచ్చి, ప్రవేశద్వారం, గర్భగుడి తాళాలు పగులగొట్టి, హుండీలను ఎత్తుకెళ్లారు. వాటిలో దాదాపు రూ.20 వేలు ఉన్నాయి. దుండగులు స్వామివారి బంగారు, వెండి ఆభరణాలను మాత్రం ముట్టుకోలేదు. శనివారం సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ కృష్ణ, ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించింది. డాగ్‌స్క్వాడ్‌ను పలిపించారు. శునకాలను ఆలయంలో వదలగా అక్కడి నుంచి మెయిన్ రోడ్డు వరకు వెళ్లి, ఆగినట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

రాజన్నను దర్శించుకున్న ముక్కామల క్షేత్ర పీఠాధిపతి



శ్రీధర్ స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ: రాజన్నను ముక్కామల క్షేత్ర పీఠాధిపతి శ్రీధర్‌స్వామీజీ శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ కలశంతో స్వాగతం పలికారు. నాయకులు కట్కూరి శ్రీనివాస్, నగుబోతు రవీందర్ పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఢిల్లీ సైబర్ క్రైం డీసీపీ పూజలు



డీసీపీ గౌతం కుమార్‌ను కలిసిన మల్యాల సీఐ, ఎస్సై

మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాల గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో న్యూఢిల్లీలో సైబర్ క్రైం బ్రాంచ్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న కండ్లె గౌతంకుమార్ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గౌతం కుమార్ స్వగ్రామం మానాల. లక్ష్మీనర్సింహాస్వామి జాతర సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన ఆయన లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పూజలు చేశారు. జాతరలో పాల్గొన్నారు. డీసీపీని మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై అబ్దుల్ రహీం ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

'రైతులపై కాల్పులు హేయమైన చర్య'



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు కృష్ణ, శంకర్ తదితరులు

జ్యోతినగర్(రామగుండం): సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్రం కాల్పులు జరిపించడం హేయమైన చర్య అని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ, కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శనివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో నల్ల జెండాలతో నిరసన తెలిపారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న ప్రధాని మోదీ ప్రభుత్వం రైతులు కష్టపడి పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదా అని ప్రశ్నించారు. రైతు వెన్నులో తూటాలు దించిన కేంద్ర సర్కారుకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. యువ రైతు మృతికి కేంద్రమే బాధ్యత వహించాలని, దేశ ప్రజలకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్, బుచ్చన్న, రవి కుమార్, రాజేశం, కె.రాజేశం, వసంత్, మహేందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జైలుకు కార్పొరేటర్ భర్త

కరీంనగర్‌క్రైం: ఓ భూవివాదంలో నగరానికి చెందిన ఓ కార్పొరేటర్ భర్త సుధగోని కృష్ణగౌడ్‌పై ఇటీవల కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన ఓ కేసులో ఇదివరకే కరీంనగర్ జైలులో రిమాండ్‌లో ఉండగా శనివారం పీటీ వారెంట్‌పై పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం మళ్లీ జైలుకు తరలించారు.



సగానికి పడిపోయిన 'ఎల్లంపల్లి'

- మూడు మాసాల్లో డెడ్ స్టోరేజీకి నీటిమట్టం?
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అడుగంటుతున్న జలాలు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోని వరద నీటిమట్టం సగానికి పడిపోయింది. రాబోయే మూడు మాసాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కానుండటంతో డెడ్ స్టోరేజీకి చేరే అవకాశాలు లేకపోలేదని పలువురు అధికారులు అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోగా పునరుద్ధరణ పనులపై ప్రభుత్వం పునరాలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో ఏడాది వరకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కాళేశ్వరం ఎత్తిపోతలు కొనసాగే అవకాశం లేదన్న విషయం సుస్పష్టం. నీటిపారుదల శాఖ అధికారులు శనివారం వెల్లడించిన ప్రాజెక్టు ఫ్లడ్ రిపోర్టును పరిశీలిస్తే.. ఎల్లంపల్లి పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 10.86 టీఎంసీలు ఉంది. ఇందులో గూడెం ఎత్తిపోతలకు 290, హైదరాబాద్ మెట్రోవాటర్ సప్లైకి 331, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, మొత్తం 742 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో జరుగుతోంది. ప్రాజెక్టులోకి ఎలాంటి ఇన్‌ఫ్లో లేదని వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

క్యాబినెట్ సబ్ కమిటీని స్వాగతిస్తున్నాం

కరీంనగర్: రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 మేరకు జీవో నెంబర్ 317 ద్వారా నూతన జిల్లాలకు ఉద్యోగుల కేటాయింపుతో అనేక సమస్యలు ఏర్పడినందున అట్టి సమస్యలను పరిష్కరించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ నూతన ప్రజాసర్కార్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా సమన్వయకర్త మహమ్మద్ ఫయాజ్ అలీ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వెంటనే ప్రభుత్వం అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని కోరారు. 317 జీవో ద్వారా నష్టం జరిగిన ఉద్యోగుల నుంచి కూడా అప్పీళ్లు స్వీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే కమిటీకి జోనల్ వ్యవస్థపై రివ్యూ జరిపేందుకు అధికారం కల్పించాలని కోరారు.

ఉప సంఘం ఏర్పాటుపై ఎస్టీయూ హర్షం

కరీంనగర్: జీవో 317 ద్వారా ఏర్పడిన సమస్యల పరిష్కారానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటును ఎస్టీయూ జిల్లా శాఖ స్వాగతిస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఆర్.శ్రీనివాస్, కె.రవీంద్రచారి ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జీవో 317 ద్వారా ఏకపక్షంగా విడుదల చేసిన మార్గదర్శకాలతో పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబుకు సమస్యను కూలంకషంగా వివరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ హామీ మేరకు మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడం ఒక ముందడుగు అని, సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందనే ఆశాభాశం వ్యక్తం చేశారు.

మొగ్ధుంపూర్ సబ్ స్టేషన్ ఆపరేటర్ సస్పెండ్

కరీంనగర్‌రూరల్: మొగ్ధుంపూర్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న చీటి కార్తీక్ వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయలేదనే కారణంతో శనివారం కరీంనగర్‌టౌన్ డీఈ రాజం(ఆపరేషన్) సస్పెండ్ చేశారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు వ్యవసాయ బావులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా.. ఆపరేటర్ కార్తీక్ విద్యుత్ సరఫరా చేయలేదనే రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ నిర్వహించారు. అనంతరం కార్తీక్‌ను సస్పెండ్ చేస్తూ డీఈ రాజం ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా విజయభాస్కర్



కరీంనగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా భోగ విజయభాస్కర్ ఎన్నికయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ శనివారం నియామక ప్రకటన విడుదల చేశారు. అవకాశం కల్పించిన ఎంపీ బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, శ్రేణులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు చేయూత



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న చకిలం స్వప్నశ్రీనివాస్

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రమాదవశాత్తు ఇటీవల గుడిసెలు మంటల్లో దగ్ధమవగా.. రోడ్డున పడ్డ కుటుంబాలకు మేమున్నామంటూ భరోసా ఇస్తూ వారిలో ధైర్యాన్ని నింపారు కరీంనగర్‌కు చెందిన మేముసైతం యువసేన ఫౌండేషన్. 21 కుటుంబాలకు శనివారం చీరలు, లుంగీలు, చాపలు, బిందెలు, క్యాన్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్నశ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కక్కిరాల సుజన రమేశ్ సౌజన్యంతో పంపిణీ చేసినట్లు తెలిపారు. సభ్యులు శ్రీనివాస్, రూప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శివనగర్‌లో 130వ ఎన్నీల ముచ్చట్ల సాహిత్య కార్యక్రమం జరిగింది. కవి రాము ఎటిక్యాల మాట్లాడుతూ.. కవులు సామాజిక బాధ్యతతో రాయాలని, సామాజిక కోణం ఉండాలన్నారు. సమాజాన్ని మేలుకొలుపేది కవిత్వమని, సమకాలీన సామాజిక సమస్యలు ఇతివృత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి యుగేందర్ ఆతిథ్యం ఇచ్చారు. కార్యదర్శి దామరకుంట శంకరయ్య, పెనుగొండ బసవేశ్వర్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ మాధవి, కవులు అన్నవరం దేవేందర్, విలాసాగరం రవీందర్, ఇటిక్యాల రాము, అఖిల్‌కుమార్, గుండు రమణయ్య, మధు, సదాబాలసాని కొమురయ్య, గుడికందుల అరుణ్, కూకట్ల తిరుపతి, వాసాల వరప్రసాద్, బుర్ర తిరుపతి, నదిమెట్ల రామయ్య, గీతారెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులూ.. 'టెన్'షన్ వద్దు..

గతేడాది వరకు ఆటపాటలు.. అమ్మానాన్నలతో కబుర్లు.. పిక్నిక్‌లు.. పార్కులు.. షికారులు బోలెడన్ని సెలవులు. ఈ ఏడాది మాత్రం వాతావరణం మారిపోయింది. పిల్లలు పదోతరగతికి వచ్చేశారు కదా.. పబ్లిక్ పరీక్షలు రాయాలి మరి. ఉన్నతంగా ఎదిగేందుకు తొలిమెట్టు ఇదే. అయితేనేం భయం వద్దు. దిగులు వద్దు. మీరు పెద్దవాళ్లయిపోయారు. ఈ సూచనలు పాటించండి.. మంచి మార్కులు కొట్టేయండి.

- మరికొన్ని రోజుల్లో పరీక్షలు ప్రారంభం
- ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు
- ఆత్మవిశ్వాసంతో ఒత్తిడి మాయం
- తల్లిదండ్రుల తోడ్పాటు తప్పనిసరి



కరీంనగర్: విద్యార్థి జీవితాన్ని కీలక మలుపు తిప్పే పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలు కానున్నాయి. ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు, మే నెలలో డిగ్రీ, ఇతర ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి, మార్చి విద్యార్థులకు పరీక్షల కాలమే. ఎస్ఎస్‌సీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా ఆయా యాజమాన్య పాఠశాలల నుంచి 15,767 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 33,545 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. ఏడాది పొడవునా పాఠ్యాంశాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు కావడంతో సహజంగానే ఈ దశలో ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించగలమో లేదోనన్న ఆందోళన కలగక మానదు. ఒత్తిడిని అధిగమించి, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చు.

పక్కా ప్రణాళికతో..

ఉన్నత లక్ష్యాల సాధనలో పరీక్షలను ఓ సోపానంలా భావించాలి. పరీక్షల సమయంలో ఆయా సబ్జెక్టులను చదివేందుకు సీనియర్లు, ఉపాధ్యాయులను సంప్రదించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. పరీక్షలకు హాజరు కాబోతున్న పిల్లల్లో భయాందోళనలు కలగకుండా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు తల్లిదండ్రులు తోడ్పాటునందించాలి.

ఆహారం ఎంతో కీలకం

ఏడాది పొడవునా బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు చివరి పరీక్షల్లో అనారోగ్యానికి గురై ఫలితాల సాధనలో వెనుకబడిన సందర్భాలనేకం. విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు రోజువారీ తీసుకునే ఆహారంలో కొద్దిపాటి జాగ్రత్తలు అవసరం. పరీక్షల సమయంలో మాంసాహారానికి దూరంగా ఉండడం మేలు. సాత్విక ఆహారంతో శరీరానికి కావాల్సిన పోషకాలు లభించడంతోపాటు మానసికంగా ఉత్సాహం చేకూరుతుంది. పండ్లు, కూరగాయలు మెదడు చురుగ్గా పని చేసేందుకు దోహదపడతాయి.

ప్రశ్నాపత్రాలు తయారు చేసుకోవాలి

పాఠాలవారీగా అన్ని విషయాలు చక్కగా చదవాలి. మొదటి, రెండో పేపర్లు మాదిరి ప్రశ్నాపత్రాలు తయారు చేసుకోవాలి. సమాధానాలు రాయాలి. క్వశ్చన్ బ్యాంక్‌లోని చిన్న, పెద్ద ప్రశ్నలను చదవాలి. రోజు ఆరు పాఠ్యాంశాలు విధిగా చదవాలి. ఫార్మెటివ్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో పత్రాలను పరిశీలించి తప్పులు సరి చేసుకోవాలి.

చక్కని రాత..

ఏడాది కాలంలో చదివిందంతా రెండున్నర గంటల్లో రాయాల్సి ఉంటుంది. కాబట్టి అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా అన్ని అక్షరాలు సమానంగా, తలకట్టు, గుడి ఒకేలా, గుడి దీర్ఘాలు పెద్దగా, చిన్నగా కాకుండా సరిపడేలా రాయాలి.

జవాబు పత్రాలు సరిచూసుకోవాలి

రాసిన పత్రాలను పేజీ నెంబర్లు వేసుకుంటూ క్రమ పద్ధతిలో పెట్టుకోవాలి. మంచి దారం తీసుకొని అబ్జెక్టివ్ పేపర్ చివరన పెట్టి సమానంగా కట్టాలి.

పరీక్ష తర్వాత..

పరీక్ష పూర్తయిన తర్వాత హాల్ నుంచి బయటకు రాగానే తోటివారితో చర్చించి తాము రాసినవి ఎక్కడ తప్పులోనని భయపడుతుంటారు. అలా జంకొద్దు. దాని ప్రభావం మరుసటి రోజు రాసే పరీక్షలపై పడుతుంది.

ప్రజంటేషన్ కీలకం



విద్యార్థుల తెలివితేటలు, జ్ఞాపకశక్తి కంటే పరీక్షల్లో ప్రజంటేషన్ కీలకం. చాలామంది విద్యార్థులు ఒత్తిడికి గురై తెలిసిన ప్రశ్నలకు సైతం జవాబులు రాయలేరు. పిల్లలను స్వేచ్ఛగా చదవనివ్వాలి. ఏ సమయంలోనైనా పరీక్షను సులభంగా రాయగలిగేలా తీర్చిదిద్దాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషితోనే ఇది సాధ్యం.
– అట్ల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ ఫ్యామిలీ కౌన్సిలర్

ఏడాది శ్రమ వృథా



పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక సంఘర్షణకు లోనైతే వారు ఏడాది చదివిన చదువు వృథా అవుతుంది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండాలి. తెలిసిన అంశాలకు స్పష్టమైన సమాధానాలు రాయాలి. మనోవిజ్ఞానికంగా ఉన్న విషయ పరిజ్ఞానాన్ని వ్యక్తం చేస్తే మంచి మార్కులు వస్తాయి. పరీక్షల కోసం చదివేటప్పుడు మాత్రమే లక్ష్యం ఉండాలి. పరీక్ష రాసేటప్పుడు లక్ష్యం పెట్టుకుంటే ఒత్తిడి పెరుగుతుంది.
– ఏనుగు ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు

టీవీ చూడొద్దు



తల్లిదండ్రులు టీవీ ముందు కాలక్షేపం చేస్తే.. విద్యార్థుల దృష్టి దీనిపై పడుతుంది. దీనికి ఉత్తమ పరిష్కారం పరీక్షలు ముగిసేవరకు ఇంట్లో టీవీ బంద్ చేయాలి. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు పరోక్షంగా మేలు జరిగినట్లే. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. పరీక్షలు ముగిసేంవరకు తల్లిదండ్రులు ఎంతో కొంత త్యాగం చేయాలి. లేదంటే తమ పిల్లల భవిష్యత్ దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. ఇంటి వంటే చేసి పెట్టాలి.
– యాదగిరి శేఖర్‌రావు, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

ఇలా చేయాలి..

- పరీక్ష ముందు రోజు హాయిగా నిద్రపోవడం మంచిది. నిద్ర మెదడు పనితీరును ప్రభావితం చేస్తుంది.
- రేపటి పరీక్షను చక్కగా రాస్తున్నట్లుగా ఊహను మనసులో పొందుపరుచుకోవాలి.
- పరీక్షలకు వెళ్లే ముందు పెన్ను, పెన్సిల్, ప్యాడ్, హాల్ టికెట్లను సరిచూసుకోవాలి.
- కేంద్రాన్ని ఒకరోజు ముందుగానే చూసుకుంటే చివరి నిమిషంలో హైరానా ఉండదు.
- ఎగ్జామ్ సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ప్లాన్ చేసుకోవాలి.
- కొత్త వాతావరణంలో ఉన్నామనే భయాన్ని వదిలేయాలి.
- పరీక్ష రాసే ముందు నిటారుగా కూర్చొని శ్వాసను గమనిస్తూ రిలాక్స్ అవ్వాలి.
- ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నలన్నింటిని క్షుణ్ణంగా చదివి బాగా రాయగలననుకున్న ఆరేడు ప్రశ్నలను ఎంచుకోవాలి. వాటిలో మూడు ప్రశ్నలకు జవాబులు రాశాక.. కష్టమనిపించిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. చివరిగా ఎంపిక చేసుకున్న ప్రశ్నలకు జవాబులు రాయండి.
- జవాబు పత్రంలో ఎక్కువగా కొట్టివేతలు, దిద్దుడు లేకుండా అందమైన అక్షరాలతో సమాధానాల హారాన్ని మలచండి. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు మీ సొంతమౌతాయి.

మాఘ శుద్ధ పౌర్ణమి పూజలు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శనివారం మాఘ శుద్ధ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. దేవుళ్లపురి సీతారామ, పంచముఖ హనుమదీశ్వర ఆలయంలో మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో అభిషేకం, అర్చనలు, చండీయాగం జరిపారు. బొమ్మకల్ రోడ్‌లోని పంచముఖ హనుమాన్ ఆలయంలో పీఠాధిపతి పరబ్రహ్మనందగిరిస్వామి ఆధ్వర్యంలో జరిగిన హోమంలో జీఎస్ ఆనంద్, తోట రాజేందర్, ఆర్ నందు, ప్రసాదావు, హరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

సంత్ రవిదాస్ జయంతి



కరీంనగర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: జిల్లాకేంద్రంలోని కోర్టు చౌరస్తాలో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అంది సాగర్ మాట్లాడుతూ.. ఉత్తర భారతదేశంలో అట్టడుగు వర్గాలు రాజ్యంలోకి రావడానికి సంత్ రవిదాస్ నిర్మించిన సాంస్కృతిక ఆధ్యాత్మిక ఉద్యమమే కారణమని అన్నారు. అదే స్ఫూర్తితో మాదిగ జాగృతి సంఘం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జంగా అంజన్‌బాబు, సంపత్, రమేశ్, బెజ్జంకి రవీందర్, డీఎస్పీ నాయకులు నరేష్, ఆరెల్లి బాబు, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జరుపుకోవాలి

కరీంనగర్: భారతదేశంలో ఆధ్యాత్మిక గొప్ప గురువు సంత్ రవిదాస్ మహారాజు 1,377వ జయంతిని జరుపుకోవాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బోయినిపెల్లి చంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. భక్తి ఉద్యమ తాత్వికాల్లో అగ్రగామి సంత్ శిరోమణి రవిదాస్‌జీ మహారాజు ఫిబ్రవరి నెల నాగ పూర్ణిమ చమార్ కులంలో కాశిపట్నం సమీపంలో జన్మించారన్నారు. చర్మకార వృత్తి కులాలు అనేవి మనుషులు సృష్టించినవని అన్నారు. సాంఘిక దురాచారాలను నిర్మూలించే ప్రయత్నం చేశారన్నారు. సమాజంలో కొంతమందితో సంపద, జ్ఞానం, సమానత్వం దూరమయ్యాయని అన్నారు. చల్పూరి రాంమూర్తి, గోష్కి శంకర్, సిగిరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి అమలుకు సన్నాహాలు

- 39వేల దరఖాస్తుల వివరాల నమోదు పూర్తి



బొమ్మకల్ సబ్ స్టేషన్ విద్యుత్ సిబ్బంది విజయకేతనం

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేసేందుకు అన్ని చర్యలు చేపట్టింది. మార్చి నెల నుంచి నిరుపేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించింది. ఇప్పటివరకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబర్లను సమర్పించిన లబ్ధిదారులకు మొదటి దశలో ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నారు.

53వేల గృహ విద్యుత్ కనెక్షన్లు

కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలో 53వేల గృహ విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఈనెల 5 నుంచి 14 వరకు స్పాట్ బిల్లింగ్ సిబ్బంది ఇంటింటికి తిరిగి మీటర్ రీడింగ్‌తోపాటు లబ్ధిదారుల రేషన్ కార్డు, ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్లను సేకరించారు. వివరాలన్నింటినీ విద్యుత్ శాఖ ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులు ఈఆర్‌వో కార్యాలయంలో వివరాలను సమర్పించారు. మొత్తం 53వేల విద్యుత్ కనెక్షన్లలో 39వేల మంది వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను అధికారులు నమోదు చేశారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఇంటి వివరాలను తీసుకుంటున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. అర్హులెవరనేది ఇంకా గుర్తించలేదని, ప్రభుత్వం ఇచ్చే విధివిధానాల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశముందంటున్నారు.

26న అండర్ పాస్ పనులు ప్రారంభం

కరీంనగర్‌టౌన్/జమ్మికుంట: జమ్మికుంట మండలంలోని తనుగుల–విలాసాగర్ రైల్వే ఎల్‌సీ నంబర్ 26 వద్ద అండర్ పాస్ నిర్మాణ పనులను ఈనెల 26న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రకటనలో తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, రోడ్డు ఓవర్ బ్రిడ్జి, అండర్ పాస్ పనులను ఉదయం 10:30 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అండర్ పాస్ నిర్మాణంతో ప్రజలు, రైతులకు, వ్యాపారస్తులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

కుల గణనతో వెనుకబడిన వర్గాలకు మేలు



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్: బీసీల సంక్షేమానికి తోడ్పడే కుల గణనపై అసెంబ్లీలో తీర్మానం చేసినందున రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వచ్చేనెల 3న సన్మానించాలని 33 బీసీ కుల సంఘాలు తీర్మానించాయి. కార్యక్రమ సన్నాహక సమావేశం శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ మాట్లాడుతూ.. కుల గణన వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తుందని తెలిపారు. అసెంబ్లీలో కుల గణన కోసం తీర్మానమయ్యేలా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన కృషిని ప్రతి బీసీ కుల సంఘం గుర్తుంచుకుంటుందని చెప్పారు. మార్చి 3న బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా గార్డెన్‌లో పొన్నం ప్రభాకర్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా బీసీలు ఈ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పొన్నం సన్మాన కార్యక్రమ నిర్వహణ కోసం 33 కుల సంఘాలు బీసీ సంఘాల ఐక్యవేదికగా ఏర్పడ్డాయి. కన్వీనర్‌గా వైద్యుల అంజన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్ వ్యవహరించనున్నారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు కేశిపెద్ది శ్రీధర్‌రాజు, మెతుకు సత్యం, గీకురు రవీందర్, వి.గణేశ్‌బాబు, లక్కాకుల సురేందర్‌రావు, మీస బీరయ్య, మడుపు మోహన్‌చారి, సింగిరాల వెంకటస్వామి, బసవరాజు శంకర్, జక్కని సంపత్, నాగారం సత్యంయాదవ్, నలువాల రవీందర్, గడ్డం శ్రీరాములు, మోసం అంజయ్య, వీర దేవేందర్‌పటేల్, ఎ.కిరణ్‌కుమార్, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కరీంనగర్‌క్రైం: పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 20 మంది వ్యక్తులను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శనివారం కోర్టులో హాజరుపరచగా.. ఇందులో ఇద్దరికి జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ ఎం.డి.సర్వర్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్ష, రూ.4,500 జరిమానా విధించగా.. మిగతా 18మందికి రూ.29,000 జరిమానా విధించినట్లు చెప్పారు.

సెల్‌ఫోన్ అప్పగింత

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికురాలు శనివారం సెల్‌ఫోన్, ఆధార్ కార్డును పోగొట్టుకోగా, మరో ప్రయాణికుడు గమనించి బస్టాండ్‌లోని ఆర్టీసీ కంట్రోల్ అధికారులకు అందజేశారు. కరీంనగర్‌కు చెందిన సంతోషిని సెల్‌ఫోన్ పోయిందంటూ కంట్రోల్ అధికారులకు తెలియజేసింది. ఈమేరకు పోగొట్టుకున్న సెల్‌ఫోన్, ఆధార్ కార్డును అధికారులు సంతోషినికి అప్పగించారు.

'సహకార' రాజకీయం

- చైర్మన్ సీటుకు బీఆర్‌ఎస్‌లో పోటాపోటీ
- ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డైరెక్టర్లతో క్యాంప్
- 27న దుర్శేడ్ సొసైటీ చైర్మన్ ఎన్నిక



దుర్శేడ్ సింగిల్‌విండో కార్యాలయం

కరీంనగర్‌రూరల్: మండలంలో ఒక్కసారిగా సహకార రాజకీయం వేడెక్కింది. చైర్మన్ సీటు కోసం బీఆర్‌ఎస్‌లో తీవ్రమైన పోటీ నెలకొనడంతో.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదేశాల మేరకు శనివారం డైరెక్టర్లను రహస్య శిబిరానికి తరలించారు. ఈనెల 27న దుర్శేడ్ సహకార సంఘం చైర్మన్ ఎన్నికను నిర్వహించేందుకు సహకార శాఖ నోటిఫికేషన్ జారీ చేయడంతో రాజకీయం ఊపందుకుంది. ఏడాది క్రితం చైర్మన్ బల్మూరి ఆనందరావు గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందడంతో.. వైస్ చైర్మన్ గోనే నర్సయ్యను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. అయితే చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ జారీ కావడంతో.. రెండు రోజుల నుంచి బీఆర్‌ఎస్‌లో విందు రాజకీయాలు ఊపందుకున్నాయి. ప్రస్తుత ఇన్‌చార్జి చైర్మన్ గోనే నర్సయ్యకు కొందరు డైరెక్టర్లు సపోర్టు చేస్తుండగా.. డైరెక్టర్ తోట తిరుపతి మెజార్టీ డైరెక్టర్ల మద్దతును కూడగట్టి చైర్మన్ సీటు పొందాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే డైరెక్టర్లందరూ బీఆర్‌ఎస్‌కు చెందిన వాళ్లే కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ కొంతమంది డైరెక్టర్ల మద్దతు కోసం రహస్య మంతనాలను చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డైరెక్టర్లందరినీ క్యాంపునకు తరలించాలని నిర్ణయించారు. ఈనెల 27న జరిగే ఎన్నిక రోజున చైర్మన్ పేరు ప్రకటిస్తామని ఎమ్మెల్యే చెప్పడంతో.. బీఆర్‌ఎస్ నాయకులు మొత్తం 13 మంది డైరెక్టర్లలో శనివారం 10 మందిని భద్రాచలం, పాపికొండలు టూర్‌కు తరలించినట్లు తెలుస్తోంది.

నేడు నుస్తులాపూర్ సొసైటీ గోదాం ప్రారంభం

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రైతు సేవాకేంద్రం గోదాంను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతారని, మండలంలోని రైతులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

విధులకు గైర్హాజరు

శంకరపట్నం: తహసీల్దార్ అనుపమ నాలుగు రోజులుగా విధులకు హాజరు కావడం లేదు. దీంతో రెవెన్యూ, భూసమస్యలతోపాటు భూ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.


భలే మాంచి చౌక బేరమూ!

జనసేనతో చంద్రబాబు డీల్

కేవలం 24 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాలు

నిరాశ, నిస్పృహల్లో జనసైనికులు

- ఊరించి ఉసూరుమనిపించారని ఆగ్రహం.. ఐదుగురి పేర్లు మాత్రమే ప్రకటించిన పవన్ కళ్యాణ్
- 94 అసెంబ్లీ అభ్యర్థుల పేర్లతో టీడీపీ జాబితా
- భయపడ్డట్టుగానే బలహీనత బహిర్గతం
- ఖరారు చేసిన సీట్లలో 52 సీట్లు ఓసీలకే
- తొలి జాబితాలోనే 21 మంది కమ్మ సామాజిక వర్గం వారికి చోటు
- బీసీలకు కేవలం 18.. మైనారిటీలకు ఒకే ఒక్క స్థానం
- కేవలం పది మంది మహిళలకే చోటు



టీడీపీ, జనసేన అభ్యర్థుల జాబితాలతో పవన్ కళ్యాణ్, చంద్రబాబు

సాక్షి, అమరావతి: అందరూ అనుకుంటున్నట్లుగానే జరిగింది. జనసేనను కేవలం 24 స్థానాలకే పరిమితం చేయడంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సక్సెస్ అయ్యారు. పవన్ కళ్యాణ్‌కు ఏం చెప్పారో.. ఏం ఆశ చూపారో కానీ.. పాతిక శాతానికి పైగా సీట్లు ఆశిస్తున్న జనసేన నేతల ఆశలపై నీళ్లు చల్లారు. ఈ మాత్రం సీట్ల కోసం ఇన్నాళ్ల నుంచి ఇంత హంగామా ఎందుకని, ఇలాగైతే రాజ్యాధికారం ఎలా సాధ్యమవుతుందని ఆ పార్టీ నేతలు పవన్ తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. టీడీపీ–జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉండవల్లిలోని తన నివాసంలో విడుదల చేశారు. సీట్ల విషయంలో తాము చాలాసార్లు చర్చలు జరిపామని తెలిపారు. తొలి జాబితాలో 99 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని, ఇందులో టీడీపీ నుంచి 94 మంది ఉన్నారని తెలిపారు. జనసేన 24 అసెంబ్లీ, 3 పార్లమెంటు సీట్లలో పోటీ చేస్తుందన్నారు. ఇలా వారిద్దరూ కలిసి ఉమ్మడి జాబితా విడుదల చేయగానే జనసేన నేతలు ఎక్కడికక్కడ భగ్గుమన్నారు. సీట్ల సంఖ్యలో బాబు చెప్పినట్టే తలూపుతూ తమ అధినేత పవన్ చారిత్రక తప్పిదం చేస్తున్నారని మండిపడ్డారు. పొత్తు పేరుతో జనసేన పార్టీని చంద్రబాబుకు హోల్ సేల్‌గా తాకట్టు పెట్టేశారని దుమ్మెత్తిపోశారు. రెండేళ్లుగా పనులన్నీ మానుకుని పార్టీ కోసం పని చేస్తుంటే, మరీ దారుణంగా 24 సీట్లతో ఎలా పొత్తు పెట్టుకుంటారని దుయ్యబట్టారు.

బాబు బలహీనత బహిర్గతం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారులోనే చంద్రబాబు బలహీనత బహిర్గతమైంది. ఎటువంటి ప్రయోగాలు లేకుండా చాలా సాదాసీదాగా టీడీపీ–జనసేన ఉమ్మడి జాబితాను ప్రకటించారు. ఇందులో దాదాపు అన్నీ పాత ముఖాలే ఉన్నాయి. ఎన్నికలను ఎదుర్కొనే విషయంలో రకరకాల భయాలు, అనుమానాలతో ఉన్న చంద్రబాబు వాటన్నింటినీ జాబితాలో తేటతెల్లం చేశారు. కొత్తదనం అనే మాటే లేకుండా అభ్యర్థులను ఎంపిక చేశారు. బీసీల పార్టీ అని చెప్పుకుంటూ కూడా ఆ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రకటించిన 94 సీట్లలో బీసీలకు కేవలం 18 సీట్లు మాత్రమే ఇచ్చారు. గతంలో కంటే తక్కువ సీట్లు కేటాయించడం గమనార్హం. తన సొంత సామాజికవర్గానికి (కమ్మ) మాత్రం ఏకంగా 21 సీట్లు కేటాయించి తన ప్రాధాన్యత ఏమిటో చంద్రబాబు మరోసారి చాటిచెప్పారు. 94 సీట్లలో 52 మంది ఓసీ అభ్యర్థులే ఉన్నారంటే టీడీపీ ప్రాధాన్యత ఇట్టే అర్థమవుతోంది. మహిళలకు ఎక్కువ అవకాశం కల్పించామని ప్రకటించినా, 94లో పది మంది మాత్రమే ఉన్నారు. దీన్నిబట్టి వారికి ఏ స్థాయిలో అవకాశం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి కేవలం ఏడు సీట్లు మాత్రమే ఇచ్చారు. ఈ జాబితాలో మైనారిటీలకు కేవలం ఒకే ఒక్క సీటు కేటాయించి వారికి టీడీపీలో ఉన్న గౌరవం ఏపాటిదో స్పష్టం చేశారు.

ఒత్తిడి తట్టుకోలేక ఎట్టకేలకు తొలి జాబితా

టీడీపీలో తీవ్ర నైరాశ్యం నెలకొనడంతో ఎట్టకేలకు తొలి జాబితాలో చంద్రబాబు కొందరు అభ్యర్థులను ఖరారు చేశారు. సీట్లు ఖరారు చేయకుండా పవన్‌కల్యాణ్‌తో చర్చలకే పరిమితమవడం, బీజేపీతో పొత్తు కోసం తాపత్రయ పడుతుండడంతో టీడీపీలో ఆందోళన నెలకొంది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ ఒక ప్రణాళిక ప్రకారం అభ్యర్థులను ఖరారు చేస్తూ ముందుకెళుతున్న తరుణంలో చంద్రబాబు స్తబ్దుగా ఉండడంపై క్యాడర్‌లో తీవ్ర నిరుత్సాహం ఏర్పడింది. తాము ఎన్ని సీట్లలో పోటీ చేసే విషయాన్ని తేల్చక పోవడంపై జనసేన నేతల్లోనూ అసహనం పెరిగిపోయింది. బీజేపీతో పొత్తు విషయం తేలాకే సీట్లు ప్రకటించాలనే ఆలోచనతో ఇన్నాళ్లూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఎదురు చూశారు. కానీ ఆ పార్టీ నుంచి సరైన స్పందన రాకపోవడంతో ప్రస్తుతానికి కొన్ని సీట్లలోనైనా అభ్యర్థులను ఖరారు చేసి క్యాడర్‌లో అసహనాన్ని తగ్గించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే శనివారం 99 మందితో జనసేన–టీడీపీ తొలి ఉమ్మడి అభ్యర్థుల జాబితా ప్రకటించారు. పొత్తులో మొత్తంగా జనసేనకు 24 ఎమ్మెల్యే, 3 ఎంపీ సీట్లు దక్కాయి. తన పార్టీకి కేటాయించిన 24 సీట్లకుగాను పవన్ ప్రస్తుతం కేవలం ఐదు సీట్లలోనే అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన ఎమ్మెల్యే, ఎంపీ సీట్లకు త్వరలో అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

పారాచూట్ నేతలకు ప్రాధాన్యత

తొలి జాబితాలో పారాచూట్ నేతలకు ప్రాధాన్యత లభించింది. ఉన్నట్టుండి ఊడిపడిన వెనిగండ్ల రాము, సరిపల్లె రాజేష్, ఎస్ రోషన్, కావ్య కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, వీఎం థామస్ వంటి వారికి సీట్లు ప్రకటించేశారు. అక్కడ పార్టీ కోసం సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న నేతలను పక్కనపెట్టేశారు. తొలి జాబితాలోనే తనతోపాటు తన కుమారుడు, తన బావమరిదికి చంద్రబాబు టికెట్లు ప్రకటించారు. తనకు కుప్పం, తన కుమారుడు లోకేష్‌కు మంగళగిరి, బావమరిది బాలకృష్ణకు హిందూపురం సీట్లు ఖరారు చేశారు. జనసేనకు కేటాయించిన సీట్లు పోగా, మిగిలిన సీట్లలో తమ పార్టీ పోటీ చేస్తుందని బాబు తెలిపారు. బీజేపీ కూడా కలిసి వస్తే తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తమదగ్గర డబ్బులు లేకపోవచ్చు కానీ ప్రజాబలం ఉందని, విలువలతో కూడిన రాజకీయాలు చేశామని చెప్పుకొచ్చారు. మాఘపౌర్ణమి లాంటి శుభ దినాన టీడీపీ–జనసేన అభ్యర్థులను ప్రకటించామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిసి పోటీ చేస్తున్నామన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చేయనంత కసరత్తు చేశానన్నారు. దాదాపు 1.30 కోట్ల మంది అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని, విద్యావంతులకు, యువత, మహిళలకు ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు.

40 స్థానాల్లో జనసేన పోటీ చేస్తున్నట్లు లెక్కట!

ఎక్కువ స్థానాలు తీసుకుని ప్రయోగం చేసేకంటే, తక్కువ స్థానాలు తీసుకుని రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేలా ముందుకెళ్తున్నామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పార్టీ, వ్యక్తి ప్రయోజనాలు దాటి రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్నామని తెలిపారు. కొందరు 45 కావాలి.. 75 కావాలన్నారని, 2019లో పది స్థానాలన్నా గెలిచి ఉంటే ఇప్పుడు ఎక్కువ స్థానాలు అడగడానికి అవకాశం ఉండేదని చెప్పారు. జనసేనకు కేటాయించిన 24 స్థానాలే కనబడుతున్నాయి కానీ.. 3 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తే 21 స్థానాలు జనసేనలో భాగమవుతాయని తనకు తాను సర్దిచెప్పుకున్నారు. ఈ లెక్కన పార్లమెంటు స్థానాల పరిధిని కలుపుకుంటే 40 స్థానాల్లో జనసేన పోటీ చేస్తున్నట్లు లెక్క అని సరికొత్త లెక్క చెప్పారు. పొత్తు బలంగా ఉండాలని బీజేపీని దృష్టిలో పెట్టుకున్నామని తెలిపారు.

సంతకాలు చేస్తారా.. చస్తారా?

తుపాకీ గురిపెట్టి 'మార్గదర్శి' సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి కుమారులకు రామోజీ బెదిరింపు

- ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా షేర్ల బదిలీ
- రూ.1,59,69,600 మూలధన విలువైన 288 షేర్ల బదిలీ
- న్యాయపోరాటం చేస్తున్న జీజే రెడ్డి కుటుంబం
- జీజే రెడ్డి కుమారుల ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు
- ఏ–1గా రామోజీ, ఏ–2గా శైలజా కిరణ్‌పై కేసు నమోదు



గురివింద
రామోజీ-4

సాక్షి, అమరావతి: ఆదరించినవారికి ద్రోహం చేయడం, ఆశ్రయం కల్పించిన వారిని ముంచేయడం అంటే ఠక్కున చంద్రబాబే గుర్తుకు వస్తారు. కానీ ఆయన రాజగురువు రామోజీరావు కూడా ఆ విషయంలో రెండాకులు ఎక్కువే చదివారు. రామోజీ వ్యాపార సామ్రాజ్యానికి నల్లధనం సరఫరా యూనిట్‌గా నిలుస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్సే నమ్మక ద్రోహం, మోసాల పునాదుల మీద ఏర్పడింది. నమ్మి ఆశ్రయం కల్పించిన మిత్రుడు, భాగస్వామి జీజే రెడ్డి కుటుంబాన్ని నిలువునా మోసం చేసి, వారి షేర్లను కొల్లగొట్టి.. తుపాకీతో బెదిరించి మరీ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను హస్తగతం చేసుకోవడం రామోజీ వికృత వ్యాపారానికి నిదర్శనం. రామోజీ చేసిన ద్రోహంపై జీజే రెడ్డి వారసులు సీఐడీకి ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయ పోరాటం చేయాల్సి వస్తోంది. పాయింట్ బ్లాంక్‌లో తుపాకి గురిపెట్టి రామోజీ చేసిన మైండ్ బ్లోయింగ్ దుర్మార్గం ఇదిగో ఇలా ఉంది..

ఆదరించిన చేయినే కాటేసిన రామోజీ..

కృష్ణాజిల్లా జొన్నలపాడుకు చెందిన జీజే రెడ్డి చెకొస్లోవేకియాలో ఉన్నత విద్య పూర్తి చేసిన అనంతరం ఢిల్లీలో నవభారత్ ఎంటర్‌ప్రైజెస్ అనే కంపెనీని ఏర్పాటు చేశారు. అదే జిల్లా పెదపారుపూడికి చెందిన రామోజీరావు అప్పట్లో నిరుద్యోగి. 1960లో కమ్యూనిస్ట్ పార్టీ నేత కొండపల్లి సీతారామయ్య సిఫార్సు చేయడంతో రామోజీకి జీజే రెడ్డి తన కంపెనీలో టైపిస్టుగా ఉద్యోగం ఇచ్చారు. అంతేకాదు.. రెండేళ్లకే అంటే 1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయడం కోసం రామోజీరావుకు జీజే రెడ్డి ఆర్థిక సహకారం అందించారు. ఆ కంపెనీలో జీజే రెడ్డికి 288 షేర్లు ఉన్నాయి. తదనంతర పరిణామాల్లో జీజే రెడ్డి చెకొస్లోవేకియాలో స్థిరపడి 1985లో అక్కడే చనిపోయారు. ఆయన భార్య కూడా 1986లో మరణించారు. కాగా జీజే రెడ్డి ఇద్దరు కుమారులు మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తమ తండ్రి వాటా షేర్లను తమ పేరిట బదిలీ చేయాలని చాలాసార్లు కోరినా రామోజీరావు ససేమిరా అన్నారు. ఆ షేర్లు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు.

తుపాకీతో బెదిరించిన రామోజీ

2014లో పత్రికల్లో వచ్చిన వార్తలు, నోటిఫికేషన్ల ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో షేర్ల వివరాలను మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డి తెలుసుకున్నారు. అప్పటి నుంచి తమ తండ్రి పేరిట ఉన్న షేర్ల కోసం రామోజీరావును కలిసేందుకు రెండేళ్లపాటు ప్రయత్నించిన తరువాత... 2016 సెప్టెంబరు 29న రామోజీరావు ఆ సోదరులిద్దరికీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. తమ తండ్రి పేరిట ఉన్న షేర్లకు సంబంధించి షేర్ సర్టిఫికెట్ ఇవ్వాలని మార్టిన్ రెడ్డి రామోజీని కోరారు. అప్పుడు 2007–08 వార్షిక సంవత్సరానికి సంబంధించి షేర్లపై డివిడెండ్ కింద రూ.39,74,400 విలువైన యూనియన్ బ్యాంక్ చెక్ (నంబరు 137991)ను ఆయన వారికిచ్చారు. మిగిలిన సంవత్సరాల డివిడెండ్ కూడా చెల్లించాలని యూరీ రెడ్డి కోరారు. అవన్నీ సెటిల్ చేస్తానని చెప్పి రామోజీరావు వెళ్లిపోయారు. అనంతరం.. రామోజీ రావు సిబ్బంది మార్టిన్ రెడ్డి, యూరిరెడ్డిని ఓ గదిలో కూర్చోమని చెప్పి వెళ్లారు. కాసేపటికి రామోజీ ఆ గదిలోకొచ్చి ఓ రూ.100 విలువైన స్టాంపు పేపర్‌పై రాసిన అఫిడవిట్ మీద సంతకం చేయమని మార్టిన్ రెడ్డికి చెప్పారు. తన వాటా షేర్లను తన సోదరుడు యూరి రెడ్డి పేరిట మార్చేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని అందులో రాసి ఉంది. అదే సమయంలో 2016 అక్టోబరు 5 వ తేదీతో ఉన్న రూ.2,88,000 పోస్ట్ డేటెడ్ చెక్ (నంబరు 296460)ను యూరి రెడ్డికి ఇచ్చి తేదీ లేని ఫామ్ ఎస్‌హెచ్–4పై సంతకం చేయమని రామోజీరావు చెప్పారు. కానీ, దీనిపై సంతకం చేసేందుకు యూరి రెడ్డి నిరాకరించారు. దాంతో రామోజీరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. తుపాకీ తీసి అన్నదమ్ములు మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డిల తలకు గురిపెట్టారు. 'మిమ్మల్ని కాపాడటానికి ఇక్కడ ఎవరూ లేరు. సంతకాలు చేయకపోతే కాల్చి పారేస్తా' అని బెదిరించారు. దాంతో ప్రాణభయంతో ఆ ఫామ్‌పై యూరి రెడ్డి సంతకం చేశారు. తమ షేర్లను ఎవరి పేరిట బదిలీ చేస్తోందని గానీ, తేదీ గానీ ఆ ఫామ్‌పై లేవు. తుపాకితో బెదిరించడంతో కేవలం ప్రాణభయంతోనే ఆ ఫామ్‌పై సంతకాలు చేసి అక్కడి నుంచి బయటపడ్డారు.

షేర్ల బదిలీకి సమ్మతించని సోదరులు

ప్రాణభయంతో ఆ ఫామ్‌పై సంతకం చేసినప్పటికీ తమ వాటా షేర్లను బదిలీ చేసేందుకు యూరి రెడ్డి, మార్టిన్ రెడ్డి సమ్మతించలేదు. అందుకే వారు రామోజీరావు ఇచ్చిన చెక్కును నగదుగా మార్చుకోలేదు. ఆ చెక్కును నగదుగా మారిస్తే షేర్ల బదిలీకి సమ్మతించినట్టు అవుతుంది. అందుకే వారు ఆ చెక్కును నగదుగా మార్చకుండా అలానే ఉంచారు. నిజానికి.. షేర్లు బదిలీ చేయాలంటే ఒక్క పత్రంపై సంతకం చేస్తే సరిపోదు. అందుకు సంబంధించిన చాలా పత్రాలపై సంతకాలు చేయాలి. చిట్‌ఫండ్స్ చట్టం, కంపెనీల చట్టం ప్రకారం నిర్దేశించిన అన్ని పత్రాలపై తాను సంతకాలు చేయలేదు కాబట్టి తాను షేర్లు బదిలీ చేసినట్లు కాదని యూరి రెడ్డి ధీమాగా ఉన్నారు. రామోజీరావు ఇచ్చిన చెక్కును నగదుగా మార్చుకోలేదు కాబట్టి షేర్ల బదిలీకి అంగీకరించలేదనడానికి బలమైన సాక్ష్యంగా ఉందని ఆయన భావించారు. ప్రాణభయంతో మరోసారి రామోజీని సంప్రదించేందుకు సాహసించలేదు. తమ షేర్లపై రావల్సిన డివిడెండ్‌ను కూడా అడగలేకపోయారు. దీంతో 2016 నాటికి ఒక్కోటి రూ.55,450 విలువ చేసే 288 షేర్లు అంటే రూ.1,59,69,600 మూలధన విలువైన షేర్లు ఆయన పేరిట ఉన్నాయి.

ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా బదిలీ

కానీ అక్రమాల్లో ఆరితేరిన రామోజీ మాత్రం ఫోర్జరీ సంతకాలతో జీజే రెడ్డి షేర్లను తన కోడలు శైలజ కిరణ్ పేరిట బదిలీ చేసేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఇటీవల ఏపీ సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో కాస్త ధైర్యం చేసుకుని యూరి రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తన షేర్ల గురించి తెలుసుకోవాలని భావించారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయంలో పరిశీలించగా ఆయన పేరిట ఒక్క షేర్ కూడా లేదని తెలుసుకుని విస్తుపోయారు. ఆయన పేరిట ఉన్న 288 షేర్లను 2016లోనే శైలజ కిరణ్ పేరిట బదిలీ చేసినట్లు రికార్డుల్లో ఉంది. తాను సంతకాలు చేయకుండా ఎలా బదిలీ చేశారా అని పరిశీలిస్తే అసలు బాగోతం బయటపడింది. యూరి రెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి మరీ ఆయన వాటా షేర్లను శైలజ కిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేసేసినట్లు వెల్లడైంది. షేర్ల బదిలీకి కంపెనీల చట్టంలో నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించకుండానే రామోజీరావు ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో కథ నడిపించేశారు.

రామోజీ, శైలజలపై సీఐడీ కేసు

జీజే రెడ్డి పెద్ద కుమారుడు మార్టిన్ రెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉండగా.. రెండో కుమారుడు యూరి రెడ్డి భారత్‌లో నివసిస్తూ తమ కుటుంబ ఆస్తి వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. తమ షేర్లను రామోజీరావు, శైలజా కిరణ్ ఫోర్జరీ పత్రాలతో అక్రమంగా బదిలీ చేసుకున్నారని యూరి రెడ్డి ఏపీ సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎందుకంటే కృష్ణా జిల్లాలోని తమ స్వగ్రామంలోని ఆస్తుల నుంచి సేకరించిన నిధులనే జీజే రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్‌లో 37 బ్రాంచి కార్యాలయాల ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిపై న్యాయ నిపుణులను సంప్రదించిన తరువాతే యూరి రెడ్డి తన షేర్ల అక్రమ బదిలీపై ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాత సీఐడీ విభాగం కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఆయన కోడలు చెరుకూరి శైలజా కిరణ్‌ను ఏ–2గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వారిపై ఐపీసీ సెక్షన్లు 420, 467, 120–బి రెడ్‌విత్ 34 కింద అభియోగాలు నమోదు చేసింది.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కుటుంబంతో జస్టిస్ జేకే మహేశ్వరి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం పలుకగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, శ్రీలంక హై కమిషనర్ వెంకటేష్ ఉన్నారు.

పలువురు సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు

అడిషనల్ డీజీగా స్టీఫెన్ రవీంద్ర



స్టీఫెన్ రవీంద్ర

సాక్షి , హైదరాబాద్: పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హోంగార్డ్స్ విభాగం ఐజీగా ఉన్న 1999 బ్యాచ్ ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్రకు అడిషనల్ డీజీగా పదోన్నతి లభించింది. ఆయన్ను అదే పోస్టులో కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం డీఐజీ ర్యాంకులో కొనసాగుతున్న 2006 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు కార్తికేయ, కె.రమేష్ నాయుడు, ఎ.వి.రంగనాథ్, వి.సత్యనారాయణ, బి.సుమతి, ఎం.శ్రీనివాసులు ఐజీలుగా పదోన్నతులు పొందారు. వీరందరినీ యథాతథ పోస్టుల్లోనే కొనసాగిస్తున్నట్లు సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీనియర్ ఎస్పీలుగా కొనసాగుతున్న 2010 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు ఎస్.ప్రకాశ్‌రెడ్డి, డి జోయల్ డేవిస్ డీఐజీలుగా పదోన్నతులు పొందారు.

'ముష్టి'కే మురిసిన పవన్!

25 సీట్లు తీసుకోవడానికి ముష్టి వాళ్లమా అంటూ సభల్లో ప్రసంగం

- ఇప్పుడు టీడీపీ విదిల్చిన 24 సీట్లకే అంగీకారం
- ఇంత దారుణమా అంటూ పవన్‌పై పార్టీ శ్రేణుల ఆగ్రహం
- 'బాబు'కు హోల్‌సేల్‌గా పార్టీ తాకట్టు పెట్టారని విమర్శ
- నియోజకవర్గాల్లో నేతల తీవ్ర నిరసన
- జగ్గంపేట సీటు రాలేదని కన్నీరుపెట్టుకున్న పాఠంశెట్టి
- ఎన్నికలయ్యాక తాను, భార్య ప్రాణాలు విడుస్తామంటూ ఆవేదన
- 'మనం పవన్‌ను నమ్మాం. అతను మనల్ని నమ్మలేదు' అంటూ బండారు ఆక్రోశం
- అసలు పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్న స్పష్టతే లేదు
- 19 స్థానాలను ఎందుకు సస్పెన్స్‌లో పెట్టారంటూ పార్టీవర్గాల్లో చర్చ



జగ్గంపేట సీటును టీడీపీకి కట్టబెట్టడంతో కన్నీరు పెట్టుకుంటున్న జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్రరావును ఓదారుస్తున్న మహిళలు

సాక్షి, అమరావతి,/సాక్షి ప్రతినిధి, కాకినాడ: చంద్రబాబు ఇచ్చే 25 సీట్లు తీసుకోవడానికి ము... ష్టి వాళ్లమా అంటూ వివిధ సభల్లో మాట్లాడిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. ఇప్పుడు టీడీపీ విదిల్చిన 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ స్థానాలకు మురిసిపోవడంపై జనసేన శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. పొత్తు పేరుతో జనసేన పార్టీని చంద్రబాబుకు పవన్ హోల్‌సేల్‌గా తాకట్టు పెట్టేశారని, చారిత్రక తప్పిదం చేశారని నాయకులు, అభిమానులు నిప్పులు చెరుగుతున్నారు. మరీ 24 అసెంబ్లీ సీట్లతోనే సరిపెట్టుకోవడం దారుణమని మండిపడుతున్నారు. ఇది జనసేనా? తెలుగుసేన అనాలా అంటూ ధ్వజమెత్తుతున్నారు. శనివారం టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితా విడుదలైన అనంతరం రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో జనసేన నేతలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలో టీడీపీ నేతలు ఎన్ని అవమానాలకు గురి చేసినా పార్టీని భుజాన వేసుకొని, గ్రామగ్రామానా తిరుగుతున్న జనసేన ఇన్‌చార్జి పాఠంశెట్టి సూర్యచంద్రరావు.. ఆ స్థానాన్ని టీడీపీ నేత జ్యోతుల నెహ్రూకు ప్రకటించడంతో షాకయ్యారు. పాదయాత్రలో ఉండగానే పార్టీ శ్రేణుల వద్ద కన్నీరు పెట్టుకున్నారు. 'రబ్బరు చెప్పులు వేసుకునే మనలాంటి పేదవాళ్లు ఎమ్మెల్యే సీటు ఆశించకూడదు' అంటూ విలపించారు. 'ఈ రోజు నుంచి ఎన్నికలయ్యే వరకూ మంచి నీళ్లు తప్ప ఏమీ ముట్టుకోను. ఎన్నికలయ్యాక నేను, నా భార్య ప్రాణం విడిచిపెట్టేస్తాం' అంటూ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కొత్తపేట నుంచి జనసేన టిక్కెట్టు ఆశించిన బండారు శ్రీనివాస్ 'మనం పవన్‌ను నమ్మాం. కానీ, అతను మనల్ని నమ్మలేదు' అని ఆవేదనతో అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం, పి.గన్నవరం, కొత్తపేట తదితర నియోజకవర్గాలను టీడీపీకి కట్టబెట్టడంతో స్థానిక జనసేన నేతలు పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజా పరిణామాలు చూస్తే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేనకు తప్పనిసరిగా దక్కుతాయని ఆశించిన పిఠాపురం, రాజోలు, రాజమహేంద్రవరం రూరల్, నిడదవోలు వంటి స్థానాలు కూడా వస్తాయన్న నమ్మకం కలగడంలేదని ఆ నియోజకవర్గాల జనసేన నాయకులు ఆందోళన చెందుతున్నారు.

పొత్తులో పవన్ మాటకు విలువే లేదా?

జనసేన – టీడీపీ పొత్తులో చంద్రబాబు తమ అధినేత మాటకు కనీసం విలువ కూడ ఇవ్వలేదన్న చర్చ జనసేనలో సాగుతోంది. గతంలో తణుకు నియోజకవర్గంలో పవన్ పర్యటించిన సమయంలో అక్కడి స్థానిక పార్టీ ఇన్‌చార్జి వి. రామచంద్రరావును ఉద్దేశించి మాట్లాడుతూ, మొదట నుంచి పార్టీని నమ్ముకున్న వారికే ఈ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ కేటాయిస్తామని పరోక్షంగా అభ్యర్థి ఖరారుపై హామీ ఇచ్చారు. దీంతో అప్పటి నుంచి రామచంద్రరావు నియోజకవర్గంలో పనిచేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ సీటుకు టీడీపీ అభ్యర్థిని ప్రకటించడం చూస్తే పొత్తులో పవన్‌కు టీడీపీ కనీస విలువ ఇవ్వలేదని స్పష్టమవుతోందని నాయకులు అంటున్నారు.

తాను పోటీ చేసే స్థానం సహా 19 సీట్లపై సస్పెన్స్..

టీడీపీ 94 మందితో తొలి జాబితా ప్రకటించింది. చంద్రబాబు తనతో సహా తన కుటుంబంనుంచి ముగ్గురి పేర్లను ప్రకటించారు. కుప్పంనుంచి తాను, మంగళగిరి నుంచి తనయుడు లోకేశ్, హిందూపురం నుంచి బావమరిది బాలకృష్ణ పేర్లు ప్రకటించుకున్నారు. మరి జనసేన అధినేత పవన్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్న విషయంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. ఇదేమి పద్ధతని జనసేన వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కనీసం పార్టీ అధినేత పోటీ చేసే స్థానంపై ఓ స్పష్టత ఉండాలి కదా అన్నది వారి ఆవేదన. గత ఎన్నికల్లో ఓడిపోయిన భీమవరం లేదా కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పవన్ పోటీచేస్తారని అభిమానులు భావించారు. కానీ, పవన్ స్థానంపైనే స్పష్టత రాలేదు. ఇక టిక్కెట్లు ఆశిస్తూ లక్షలాది రూపాయలు తగలేసుకుంటూ.. కాళ్లరిగేలా ఊరూరా తిరుగుతున్న ఆశావహుల పరిస్థితి ప్రశ్నార్థకమనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో సర్వత్రా వ్యక్తమవుతోంది. సీట్లు కేటాయింపులో చంద్రబాబు చెప్పినట్టుగా పవన్ తలాడిస్తూ తమను నిలువునా ముంచేశారని ఆశావహుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అసలు పార్టీకి కేటాయించిన సీట్లే 24 కాగా, వాటికి కూడా అభ్యర్థులను ప్రకటించకుండా కేవలం ఐదుగురితోనే తొలి జాబితా విడుదల చేయడంతో పార్టీలో గందరగోళం నెలకొంది. ఈ 19 సీట్లలో పేర్లను ఇప్పటికీ పవన్ ప్రకటించకుండా ఎందుకు దాస్తున్నారో తెలియడంలేదని జనసేన పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

బాబుకే భ'జనసేన'!

- దాని ఫలితమే టీడీపీ పొత్తులో కేవలం అరకొర సీట్లకు పరిమితం
- ఆ పార్టీ కష్టాల్లో ఉంటే జనసేనే పైకి లాగిందన్న పవన్
- కానీ, అదే టీడీపీ ఇంతకన్నా బలంగా ఉన్నప్పుడే 2009లో టీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు కేటాయించింది
- అప్పుడు తెలంగాణలో 119 సీట్లు ఉండగా, అందులో 45 సీట్లు టీఆర్ఎస్‌కే
- ఉమ్మడి ఏపీలో కమ్యూనిస్టులకు 32 సీట్లు కూడా ఇచ్చింది
- కానీ, జనసేనకు ఇప్పుడు ఇంతేనా అంటూ అభిమానుల మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చాలా రాజకీయ పార్టీల మాదిరే జనసేన కూడా పూర్తిగా తోకపార్టీగా మారిపోవడంపట్ల ఆ పార్టీ శ్రేణులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన–టీడీపీ మధ్య కుదిరిన పొత్తులో మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకుగాను పవన్ పార్టీకి కేవలం 24 అసెంబ్లీ స్థానాలు.. మూడు లోకసభ స్థానాలను మాత్రమే చంద్రబాబు కేటాయించిన విషయం తెలిసిందే. దీంతో తెలుగుదేశం గతంలో వివిధ పార్టీలతో పొత్తు పెట్టుకున్నప్పుడు వాటికి కేటాయించిన సీట్లతో పోల్చితే ఇప్పుడు జనసేనకు కేటాయించిన సీట్లు చాలా తక్కువని జనసేన నేతలు, కార్యకర్తలు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. చంద్రబాబు అరెస్టయి రాజమండ్రి జైలులో ఉన్న సమయంలో పవన్‌కళ్యాణ్ స్వయంగా జైలుకెళ్లి ఆయన్ను కలిసొచ్చిన తర్వాత అక్కడికక్కడే పొత్తు ప్రకటన చేసిన తీరుతో తమ పార్టీకి తప్పకుండా 40–45 స్థానాలకు మధ్య సీట్ల కేటాయింపు ఉంటుందని జనసేన శ్రేణులు భావించారు. కానీ, తీరా శనివారం కేవలం 24 అసెంబ్లీ స్థానాలేనని ప్రకటించడం ఆ పార్టీ శ్రేణులతోపాటు రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి.

అప్పట్లో టీఆర్ఎస్‌కు మూడో వంతు సీట్లు..

గతంలో పొత్తుల పెట్టుకున్నప్పుడు ఆయా పార్టీలకు టీడీపీ కేటాయించిన సీట్లకు ఇప్పుడు జనసేనకు కేటాయించిన సీట్ల సంఖ్యకు పొంతనే లేదని అటు జనసేనలో చర్చ జరుగుతోంది. ఉదా.. 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మహాకూటమి పేరుతో ఉమ్మడి ఏపీలో టీఆర్ఎస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు పెట్టుకుంది. అప్పట్లో టీఆర్ఎస్ పార్టీకి తెలంగాణలో ఉన్న మొత్తం సీట్లలో మూడో వంతుకు పైగా కేటాయించింది. అంటే.. 119 సీట్లకు 45 సీట్లను కేటాయించగా.. ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా 32 సీట్లను కేటాయించింది. నిజానికి.. అప్పట్లో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటములు చవిచూసింది. అయినా, టీడీపీ ఆ పార్టీకి ఎక్కువ సీట్లను కేటాయించింది. అయితే, ఇప్పుడు ఏపీలో గత అసెంబ్లీ ఎన్నికల కంటే ప్రస్తుతం జనసేన బాగా పుంజుకుందని పవన్‌కళ్యాణ్ కొంతకాలంగా చెబుతున్నారు. అలాంటప్పుడు 175 సీట్లలో మూడో వంతు 33 శాతం సీట్లు కాకుండా కేవలం 13 శాతం సీట్లకే పవన్ అంగీకరించడాన్ని పవన్ అభిమానులు జీర్ణించుకోలేక ఆయన్ను తూర్పారబడుతున్నారు.

పవన్‌కు సీఎం పదవి అంతే సంగతులా!?

ఇక పవన్‌కళ్యాణ్‌ను సీఎంగా చేయడమే తమందరి లక్ష్యమని ఆ పార్టీ శ్రేణులందరూ భావిస్తూ ఉంటారు. కానీ, ఈ పొత్తులో జనసేనకు కేవలం 24 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలను మాత్రమే కేటాయించడంతో పవన్ ఇక ఎప్పటికీ సీఎం అయ్యే అవకాశాలను పూర్తిగా వదులుకున్నారని అటు జనసేన పార్టీలోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. వాస్తవానికి.. 2024 ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆలోచన మొదలైనప్పటి నుంచి సీఎం అభ్యర్థిత్వంపై పవన్ పార్టీ సమావేశాల్లో 'పొత్తులు, ఎన్నికల వ్యూహం నాకు వదిలేయండి' అంటూ పార్టీ శ్రేణులందర్నీ మభ్యపెట్టారు. అలాగే, గత ఎన్నికల్లో 30–40 సీట్లు గెలిచి ఉంటే సీఎం పదవిలో వాటా కావాలని అడిగే అవకాశం ఉంటుందని.. టీడీపీ అధినేత స్థానంలో తానున్నా జనసేనకు సీఎం పదవిలో వాటా ఇచ్చేవాడ్ని కాదని పవన్ అనేకసార్లు పార్టీ శ్రేణులను నిరుత్సాహపరిచే తీరులో వ్యాఖ్యానించారు. దీనికితోడు.. పొత్తులో చంద్రబాబే సీఎం అభ్యర్థి అని లోకేశ్ ఓ ఇంటర్వ్యూలో సైతం వెల్లడించారు. ఇవన్నీ చూస్తుంటే.. సీఎం పదవి వాటా చర్చకు ద్వారాలు మూసుకున్నట్లేనని స్పష్టమవుతోందని వారంటున్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
ఆదివారం ॥ 25-2-2024







వైరల్

సన్నాఫ్ విరాట్ కోహ్లీ

అనుష్క శర్మ ఈ నెల 15న పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అబ్బాయికి 'అకాయ్' అని పేరు పెట్టినట్లు తెలియజేశాడు విరాట్ కోహ్లీ. అయితే 'అకాయ్' ఫొటోను ఎక్కడా షేర్ చేయలేదు. దీంతో 'అకాయ్' రూపాన్ని రకరకాలుగా ఊహించుకుంటూ అభిమానులు ఏఐ జెనరేటెడ్ ఫొటోలను క్రియేట్ చేశారు. అకాయ్‌ను విరాట్ ఎత్తుకున్నట్లు, విరాట్–అనుష్కలు అకాయ్‌తో ఆడుకుంటున్నట్లు... ఇలా రకరకాలుగా క్రియేట్ చేశారు.

'అకాయ్ ఫొటో షేర్ చేయకుండా విరాట్ కోహ్లీ మంచి పని చేశాడు. చేసి ఉంటే ఇంత అద్భుతమైన చిత్రాలను చూసి ఉండేవాళ్లం కాదు' అంటూ నెటిజనులు ప్రశంసల జల్లు కురిపించారు.

ప్రశంసల వర్షం ఒక కోణం అయితే... సాంకేతిక ఆసక్తి మరో కోణం. 'మీరు ఉపయోగించిన ఏఐ టూల్స్ గురించి వివరంగా తెలుసుకోవాలని ఉంది' అంటూ చాలామంది కామెంట్స్ పెడుతున్నారు.

కరచరణో రసి మణిగణ భూషణ... లుక్... ఐ వాజ్ గోనా గో

శాస్త్రీయ నృత్య వేషధారణ అనగానే శాస్త్రీయ నృత్యమే కళ్ల ముందు కదలాడుతుంది. అలా కాకుండా ర్యాప్ వినిపిస్తే ఎలా ఉంటుంది అని చెప్పడానికి ఈ వీడియో ఉదాహరణ. నటి అదా శర్మ క్లాసికల్ డ్యాన్సర్ వేషంలో అమెరికన్ ర్యాపర్ ఎమెనెమ్ ఐకానిక్ ర్యాప్ 'ర్యాప్ గాడ్' ట్రాక్‌తో 'వావ్' అనిపించింది.




ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ రీల్ వైరల్‌గా మారింది. శర్మను ప్రశంసలతో ముంచెత్తిన వారిలో హీరో అయుష్మాన్ ఖురాన, నటి ఊర్వశీ రౌటేల, ఇండియన్ ర్యాపర్ రఫ్తార్‌లాంటి సెలబ్రిటీ కూడా ఉన్నారు.

యూట్యూబ్ ద్వారా 2013లో విడుదలైన 'ర్యాప్ గాడ్' సాంగ్ సూపర్ హిట్ కావడమే కాదు 'మోస్ట్ వర్డ్స్' విశేషంతో 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్'లోకి ఎంటర్ అయింది. ఎన్నో అవార్డ్‌లు గెలుచుకుంది.

'లుక్, ఐ వాజ్ గోనా గో ఈజీ ఆన్ యూ నాట్ టు హర్ట్ యువర్ ఫీలింగ్స్
బట్ ఐయామ్ వోన్లీ గోయింగ్ టు గెట్ దిస్ వన్ చాన్స్
సమ్‌థింగ్ రాంగ్. ఐ కెన్ ఫీల్ ఇట్' అని శాస్త్రీయ నృత్య వేషధారణతో కనిపిస్తున్న అదా శర్మ పాడుతుంటే 'వాహ్వా' అనకుండా ఉండలేము.

చదువుకో తమ్ముడా... చదువుకో చదువుకుంటే కలలు పండే కాలమే నీదవుతది



దిల్లీలోని కమలానగర్ మార్కెట్‌కు దగ్గరలో ఉన్న ఫుట్‌పాత్‌పై కూర్చున్న ఒక పిల్లాడు శ్రద్ధగా చదువుకుంటూనే మరో వైపు హెయిర్ బ్యాండ్‌లను అమ్ముతున్నాడు. ఇది చూసిన హ్యారీ అనే ఫొటోగ్రాఫర్ పిల్లాడితో మాటలు కలిపాడు.

ఆరో క్లాసు చదువుతున్న పవన్ తన కుటుంబానికి సహాయంగా ఉండడం కోసం ఫుట్‌పాత్‌పై హెయిర్ బ్యాండ్‌లు అమ్ముతుంటాడు. అలా అని చదువును ఎక్కడా నిర్లక్ష్యం చేయడు. ఏ రోజు పాఠాలు ఆ రోజు శ్రద్ధగా చదువుకుంటాడు. తన కుటుంబ స్థితిగతులను హ్యారీకి చెప్పాడు పవన్.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో తక్కువ టైమ్‌లోనే పది మిలియన్‌లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోయింది. పవన్ కుటుంబానికి అండగా నిలబడడానికి చాలా మంది ముందుకు రావడం మరో విశేషం.

మంటతో హెయిర్ కట్ చేస్తాడు... మండిపడకండి సార్!



'జుట్టున్నమ్మ ఏ కొప్పు వేసినా అందమే' అన్నారు గానీ 'టాలెంట్ ఉన్న వ్యక్తి కత్తెర ఉపయోగించకుండా హెయిర్ కట్ చేసినా జుట్టుకు అందమే' అని ఎవరూ అనలేదు. విషయంలోకి వస్తే... తమిళనాడులో ఒక బార్బర్ తన కస్టమర్‌కు హెయిర్ కటింగ్ చేయడానికి కత్తెర ముట్టుకోకుండా 'మంట'ను ఉపయోగించాడు. క్లయింట్ జుట్టు కత్తిరించడానికి, స్టైల్ చేయడానికి 'ఫైర్ టార్చ్'ను ఉపయోగించి రకరకాల విన్యాసాలు చేశాడు. 'ఎక్స్'లో ప్రత్యక్షమైన ఈ వీడియో క్లిప్ ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

ఇక ఈ వీడియోకు వచ్చిన స్పందన విషయానికి వస్తే... బార్బర్ నైపుణ్యం, ధైర్యాన్ని చాలామంది అభినందించగా కొద్దిమంది మాత్రం 'నీ దుంపతెగ ఇదేమీ దుస్సాహసం' అన్నట్లుగా కామెంట్లు పెట్టారు. 'నెత్తి మీద ఇంత దగ్గరగా మంటను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలు...' అంటూ చెప్పుకొచ్చారు కొందరు.

క్లయింట్‌కు ఎర్ర వస్త్రం చుట్టి మరీ ప్రయోగంలోకి దిగాడు బార్బర్. రెడ్ క్లాత్ చుట్టడం అనేది యాదృచ్ఛికంగా జరిగిందా లేక 'ఇది ప్రమాదం సుమీ' అని చెప్పకనే చెప్పాలనుకున్నాడో తెలియదు.

కశ్మీర్‌కు చెందిన పారా క్రికెటర్ అమిర్ హుసేన్ జీవితం వెలిగింది. రెండు చేతులూ లేకపోయినా మెడతో బ్యాట్ పట్టి ఆడే అమిర్ తనను ఇన్‌స్పైయిర్ చేసిన క్రికెట్ దేవుడు సచిన్‌ని జీవితంలో కలుస్తాననుకోలేదు. కలిశాడు. అంతేనా? సచిన్ నుంచి ఊహించని బహుమతి అందుకున్నాడు. ఈ వివరం ఏమిటంటే...

క్రికెట్ దేవుడే దిగి వస్తే...





సచిన్ టెండూల్కర్ తన భార్య అంజలి, కుమార్తె సారాతో కశ్మీర్ పర్యటనలో ఉన్నాడు. ఇది అతని తొలి కశ్మీర్ పర్యటన అని భోగట్టా. అక్కడి 'చార్సో' అనే ఊళ్లో ఉండే బ్యాట్ల తయారీ కేంద్రాన్ని సచిన్ సందర్శించాడు. అంతే కాదు... అక్కడి 'బిజ్‌బెహరా' ప్రాంతానికి చెందిన పారా క్రికెటర్ అమిర్ హుసేన్‌ను తన హోటల్‌కు పిలిపించుకుని ప్రత్యేకంగా కలిశాడు. అమిర్ హుసేన్ ప్రస్తుతం కశ్మీర్ పారా క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా ఉన్నాడు. పుట్టుకతో చేతులు లేని అమిర్ తన జీవితంలో పేర్కొన్న నిరాశను సచిన్‌ను చూసి ఇన్‌స్పైయిర్ అయి క్రికెటర్ కావడంతో పోగొట్టుకున్నాడు. బ్యాట్‌ను మెడ, భుజాల మధ్య పట్టి అతను క్రికెట్ ఆడతాడు. ఈ స్ఫూర్తిమంతమైన గాథను విన్న సచిన్ తన పర్యటన సందర్భంగా అమిర్ హుసేన్‌ను కలిశాడు. 'నిన్ను కలవడం సంతోషం' అని 'ఎక్స్'లో తానే పోస్ట్ పెట్టాడు. సచిన్‌ని చూడగానే ఇలాంటిది తన జీవితంలో జరిగిందా అన్నట్టుగా భావోద్వేగంతో కదిలిపోయాడు అమిర్. 'ఇలాగే నువ్వు మమ్మల్ని ఇన్‌స్పైయిర్ చేయి' అని అమిర్‌తో సచిన్ చెప్పాడు. అంతేనా? తను సంతకం చేసిన బ్యాట్ ఇచ్చి అమిర్‌ని తబ్బిబ్బు చేశాడు.

సర్వర్ డ్రోన్ సుందరం



కాఫీ హోటల్ ఏదైనా సర్వర్ గారు సుందరమే అయి ఉంటాడని గతంలో అనుకునేవారు. ఎందుకంటే టిఫిన్ హోటల్స్ తమిళులే నడిపేవారు కాబట్టి. ఇప్పుడు సర్వర్ గారి అడ్రస్ గల్లంతయ్యేలా ఉంది. మనుషులకు జీతాలు ఇవ్వడం కంటే ఒక డ్రోన్‌తో మేనేజ్ చేయొచ్చని కోల్‌కతా రెస్టారెంట్ డిసైడ్ అయ్యింది.

వాన కోసం ఆకాశం వైపు చూడొచ్చుగాని కాఫీ కోసం కూడా చూడొచ్చా? చూడొచ్చు. ఆకాశం నుంచి కాఫీ ఎగిరొచ్చి చేతికి అందుతుంది. ఇది కోల్‌కతా సాల్ట్‌లేక్ సిటీ ఏరియాలోని 'కోల్‌కతా 64' అనే రెస్టారెంట్ వారు తమ కస్టమర్లను ఆకర్షించడానికి వేసిన సాంకేతిక ఎత్తుగడ. ఆకర్షణ. రెస్టారెంట్ లోపల కూచున్న వారికి సర్వర్లు కాఫీ అందించినా బయట తమకు తోచిన చోటులో కూచుని కాఫీని ఆస్వాదించాలంటే డ్రోన్ సుందరం గారే కాఫీని అందిస్తారు. ఈ వీడియో ఇన్‌స్టాలో ప్రత్యక్షం కాగానే 'ఇదేదో బాగానే ఉంది' అని చాలామంది మెచ్చుకుంటున్నారు. అయితే ఈ యంత్రం మనిషిని మాయం చేస్తున్నట్టే. మన దేశంలో మధ్యతరగతి జీవులకు కాఫీ హోటళ్లు, అందులో పని చేసే సర్వర్లు జీవితంలో భాగం. అందుకే సినిమాల్లో, సాహిత్యంలో సర్వర్లు కనపడతారు. కె.బాలచందర్ తీసిన 'సర్వర్ సుందరం'లో నగేశ్ నటించి పేరు గడించాడు. 'శుభలేఖ'లో చిరంజీవి కూడా 'వెయిటర్' అనబడు 'సర్వరే'. ఇటీవలి కాలంలో ఆనంద్ దేవరకొండ నటించిన 'మిడిల్‌క్లాస్ మెలొడీస్' టిఫిన్ సెంటర్ నేపథ్యంలో ఓనర్ కమ్ సర్వర్‌గా హీరో చేసే స్ట్రగుల్‌ను చూపుతుంది. ఏమైనా ఈ డిజిటల్ ఏజ్‌లో 'మాయమవుతున్నాడమ్మ మనిషి' అనుకోక తప్పదు.

హెల్త్

మంచి జనాదరణ పొందిన దంగల్ సినిమాలో నటించిన సుహానీ భట్నాగర్ అనే నటి ఇటీవల తన 19వ ఏట చాలా చిన్నవయసులోనే డర్మటోమయోసైటిస్ అనే వ్యాధితో చనిపోవడంతో... ఈ జబ్బు పేరు పలువురి నోట వినిపించింది. గతంలో అరుదైనదిగానే పేరున్న ఈ ఆరోగ్య సమస్య.. ఇటీవల కాస్త తరచుగా కనిపిస్తుండటం ఆందోళన గొలిపే అంశం. చాలా తీవ్రమైనదిగా పరిగణించే ఈ సమస్యకు పూర్తిగా నయం చేసే చికిత్స లేకపోయినా దీని లక్షణాలను అదుపులో ఉంచడానికి అవసరమైన చికిత్స తీసుకోకపోతే... ఒక్కోసారి ప్రమాదకరంగా పరిణమించే అవకాశమున్న ఈ సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.



ఇటీవల డర్మటో మయోసైటిస్‌తో మృతి చెందిన దంగల్ ఫేమ్ సుహానీ భట్నాగర్

డర్మటో-మయోసైటిస్ అంటే?

డర్మటో మయోసైటిస్ అనే ఈ వ్యాధిలో ప్రధానంగా కండరాలు బలహీనమై, చర్మమూ ప్రభావితమవుతుంది. ఆహారాన్ని మింగలేపోవడం, శ్వాస తీసుకోలేకపోవడం, ఊపిరితిత్తులు పీచులా మారిపోయే 'ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్'కి దారితీయడం వంటి అనేక సమస్యలు ఇందులో కనిపిస్తాయి. కండరాలూ, చర్మంతో పాటు పలు కీలకమైన అవయవాలూ, వ్యవస్థలను దెబ్బతీస్తున్నందున దీన్ని కొన్ని వ్యాధుల సమాహారంలా పరిగణించే 'పాలీమయోసైటిస్' వ్యాధుల్లోనిదిగా పేర్కొంటారు. ఇందులోని మిగతా మయోసైటిస్ వ్యాధులు కాస్త మెల్లగా తమ ప్రభావాన్నీ, లక్షణాలను చూపించినప్పటికీ... 'డర్మటో-మయోసైటిస్' లక్షణాలూ చాలా వేగంగా అభివృద్ధి చెందుతూ వ్యక్తమవుతాయి. తగిన చికిత్స అందకపోతే అవి మరింత తీవ్రతరమవుతాయి.

లక్షణాలు...

ఈ వ్యాధిలో కండరాలు చాలా బలహీనంగా అనిపించడంతో పాటు ఒంటి మీద ర్యాష్ రావడం ఒక ప్రధాన లక్షణం. కొందరిలో నీరసమూ... ర్యాష్ ఒకేసారి కనిపిస్తాయి. మరికొందరిలో ఇవి వేర్వేరు సమయాలలో కనిపించవచ్చు. అంటే వారాలూ, నెలలు ఒక్కోసారి ఏళ్ల తర్వాత కూడా వ్యక్తం కావచ్చు. కండరాల బలహీనత ఎంత ఎక్కువగా ఉంటుందంటే... • నిటారుగా కూర్చోలేకపోవడం. • కూర్చున్న వారు కనీసం కుర్చీ / సోఫా నుంచి లేవలేకపోవడం. • మెట్లు ఎక్కలేకపోవడం • పక్కకు ఒరిగిన వాళ్లు మళ్లీ పైకిలేవలేకపోవడం... • ఇదే బలహీనత, నిస్సత్తువ గుండె, ఊపిరితిత్తులకూ ఆవరించడంతో శ్వాసతీసుకోవడం కష్టం కావడం, దగ్గు వంటి లక్షణాలూ కనిపిస్తాయి.
• బలహీనతతో పాటు జ్వరం, బరువు తగ్గడం, కండరాల, కీళ్ల నొప్పులు, ఒంటి మీద ర్యాష్.

నిర్ధారణ పరీక్షలు...

• కొన్ని రకాల రక్తపరీక్షలతో డర్మటో-మయోసైటిస్‌ను నిర్ధారణ చేస్తారు. కండరాలు దెబ్బతిన్నాయని సూచించే కొన్ని రకాల మజిల్ ఎంజైమ్‌ల రక్తపరీక్షలతో పాటు, ఆటో యాంటీబాడీస్ (వ్యాధి నిరోధక వ్యవస్థను దెబ్బతీసే సొంత ఇమ్యూన్ కణాల)ను కనుగొనే రక్తపరీక్షలతో దీన్ని నిర్ధారణ చేస్తారు.
• ప్రభావితమైన చర్మం నుంచి ముక్క సేకరించి చేసే 'స్కిన్ బయాప్సీ' కూడా చేస్తారు. దీనివల్ల దేహంలోని ఇన్‌ఫ్లమేషన్‌తో కండరాలు దెబ్బతిన్నాయా లేదా అని పరిశీలించే అవకాశం దొరుకుతుంది. • కొన్ని సందర్భాల్లో ఎమ్మారై, ఛాతీ ఎక్స్-రే పరీక్షలూ నిర్ధారణకు ఉపకరిస్తాయి. • అవసరాన్ని బట్టి ఎలక్ట్రో మయోగ్రఫీ (ఈఎమ్‌జీ) అనే పరీక్షతో కండరాలు-నరాల స్పందన ఎలా ఉందో కూడా తెలుసుకోవాల్సి రావచ్చు.

కారణాలు...

ఈ వ్యాధి ఎందుకు వస్తుందనే అంశంపై నిర్దిష్టమైన కారణాలు ఇంకా స్పష్టంగా తెలియవు. జన్యుపరమైన సమస్యలోనూ, వాతావరణం కాలుష్యం, సూర్యుడి తీక్షణమైన కాంతిలో ఎక్కువసేపు గడపడం వల్ల వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు. పర్యావరణ సమస్యలతో పాటు పొగతాగడం, కొన్ని రకాల ఔషధ దుష్ప్రభావాలూ ఇందుకు కారణం కావచ్చని అంచనా. కొన్ని రకాల వైరల్ సమస్యలతో బాధపడ్డవారిలోనూ డర్మటో-మయోసైటిస్ కనిపించడం చాలా సందర్భాల్లో కనిపించింది.

మేనేజ్‌మెంట్ - చికిత్స...

సొంత వ్యాధినిరోధక వ్యవస్థ దేహానికి ప్రతికూలంగా మారే ఆటో ఇమ్యూన్ డిసీజ్ కావడం వల్ల ఈ వ్యాధిని పూర్తిగా నయం చేసే అవకాశం లేదు. అయితే లక్షణాలను అదుపు చేస్తూ, వ్యాధి మరింత పెరగకుండా నియంత్రించే మేనేజ్‌మెంట్ పద్ధతులతో డర్మటో-మయోసైటిస్‌పై అదుపు సాధించాలి. ఇందుకు కార్టికో స్టెరాయిడ్స్‌తో పాటు ఫిజియోథెరపీ లాంటి ఫిజికల్ పద్ధతులు ఎంతగానో ఉపకరిస్తాయి.

• **కార్టికో స్టెరాయిడ్స్:** తీవ్రత ఆధారంగా వీటిని, వీటి మోతాదులను కేవలం డాక్టర్లు మాత్రమే సూచించాలి. వారి పర్యవేక్షణలోనే కార్టికో-స్టెరాయిడ్స్ వాడాల్సి ఉంటుంది. అలాగే టాపికల్ స్టెరాయిడ్స్ అని చెప్పే... పైపూత మందులూ వాడాల్సి రావచ్చు.
• **ఫిజియోథెరపీ:** బలహీనపడ్డ కండరాల్లో బలమూ, సత్తువ నింపడానికి, దెబ్బతిన్న కండరాల్లో మునపటి శక్తి సాధించడానికి ఫిజియోథెరపీ బాగా ఉపయోగపడుతుంది. డర్మటో-మయోసైటిస్‌లో ఫిజియోథెరపీ చాలా కీలకం.
• **ఇమ్యూనో సప్రెసెంట్ ఔషధాలు:** వ్యాధి నిరోధక వ్యవస్థలో తీవ్రంగా మారి దెబ్బతీస్తున్న కణాల తీవ్రతలను అదుపు చేసే మందులైన ఇమ్యూనో సప్రెసెంట్స్‌ను చాలా సునిశితమైన రీతిలో వాడాలి.
• **ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ (ఐవీఐజీ):** ఇమ్యూనో సప్రెసెంట్లతో పాటు... మన రక్తంలోని ప్లాస్మాలోనే ఉండే ఈ స్వాభావికమైన పదార్థాలను బయటనుంచి బాధితులకు ఇవ్వడం అనేది మరో ఆధునిక ప్రత్యామ్నాయ చికిత్స ప్రక్రియల్లో ఒకటి.
• **స్పీచ్ థెరపీ:** అన్ని కండరాల్లాగానే గొంతు కండరాలు బలహీనపడి మాట్లాడటం కష్టమైన వారికి స్పీచ్ థెరపీ ద్వారా మాట్లాడటానికి శిక్షణ ఇవ్వాల్సి రావచ్చు. అలాగే మింగడం కష్టమైన వారికీ ఆ దిశగా సహాయం అవసరం పడవచ్చు. • వ్యాధి మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఎండల్లో ఎక్కువగా తిరగకపోవడమూ, బాగా ఎండలో తిరగడం తప్పనిసరి అయితే నిపుణుల సలహా మేరకు ఎస్‌పీఎఫ్ 50కి పైన ఉండేవీ, తగిన సన్-స్క్రీన్ లోషన్స్ వాడటం వంటివీ తప్పనిసరి.

ఈ మేనేజ్‌మెంట్ పద్ధతులూ, డాక్టర్ల నిశిత పర్యవేక్షణలో స్టెరాయిడ్స్‌తో పాటు ఇతర మందులూ తీసుకుంటూ ఉన్నట్లయితే తొలుత లక్షణాలు తగ్గి, పరిస్థితులు చాలావరకు నార్మల్ అవుతాయి. ఆ పైన వ్యాధిని అదుపులో ఉంచుకుంటూ దాదాపుగా సాధారణ జీవితాన్ని జీవించే అవకాశాలు కొంతవరకు బాగానే ఉంటాయి. ప్రత్యేకంగా నివారణ అంటూ లేకపోయినా... ఆరోగ్యకరమైన పరిసరాల్లో ఉండటం, పొగతాగడం పూర్తిగా మానేయడం చాలా మంచిది. పైగా ఈ వ్యాధి గొంతును, ఊపిరితిత్తులు, గుండెను ప్రభావితం చేసేదైనందున పొగతాగడం మానేయడం మరింత ఎక్కువ అవసరం.



డాక్టర్ మహమ్మద్ ఇర్ఫాన్,
సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్

• హైపర్‌ట్రైగ్లిజరైడెమియా

ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించుకోవాల్సిందే!... ఎందుకంటే?



రక్తంలో కొలెస్ట్రాల్ వంటి మరో రకం కొవ్వులే ఈ ట్రైగ్లిజరైడ్స్. రక్తంలో ఈ ట్రైగ్లిజరైడ్స్ మోతాదులు ఉండాల్సిన దానికంటే పెరిగే కండిషన్ 'హైపర్ ట్రైగ్లిజరైడెమియా' అంటారు. ఇది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నందున 'హైపర్ ట్రైగ్లిజరైడెమియా' ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, అవసరమైతే మందులు వాడుతూ, వాటిని నియంత్రణలో ఉంచుకోవడం అవసరం.

ట్రైగ్లిజరైడ్స్ అనేవి ఆహారంలో కొవ్వులు ఎక్కువగా తీసుకోవడంతో పాటు... కాలేయంలోంచి కూడా ఉత్పత్తి అవుతాయి. వీటి మోతాదులు పెరగడం ప్రధానంగా గుండెజబ్బుల ముప్పు తెచ్చిపెట్టవచ్చు. అందుకే రక్తపరీక్షల్లో ట్రైగ్లిజరైడ్స్ కొవ్వులు ఎక్కువగా ఉన్నట్లు తేలితే వాటిని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.

ముప్పును పెంచే అంశాలివి...

డయాబెటిస్, ప్యాంక్రియాటైటిస్, కిడ్నీ జబ్బులు, హైపోథైరాయిడిజమ్ వంటి సమస్యలు ఉన్నవారిలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉండటం మరింత ముప్పు తెచ్చిపెట్టే అంశంగా మారుతుంది.

లక్షణాలు...

• **జీర్ణవ్యవస్థకు సంబంధించి:** వికారం, కొన్నిసార్లు వాంతులు, కొన్ని సందర్భాల్లో కడుపు మధ్యభాగంలో నొప్పి.
• **శ్వాస వ్యవస్థలో:** అతి కష్టమ్మీద శ్వాస తీసుకోవడం.
• **చర్మం మీద:** పసుపుపచ్చ రంగులో ఉబ్బెత్తుగా కొవ్వు పేరుకున్నట్లుగా కనిపించే ప్యాచ్‌లు (గ్జాంథోమాస్). ఈ ప్యాచ్‌లు ఛాతీ, వీపు, పిరుదుల మీద కనిపించవచ్చు.
• **కళ్ల దగ్గర:** కనురెప్పల చివర్లలో, కంటికింద ఉబ్బెత్తుగా కనిపించే సంచుల్లాంటివి.
• **నరాలకు సంబంధించి:** గుండెకు ముప్పు తెచ్చే ఈ ట్రైగ్లిజరైడ్స్ కొన్నిసార్లు మతిమరపు, డిప్రెషన్‌లకూ దారితీయవచ్చు.

నిర్ధారణ.. సాధారణ రక్తపరీక్షలో కొవ్వుల మోతాదు తెలుసుకునే లిపిడ్ ఎనాలసిస్. అవసరాన్ని బట్టి ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, టీఎస్‌హెచ్ అనే థైరాయిడ్ పరీక్ష, మూత్రపరీక్ష, కాలేయ పరీక్షలూ నిర్వహిస్తారు.

ట్రైగ్లిజరైడ్స్ తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

రక్తంలో ట్రైగ్లిజరైడ్స్ ఎక్కువగా ఉన్నప్పుడు కొన్ని ఆహార నియమాలు పాటించడం ద్వారా వాటిని తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు జీవనశైలిలో మార్పులు తప్పనిసరి. • బరువు తగ్గాలి. ఇందుకు ఆహారంలో మార్పులు చేసుకోవాలి. • పొట్టుతీయని ధాన్యాలు (అంటే... దంపుడు బియ్యం, పొట్టుతీయని రాగులు, గోధుమలు), పొట్టుతీయని పప్పుధాన్యాలు, మొలకెత్తిన గింజలు తీసుకోవాలి. • కొవ్వులు (శాచ్యురేటెడ్ ఫ్యాట్, కొలెస్ట్రాల్) తక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. తాజా పండ్లు, డ్రైఫ్రూట్స్‌లో పీచు ఎక్కువగా ఉండటం వల్ల అవి ట్రైగ్లిజరైడ్స్‌ను తగ్గించడంలో బాగా ఉపయోగపడతాయి. • మాంసాహారం తీసుకోవాలనుకునేవారు వారంలో మూడు సార్లు చేపలు తీసుకోవచ్చు. అది కూడా కేవలం ఉడికించి వండినవీ, గ్రిల్డ్ ఫిష్ మాత్రమే తీసుకోవాలి. డీప్ ఫ్రై చేసినవి తీసుకోవడం సరి కాదు. • కొవ్వుల మోతాదు ఎక్కువగా ఉండే మాంసాహారం (రొయ్యలు, చికెన్ స్కిన్), వేపుళ్లు, నెయ్యి, నేతితో చేసిన స్వీట్స్, బేకరీ ఐటమ్స్‌కు దూరంగా ఉండాలి. • స్మోకింగ్, ఆల్కహాల్ పూర్తిగా మానేయాలి. • రోజూ కనీసం 30 నిమిషాలు శారీరక శ్రమ/వాకింగ్ వంటి వ్యాయామాలు చేయాలి.

మందులు... ట్రైగ్లిజరైడెమియా తీవ్రత ఎక్కువగా ఉన్నవారు డాక్టర్లు సూచించిన మీదట కొన్ని మందులు వాడాల్సి రావచ్చు. దీని తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నవారిలో అరుదుగా కొందరిలో 'ప్లాస్మాఫెరిసిస్' అనే ప్రక్రియ అవసరం పడవచ్చు.



డాక్టర్ ప్రవీణ్ కుమార్ కులకర్ణి,
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్

వెన్ను / నడుము నొప్పా...?
బైక్ ఎర్గానమిక్స్ లోపాల వల్ల కావచ్చు!

వెన్ను నొప్పి, నడుము నొప్పి కనిపించడానికి అనేక కారణాలున్నప్పటికీ... కొన్నిసార్లు బైక్ మీద కూర్చునే విధానంలో తేడాల వల్ల కూడా నొప్పి రావచ్చు. అప్పుడు డ్రైవింగ్‌పరంగా తప్పిదాలు ఏమైనా ఉన్నాయేమోనని ఒకసారి పరీక్షించుకుని, సరిదిద్దుకోవాల్సిన అంశాలివి...
• బైక్‌పై కూర్చున్నప్పుడు వీపు నిటారుగా ఉండి, వెన్ను ఒంగిపోకుండా జాగ్రత్త పడాలి. అయితే కొన్ని స్పోర్ట్స్ బైక్‌లలో సీట్లు మరీ ఏటవాలుగా ఉండి, కూర్చొనే భంగిమ కూడా వాలుగా ఉండి, బాగా ముందుకు వాలినట్లుగా కూర్చోవాల్సి వస్తుంది. ఇలా రూపొందించిన ఫ్యాషన్ బైక్స్ వల్ల వెన్ను నిటారుగా లేక వెన్ను / నడుము నొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువ. • బైక్‌లపై ప్రయాణం చేసేవారు వీపున బ్యాక్‌ప్యాక్స్ లేదా ల్యాప్‌టాప్ బ్యాగ్స్ పెట్టుకొని వెళ్తుండటం మామూలే. ఈ బ్యాగు బరువు నడుంపైనా భారం పడటం వల్ల కూడా నొప్పి రావచ్చు. అందువల్ల బ్యాగు భారం వీపు మీద పడకుండా, ఆ బరువు సీటు మీద పడేలా, బ్యాగ్ సీట్ మీద ఆనేలా అమర్చుకోవాలి. • తాము కూడా నిటారుగా, సౌకర్యవంతంగా కూర్చుంటున్నారా లేదా అన్నది చూసుకోవాలి. సిట్టింగ్ పోశ్చర్‌లో లోపాలుంటే సరిదిద్దుకోవాలి.

ఈ జాగ్రత్తల తర్వాత కూడా వెన్ను, నడుము నొప్పి వస్తుంటే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించాలి.



ఆస్ట్రేలియా చేతిలో భారత్ 'షూటౌట్'

రూర్కెలాలో జరుగుతున్న ప్రొ హాకీ లీగ్‌లో భారత్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. శనివారం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ షూటౌట్‌లో 0–3 గోల్స్ తేడాతో ఓటమిపాలైంది. రెగ్యులర్ టైమ్‌లో ఇరు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున 20వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ సింగ్, 29వ నిమిషంలో అమిత్ రోహిదాస్ పెనాల్టీ కార్నర్ల ద్వారా గోల్స్ సాధించారు. ఆస్ట్రేలియా ఆటగాళ్లలో 23వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్ ద్వారా బ్లేక్ గోవర్స్ గోల్ చేయగా...53వ నిమిషంలో టామ్ క్రెయిగ్ మరో గోల్‌తో స్కోరును సమం చేశాడు. దాంతో మ్యాచ్ 'షూటౌట్'కు వెళ్లింది. ఇందులో ఆస్ట్రేలియా తరఫున షాట్ ఆడిన ముగ్గురూ టామ్ విక్హామ్, ఆగిల్‌వీ ఫ్లయిన్, టిమ్ బ్రాండ్ సఫలం కాగా...భారత్ తరఫున ప్రయత్నించిన ముగ్గురు లలిత్ కుమార్, సుఖ్‌జీత్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్ గోల్ చేయడంలో విఫలమయ్యారు. ఆస్ట్రేలియాకు లభించిన నాలుగు పెనాల్టీ కార్నర్లతో పాటు ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను కూడా సమర్థంగా నిలువరించి పట్టుదల కనబర్చిన భారత్‌కు ఈ తుది ఫలితం తీవ్ర నిరాశ కలిగించింది.

భారత్ తడబాటు

- తొలి ఇన్నింగ్స్‌లో 219/7
- యశస్వి అర్ధసెంచరీ
- బషీర్‌కు 4 వికెట్లు
- మరో 134 పరుగులు వెనుకంజ





యశస్వి జైస్వాల్‌ను బౌల్డ్ చేసిన షోయబ్ బషీర్‌కు స్టోక్స్, ఫోక్స్ అభినందన

భారత స్పిన్నర్ జడేజా మిగిలిన మూడు వికెట్లను పడగొట్టిన మన స్పిన్ పిచ్‌పై ప్రత్యర్థి ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ ఆ తర్వాత అంతకు మించి పట్టు సాధించాడు. ఇది భారత తొలి ఇన్నింగ్స్‌ను దెబ్బకొట్టింది. అలాగే 'అంపైర్ కాల్' భారత వికెట్లను ప్రభావితం చేసింది. క్రీజులో ప్రధాన బ్యాటర్ అంటూ లేకుండా చేయడంతో పరుగుల పరంగా టీమిండియా వెనుకబడింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ పైచేయి సాధించడం ఖాయమైంది.

రాంచీ: మ్యాచ్‌కు ముందు రోజు వికెట్‌ను పరిశీలించిన ఇరు జట్ల వర్గాలు 'పిచ్‌పై అంచనా కష్టం. ఏ రోజు టర్న్ అవుతుందో కచ్చితంగా చెప్పలేం' అని అభిప్రాయపడ్డాయి. అనూహ్యంగా రెండో రోజే పిచ్ పూర్తిగా స్పిన్‌కు స్వర్గధామమైంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో మిగిలిపోయిన మూడు వికెట్లను జడేజా పడేశాడు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ తమ యువ ఆఫ్‌స్పిన్నర్ బషీర్‌తో వరుసగా ఓవర్లు వేయించాడు. అతను 31 ఓవర్లు నిర్విరామంగా బౌలింగ్ చేసి విలువైన వికెట్లను పడేయడంతో ఆతిథ్య భారత్ కష్టాల పాలైంది. శనివారం ఆట నిలిచే సమయానికి టీమిండియా 73 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (117 బంతుల్లో 73; 8 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే రాణించాడు. బషీర్ 4 వికెట్లు పడగొడితే మరో స్పిన్నర్ హార్ట్‌లీ కూడా 2 వికెట్లు తీసి భారత్ కష్టాల్ని పెంచాడు.

మరో 51 పరుగులు...

రెండో రోజు 302/7 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లండ్ 104.5 ఓవర్లలో 353 పరుగుల వద్ద ఆలౌటైంది. మరో 14.5 ఓవర్లు ఆడి తొలి రోజు స్కోరుకు 51 పరుగులు జోడించింది. జో రూట్ (274 బంతుల్లో 122 నాటౌట్; 10 ఫోర్లు) అజేయగా నిలువగా... చకాచకా బౌండరీలు బాదిన ఒలీ రాబిన్సన్ (96 బంతుల్లో 58; 9 ఫోర్లు, 1 సిక్స్) టెస్టుల్లో తొలి సారి అర్ధ శతకాన్ని సాధించాడు. వీరిద్దరు 8వ వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. ఎట్టకేలకు రాబిన్సన్‌ను అవుట్ చేయడం ద్వారా జడేజా ఈ జోడీని విడగొట్టాడు. 347 పరుగుల వద్ద ఈ వికెట్ పడగా, మరో ఆరు పరుగుల వ్యవధిలో బషీర్ (0), అండర్సన్ (0) వికెట్లను కూడా జడేజానే తీయడంతో లంచ్‌కు ముందే ఇంగ్లండ్ ఆట ముగిసింది.

రాణించిన యశస్వి

ఈ సిరీస్‌లో అసాధారణ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఈ టెస్టులోనూ తొలి ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచాడు. లేదంటే పరిస్థితి మరింత భిన్నంగా ఉండేది! కెప్టెన్ రోహిత్ (2) మూడో ఓవర్లోనే వెనుదిరిగాడు. తర్వాత వచ్చిన శుబ్‌మన్ గిల్‌తో జైస్వాల్ జోడి కుదరడంతో తొలి సెషన్‌లో మరో వికెట్ పడలేదు. ఇక రెండో సెషన్‌ను సాఫీగా నడిపిస్తున్న తరుణంలో బషీర్ స్పిన్ భారత్‌ను పదేపదే కష్టాల్లోకి నెట్టేసింది. జట్టు స్కోరు 86 పరుగుల వద్ద గిల్‌ను బషీర్ ఎల్బీగా అవుట్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రజత్ పటిదార్ (17) క్రీజులోకి రాగా... జైస్వాల్ 89 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. కానీ మరోవైపు పటిదార్ బషీర్‌కే వికెట్ అప్పగించాడు. టీ విరామానికి ముందు అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా (12; 2 సిక్సర్లు)ను అవుట్ చేయడం ద్వారా బషీర్ భారత్‌ను చావుదెబ్బ తీశాడు. 131/4 స్కోరు వద్ద రెండో సెషన్ ముగిసింది.

ధ్రువ్ నిలకడ

ఆఖరి సెషన్‌లో కూడా స్పిన్ హవానే కొనసాగింది. దీంతో భారత్ 47 పరుగుల వ్యవధిలో మరో మూడు వికెట్లను కోల్పోయింది. ముందుగా జట్టు స్కోరు 150 పరుగులు దాటిన కాసేపటికి యశస్విని బషీర్ బౌల్డ్ చేశాడు. ఇది జట్టును కోలుకోనివ్వలేదు. దాంతో స్వల్ప వ్యవధిలో సర్ఫరాజ్ (14), అశ్విన్ (1)లను హార్ట్‌లీ పెవిలియన్ చేర్చాడు. 177 స్కోరు వద్ద 7 వికెట్లను కోల్పోయిన దశలో ధ్రువ్ జురెల్ (58 బంతుల్లో 30 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్), కుల్దీప్ (72 బంతుల్లో 17 బ్యాటింగ్; 1 ఫోర్) చూపించిన తెగువ భారత్‌ను ఆలౌట్ కాకుండా ఆపగలిగింది. ఇద్దరు 17.4 ఓవర్ల పాటు ప్రత్యర్థి స్పిన్, పేస్‌కు ఎదురునిలిచి అబేధ్యమైన 8వ వికెట్‌కు 42 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు:

ఇంగ్లండ్ తొలిఇన్నింగ్స్: 353

భారత్ తొలిఇన్నింగ్స్: యశస్వి (బి) బషీర్ 73; రోహిత్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 2; శుబ్‌మన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బషీర్ 38; పటిదార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బషీర్ 17; జడేజా (సి) పోప్ (బి) బషీర్ 12; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) హార్ట్‌లీ 14; జురెల్ బ్యాటింగ్ 30; అశ్విన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హార్ట్‌లీ 1; కుల్దీప్ బ్యాటింగ్ 17; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (73 ఓవర్లలో 7 వికెట్లకు) 219. వికెట్ల పతనం:** 1–4, 2–86, 3–112, 4–130, 5–161, 6–171, 7–177. **బౌలింగ్:** అండర్సన్ 12–4–36–1, రాబిన్సన్ 9–0–39–0, బషీర్ 32–4–84–4, హార్ట్‌లీ 19–5–47–2, రూట్ 1–0–1–0.

ఆంధ్ర 172 ఆలౌట్

రంజీ ట్రోఫీ క్వార్టర్స్

ఇండోర్: మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని కోల్పోయింది. మ్యాచ్ రెండో రోజు శనివారం ఆంధ్ర తమ మొదటి ఇన్నింగ్స్‌లో 68.3 ఓవర్లలో 172 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా మధ్యప్రదేశ్‌కు 62 పరుగుల ఆధిక్యం దక్కింది. ఆంధ్ర బ్యాటర్లలో కరణ్ షిండే (38), కెప్టెన్ రికీ భుయ్ (32) మాత్రమే కొద్దిగా పోరాడగలిగారు. ఎంపీ బౌలర్లలో అనుభవ్ అగర్వాల్, కుమార్ కార్తికేయ చెరో 3 వికెట్లు తీయగా... అవేశ్ ఖాన్, కుల్వంత్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం మధ్యప్రదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసి తమ ఓవరాల్ ఆధిక్యాన్ని 83 పరుగులకు పెంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో మధ్యప్రదేశ్ 234 పరుగులకు ఆలౌటైంది.

893*

రంజీ ట్రోఫీలో ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ ముగిసే సరికి ఆంధ్ర బ్యాటర్ రికీ భుయ్ చేసిన పరుగులు. ప్రస్తుతం ఈ సీజన్‌లో అత్యధిక పరుగుల జాబితాలో అతను అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ఒకే సీజన్‌లో ఆంధ్ర తరఫున అత్యధిక పరుగులు (868) చేసిన అమోల్ మజుందార్ (2012–13) రికార్డును భుయ్ సవరించాడు.



భుయ్

బెంగళూరును గెలిపించిన శోభన

2 పరుగులతో యూపీ పరాజయం

బెంగళూరు: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేసిన తొలి భారత బౌలర్‌గా శోభన ఆశ (5/22) నిలిచింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో విజయం దిశగా వెళుతున్న యూపీ వారియర్స్‌ను శోభన తన అద్భుత బౌలింగ్‌తో బ్రేక్ వేసింది. శనివారం చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 2 పరుగుల తేడాతో యూపీని ఓడించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. రిచా ఘోష్ (37 బంతుల్లో 62; 12 ఫోర్లు), సబ్బినేని మేఘన (44 బంతుల్లో 53; 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు చేశారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 50 బంతుల్లోనే 71 పరుగులు జోడించారు. కెప్టెన్ స్మృతి మంధాన (13), సోఫీ డివైన్ (1), ఎలైస్ పెరీ (8) విఫలమయ్యారు. యూపీ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో చివరి ఐదు ఓవర్లలో బెంగళూరు 42 పరుగులే చేయగలిగింది. అనంతరం యూపీ 20 ఓవర్లలో 7 వికెట్లకు 155 పరుగులు చేసింది. గ్రేస్ హారిస్ (23 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్వేత సెహ్రావత్ (25 బంతుల్లో 31; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఛేదనలో 16 ఓవర్లు ముగిసే సరికి యూపీ స్కోరు 126/3. గెలుపు కోసం 24 బంతుల్లో 32 పరుగులు చేయాల్సిన స్థితి. అయితే శోభన జోరుకు 17వ ఓవర్లో 3 వికెట్లు కోల్పోయి జట్టు తడబాటుకు గురైంది. తర్వాతి 2 ఓవర్లలో 19 పరుగులు రాబట్టి గెలుపుపై యూపీ ఆశలు పెంచుకుంది. చివరి ఓవర్లో 11 పరుగులు అవసరం కాగా, తొలి 5 బంతుల్లో 6 పరుగులు వచ్చాయి. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్ తరహాలోనే ఆఖరి బంతికి 5 పరుగులు అవసరం కాగా... దీప్తి శర్మ 2 పరుగులే తీయగలిగింది.



ప్రొ కబడ్డీ 'ప్లే ఆఫ్స్'కు రంగం సిద్ధం

రేపటినుంచి హైదరాబాద్‌లో మ్యాచ్‌లు

సాక్షి, హైదరాబాద్: పదో సీజన్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) కీలక దశ మ్యాచ్‌లకు హైదరాబాద్ వేదికవుతోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమ, బుధ, శుక్రవారాల్లో 'ప్లే ఆఫ్స్' మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ సందర్భంగా శనివారం ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. లీగ్ చైర్మన్ అనుపమ్ గోస్వామి టోర్నీ విశేషాలను వెల్లడించారు. గత తొమ్మిదో సీజన్లతో పోలిస్తే ఈ సారి టోర్నీ ఇంకా ఎక్కువ సంఖ్యలో అభిమానులకు చేరువైందని... 12 ఫ్రాంచైజీలకు చెందిన నగరాలు అన్నింటిలో మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించగలిగామని ఆయన అన్నారు. గ్రూప్ దశలో టాప్–2లో నిలిచిన పుణేరీ పల్టన్, జైపూర్ పింక్ పాంథర్స్ ఇప్పటికే సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. సెమీస్‌లో తలపడే ఇతర రెండు జట్లను ఖరారు చేసేందుకు రెండు ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో ఢిల్లీని పట్నా, గుజరాత్‌ను హర్యానా ఢీకొంటాయి. ఈ నెల 26న ఎలిమినేటర్ మ్యాచ్‌లు, 28న సెమీఫైనల్స్, మార్చి 1న ఫైనల్ నిర్వహిస్తారు. హైదరాబాద్ నగర అభిమానులు ఈ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూసేందుకు రూ. 250 – రూ. 3000 మధ్య 'బుక్‌మైషో'లో టికెట్లు అందుబాటులో ఉన్నాయి.



సినిమా

గ్యాంగ్‌స్టార్స్

బాక్సాఫీస్‌ను లూటీ చేయడానికి గ్యాంగ్‌స్టర్‌గా మారారు కొందరు స్టార్స్. వెండితెరపై ఈ హీరోలు గ్యాంగ్‌వార్ చేస్తున్నారు. గ్యాంగ్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్స్‌గా మారిన ఆ కోలీవుడ్ గ్యాంగ్‌స్టార్స్ గురించి తెలుసుకుందాం.

గ్యాంగ్‌స్టర్ రంగరాయ

గ్యాంగ్‌స్టర్ రంగరాయ శక్తివేల్ నాయకర్‌గా మారారు కమల్‌హాసన్. 'థగ్ లైఫ్' సినిమాలో కమల్‌హాసన్ చేస్తున్న పాత్ర పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్. 1987లో చేసిన 'నాయకన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ఇది. 37 ఏళ్ల తర్వాత కమల్, మణిరత్నం కాంబోలో వస్తున్న ఈ సినిమాలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి, నాజర్, గౌతమ్ కార్తీక్, జోజూ జార్జ్, ఐశ్వర్యా లక్ష్మి కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా ఈ చిత్రం పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్. కాయల్ పట్టినమ్. నన్ను క్రిమినల్, గుండా, యాకుజా అని పిలుస్తారు. యాకుజా అంటే జపాన్ భాషలో గ్యాంగ్‌స్టర్ అని అర్థం' అంటూ 'థగ్ లైఫ్'లోని తన పాత్ర గురించి ఈ సినిమా టైటిల్ టీజర్ అనౌన్స్‌మెంట్ వీడియోలో చెప్పుకొచ్చారు కమల్. ఆర్. మహేంద్రన్, కమల్‌హాసన్, మణిరత్నం, ఎ. శివ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ స్వరకర్త. 2025లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.



● కమల్‌హాసన్



● సూర్య

స్టూడెంట్ టు గ్యాంగ్‌స్టర్

'సూరరై పోట్రు' ('ఆకాశం నీ హద్దు రా!') వంటి సందేశాత్మక బయోపిక్ తీసిన తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధ కొంగర ఓ గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ చేయనున్నారు. ఈ పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ మూవీలో సూర్యతో పాటు దుల్కర్ సల్మాన్, నజ్రియా ఫాహద్, విజయ్ వర్మ లీడ్ రోల్స్ చేస్తారు. ఈ ఏడాది వేసవిలో ఈ సినిమా చిత్రీకరణ ఆరంభం అవుతుంది. చెన్నై, తిరుచ్చి లొకేషన్స్‌తో పాటు హర్యానాలో కూడా కొంత షూటింగ్ ప్లాన్ చేశారట. ఇక కథ రీత్యా స్టూడెంట్ స్థాయి నుంచి గ్యాంగ్‌స్టర్ వరకు ఎదిగే వ్యక్తి పాత్రలో సూర్య కనిపిస్తారని కోలీవుడ్ సమాచారం. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్‌ను ఆరంభించారు సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్. ఇది జీవీ ప్రకాశ్‌కు నూరవ చిత్రం కావడం విశేషం.



● ధనుష్

ఇటు చెన్నై... అటు ముంబై

తమిళనాడులో ఒకటి, ముంబైలో మరొకటి... ఇలా రెండు గ్యాంగ్‌లు మెయిన్‌టైన్ చేస్తున్నట్లున్నారు హీరో ధనుష్. ముందు తమిళనాడుకు వెళితే... ధనుష్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాయన్'. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. సందీప్ కిషన్, కాళిదాసు, సెల్వ రాఘవన్, ప్రకాశ్‌రాజ్, దుషారా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ముగ్గురు అన్నదమ్ములు (ధనుష్, సందీప్ కిషన్, కాళిదాసు)ల మధ్య నార్త్ చెన్నై నేపథ్యంలో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఆట 'రాయన్'. ధనుష్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ చిత్రం, ఆయనకు కెరీర్‌లో యాభైవ చిత్రం కావడం విశేషం. ఓ గ్యాంగ్‌స్టర్ చెఫ్‌గా ఎందుకు కొత్త జీవితం ప్రారంభించాల్సి వచ్చింది? గ్యాంగ్‌స్టర్ గొడవలు అతని కుటుంబాన్ని, జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయనే అంశాలు 'రాయన్' చిత్రంలో ఉంటాయని టాక్. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ డైరెక్టర్. ఈ చిత్రాన్ని ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. మరోవైపు ముంబై గ్యాంగ్‌స్టర్స్ మాఫియా నేపథ్యంలో సాగే 'డీఎన్‌ఎస్' (వర్కింగ్ టైటిల్) సినిమాలో ధనుష్ హీరోగా నటిస్తున్నారని తెలిసింది. నాగార్జున ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్. కథ రీత్యా ధనుష్, నాగార్జున ఈ సినిమాలో గ్యాంగ్‌స్టర్స్ రోల్స్ చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పుస్కూరు రామ్మోహన్, సునీల్ నారంగ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'ధారావి' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట మేకర్స్. ఈ సినిమా 2025లో విడుదలయ్యే అవకాశం ఉంది.

ఈ సినిమాలతో పాటు గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో తమిళంలో మరికొన్ని చిత్రాలు రానున్నాయి.

సంతోష్ శివన్‌కు కాన్స్ అవార్డు

ప్రముఖ సినిమాటోగ్రాఫర్ సంతోష్ శివన్‌కు అరుదైన గౌరవం లభించింది. కాన్స్ చలన చిత్రోత్సవాల్లో అందించే ప్రతిష్ఠాత్మకమైన పియర్ ఏంజెనీ అవార్డు ఈ ఏడాది సంతోష్ శివన్‌ను వరించింది. మే 14 నుంచి మే 25 వరకు 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లో జరగనుంది. మే 24న సంతోష్ శివన్ అవార్డు అందుకోనున్నారని హాలీవుడ్ సమాచారం. కాగా ఈ అవార్డును అందుకోనున్న తొలి భారతీయుడు కూడా సంతోష్ శివనే అనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇక సినిమాటోగ్రఫీ విషయంలో విశిష్ట సేవలు అందించి, రెట్రో ఫోకస్ అండ్ మోడ్రన్ లెన్స్‌ను కనుగొన్న ఫ్రెంచ్ శాస్త్రవేత్త పియర్ ఏంజెనీకి నివాళిగా 2013లో ఆయన పేరిట పియర్ ఏంజెనీ అవార్డు ఆరంభించారు కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు. అప్పట్నుంచి ప్రతి ఏటా ఒక ఛాయాగ్రాహకుడికి ఈ అవార్డుని ప్రదానం చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది సంతోష్ శివన్ అందుకోనున్నారు. ఇక ఛాయాగ్రాహకుడిగా సంతోష్ చేసిన చిత్రాల్లో హిందీ 'దిల్ సే', 'ముంబైకర్' (దర్శకుడిగానూ), తెలుగులో 'స్పైడర్', తమిళంలో 'తుపాకీ', మలయాళంలో 'ఉరుమి' (దర్శకుడిగానూ), వంటి పలు చిత్రాలు ఉన్నాయి. కేవలం సినిమాటోగ్రాఫర్‌గానే కాదు.. దర్శకుడిగా, నటుడిగా, నిర్మాతగా కూడా నిరూపించుకున్నారు.



● సంతోష్ శివన్

రజాకార్ వాయిదా

బాబీ సింహా, వేదిక, అనుష్యా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'రజాకర్'. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంతో పాటు మరాఠీ, హిందీ భాషల్లో విడుదల కావాల్సింది. అయితే వీఎఫ్ఎక్స్ పనులు పూర్తి కాకపోవడం వల్ల వాయిదా వేసినట్లు శనివారం యూనిట్ ప్రకటించింది. మార్చి 15న రిలీజ్ చేస్తామని తెలిపారు. ''మా చరిత్ర.. మా పూర్వీకుల బాధలు, త్యాగాలు.. ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల చరిత్ర చెప్పడానికే ఈ సినిమా తీశాను. రజాకార్లు చేసిన అన్యాయాల గురించి చెప్పేందుకే సినిమా చేశాం'' అని ఇటీవల యాటా సత్యనారాయణ పేర్కొన్నారు.



● బాబీ సింహా

రాణి రావడం ఖాయం

బాలీవుడ్ హిట్ ఫిల్మ్ 'క్వీన్'కు సీక్వెల్‌గా 'క్వీన్ 2'ని రూపొందించే చాన్స్ ఉందని ఈ చిత్రదర్శకుడు వికాస్ బాల్ చెబుతున్నారు. కంగనా రనౌత్ లీడ్ రోల్‌లో రాజ్‌కుమార్ రావు కీలక పాత్రలో నటించిన చిత్రం 'క్వీన్'. 2014 మార్చి 7న విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా 'క్వీన్' సీక్వెల్ గురించి ఓ ఇంటర్వ్యూలో స్పందించారు వికాస్. ''క్వీన్' సినిమా విడుదలై దాదాపు పదేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటికీ చాలామంది నన్ను 'క్వీన్ 2' సినిమా గురించే అడుగుతున్నారు. 'క్వీన్ 2'కి కథ రెడీగానే ఉంది. ఎప్పుడన్నది ఇప్పుడే చెప్పలేను కానీ క్వీన్ రావడం ఖాయం'' అన్నారు వికాస్. ఇక ఈ సీక్వెల్‌లోనూ కంగనా రనౌత్‌నే కథానాయికగా తీసుకుంటారా? అనే విషయంపై క్లారిటీ ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. వికాస్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'సైతాన్' మార్చి 8న విడుదల కానుంది. ఈ సినిమాలో అజయ్ దేవగన్, మాధవన్, జ్యోతిక లీడ్ రోల్స్ చేశారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగానే వికాస్ 'క్వీన్ 2' గురించి వెల్లడించినట్లుగా తెలుస్తోంది.




● కంగనా రనౌత్

రీల్

శనివారమే వేట!

''కోపాలు రకరకాలుగా ఉంటాయి.. ఒక్కొక్క మనిషి కోపం ఒక్కొక్కలా ఉంటుంది.. కానీ ఆ కోపాన్ని క్రమబద్ధంగా పద్ధతిగా వారంలో ఒక్కరోజు మాత్రమే చూపించే ఎవరినైనా చూశారా.. నేను చూశాను'' అంటూ నటుడు ఎస్‌జె సూర్య చెప్పే డైలాగ్స్‌తో విడుదలైంది 'సరిపోదా శనివారం' టీజర్. నాని హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. ఆగస్ట్ 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. శనివారం (ఫిబ్రవరి 24) నాని పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ని విడుదల చేశారు. నాని చేస్తున్న సూర్య పాత్ర ఒకే ఒక్క రోజు (శనివారం) మాత్రమే కోపం చూపిస్తుందని టీజర్ ద్వారా స్పష్టం చేశారు. వారంలో జరిగే ఘటనలను పేపర్ పై రాసుకుని, తనని ఇబ్బందిపెట్టేవారిని శనివారం వేటాడతాడు సూర్య. ఇక నాని హీరోగా సుజిత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్లు దానయ్య తెలిపారు.



● నాని

రాక్షసులపై యుద్ధం

'శ్రీ మహా విష్ణువు దశావతారాలలో పరశురాముడు ఆరవ అవతారం. తన గొడ్డలితో సముద్రాన్ని వెనక్కి పంపి పరశురామ క్షేత్రం అనే అద్భుతమైన భూమిని సృష్టించాడు. రాక్షసులు తమ క్రూరత్వంతో అమాయకులను ఇబ్బంది పెట్టినప్పుడు భగవంతుడు వారిని ఆపడానికి బ్రహ్మ రాక్షసుడిని పంపిస్తాడు. అతను రాక్షసులపై యుద్ధం ప్రకటించే కరుణలేని పోలీసు' అంటూ సాగుతుంది 'భీమా' ట్రైలర్. గోపీచంద్ హీరోగా ఎ. హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించిన చిత్రం 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ కథానాయికలు. మార్చి 8న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో గోపీచంద్ మాట్లాడుతూ– ''చాలా మంచి సినిమా. తప్పకుండా అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''ఈ చిత్రంలో ప్రేక్షకులు ఒక డిఫరెంట్ గోపీచంద్‌ని చూస్తారు'' అన్నారు ఎ. హర్ష. ''శివరాత్రికి శివుని ఆశీస్సులతో ఈ సినిమా అందరినీ అలరిస్తుందని కోరుకుంటున్నాను'' అన్నారు రాధామోహన్.



● మాళవిక, గోపీచంద్, ప్రియాభవానీ

సీక్వెల్ ప్లాన్ ఉంది

'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన చిత్రం 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో మురళీ శర్మ కీలక పాత్ర చేశారు. 'మళ్లీ మొదలైంది' ఫేమ్ టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో అదితి సోనీ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో కీర్తి కుమార్ మాట్లాడుతూ– ''సుమంత్‌గారితో తీసిన 'మళ్లీ మొదలైంది' సినిమా సమయంలో 'వెన్నెల' కిశోర్‌గారికి 'చారి 111' స్టోరీలైన్ చెప్పాను. ఓకే చెప్పారు. ఆయన్ను దృష్టిలో పెట్టుకునే ఈ సినిమా కథ రాశాను. స్పై కామెడీ ఫిల్మ్ 'జానీ ఇంగ్లిష్' తరహాలో 'చారి 111' చిత్రం ఉంటుంది. ఈ చిత్రానికి సీక్వెల్ ఆలోచన ఉంది'' అని చెప్పుకొచ్చారు.



● కీర్తి కుమార్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటువంటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



బలిజ/ M.Tech / C.Govt. సైంటిస్ట్ / ఇస్రో/ 85000/-PM / 5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-14220]

బెస్త, గంగపుత్ర/M.Tech, IIT/Govt. Asst. Exq. ఇంజినీర్/RWS/50,000/-PM/ 6'ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14220]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/M.Tech/ C.Govt.Asst. మేనేజర్/SBI/60,000/-PM /5'11"ఎత్తు/28 సం॥ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-14220]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/ C.Govt. ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వే/80,000/-PM/ 5'10"ఎత్తు/29 సం॥ అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9059354962 [HA-14220]

రజక/B.Tech/ Govt.Asst. ఇంజినీర్/ ఎలక్ట్రికల్ Dept/90,000/-PM/5'11" ఎత్తు / 29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-14220]

క్రిస్టియన్ మాల/M.Tech, IIT/C.Govt. సైంటిస్ట్/DRDO/1 Lakh. PM/6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-14220]

క్రిస్టియన్ మాల/ కట్నం ప్రసక్తి లేదు/ 28/5'9"/B.Tech/C.Govt.రిసెర్చ్ ఆఫీసర్/ DRDO/1 Lakh. PM అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14225]

మున్నూరు కాపు/B.Tech (సివిల్) /Govt. A.E.E/R&B/14 Lakh PA/5'8" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph : 9912280929 [HA-14225]

SC మాదిగ/B.Tech,IT/ C. Govt.డిప్యూటీ మేనేజర్/SBI/1 Lakh PM/5'9"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9676995093, 6304407230 [HA-14225]

కుల ప్రసక్తిలేదు/48 సం॥ల HIV పాజిటివ్ ఉండి ఆరోగ్యంగా ఉన్న వరునికి HIV పాజిటివ్ ఉండి ఆరోగ్యంగా ఉన్న వధువు కావలెను. Ph: 8019431389 [HA-14226]

డైరెక్ట్ కాపు/రెండో పెళ్లి 49 Y నో ప్రాపర్టీస్ పిల్లలు ఉన్నవారు మాత్రమే ఫోన్ చేయాలి లేకపోతే పేరెంట్స్ మాత్రమే మాట్లాడాలి. కుల ప్రసక్తిలేని వధువు కావలెను. నో బ్రోకర్స్. Ph: 9113610761 [HA-14226]

తెలుగు క్షత్రియ (CNB)/6'/26Y/MA, ఒరిజినల్లి వైజాగ్, బెంగళూరులో సెటిల్డ్, ఇండస్ట్రీలిస్ట్, పెర్సనల్ ప్రాపర్టీస్, సెటిల్డ్ వరునికి వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ వధువు కావలెను. Ph: 9845134062 (డైరెక్ట్) [HA-14226]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/MBA/Very Handsome Boy / BBA/ MBA/Working / 1994 / 6'/ 70Cr/Father-Builder *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/BE / BITS / Own Industry/V. Handsome Boy/1993/5'7"/50Cr *B.Sc/ Own Business / 500Cr / 1995 / 5'9". * Cont:K.C.Reddy-Hyd.Ph: 9849321309

Reddy/Business/B.Tech/MS/1994/5'11"/ 150Cr *1988/5'8"/200Cr *1994/5'11"/ 250Cr. *1997/6'/150Cr. * Cont: K.C. Reddy - Hyd.Ph: 9347807015/ 9849321309

Reddy/CATHOLIC / V.Handsome Boy / B.Tech/MBA/ SWE/ Hyd/30L/ yr/5cr/ Father Industrialist. *Cont : K.C. Reddy - Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS/H1/USA /V.Handsome Boy/1991 / 5'11"/ 200Cr *1997/6'/400Cr * B.Tech / NIT/MBA (ISB)/MBA/USA/ 1993/ 6'/ 100Cr * Cont: K.C. Reddy- Ph: 9347807015

Reddy/B.Tech /MS/ H1 / USA/ Political Family / 1995 / 5'9" / Rich Family/ Father Big Contractor. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/MBBS/MD/DM/1995/5'10"/200 Cr *1994/5'10"/75Cr *1993/5'10"/ 50Cr. * Cont : K.C.Reddy- Mar-Bureau - Hyd- Ph: 9347807015/9849321309

Reddy/IIT/B.Tech/SWE/ 1994/5'9"/V. Handsome Boy/1Cr/yr/30Cr/ *B.Tech/ MBA/ 1991/5'10"/ 75L/yr/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/ Divorcee/B.Tech / MBA / MS/ Business/1981/5'8"/500Cr *MBBS/MD/ 1994/5'9"/50Cr. * Cont. K.C.Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/Doctor/ USA/ 1995/5'8"/ 10Cr *1992/5'11"/10Cr *1983/5'6"/50Cr *1975/6'/ 700K *1989/5'8"/30Cr. *Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015/9849321309

వరుడు కావలెను

Reddy/B.Tech / MS/H1/USA / Most Beautiful / 1997/ 5'5"/ 60Cr *1989/ 5'6"/ 170K/30Cr. * Cont: K.C.Reddy-Mar-Bur-Hyd.Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/MBA/Most Beautiful/ Own Business/1994/5'4"/20Cr *IIIT/ MS/ USA/120K/1996/5'3"/20Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy / IIIT / Dual Degree / Most Brilliant Girl / Most Beautiful/ 2000 / 5'7" / 45L/yr/10Cr. *Cont. K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/MS/ H1/ USA/ Most Beautiful/1997/5'5"/60Cr- *1998/ 5'4"/ 10Cr *IIIT/1996/5'3"/120K/20Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/ MS / USA / Most Beautiful/ 1996/ 5'8"/15Cr *1990/5'8/ 30Cr/160K *1996/5'5"/ 10Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/MBBS/PG *1995/5'7"/10Cr *USA-doc/1996/5'8"/40Cr *PM/1996/ 5'3"/6Cr *1995/5'5"/100Cr *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Rich Family *B.Tech/1998/ 5'4"/40Cr/ *1995/5'3"/50Cr *1990/ 5'4"/ 50Cr *1992/5'4"/20Cr *Cont: K.C.Reddy -Hyd-Ph:9347807015/ 9849321309

Reddy/B.Tech/Beautiful *1993/ 5'7"/ 100Cr *1988/5'3"/400Cr *2000/5'3"/20 Cr/1991/5'7"/10Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/Divorcee B.Tech / 1993 / 5'7"/ 15Cr *MD/1993/5'8"/40Cr *B.Tech/ 1993/ 5'6"/ 50Cr *1986/5'6"/20Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/USA-Citizen/Most Brilliant Girl/ 1000Cr/1999/5'6" *Doctor/ USA/ 1995/5'7" * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

[D-639]

రెడ్డి: 32Y/5'8"/ MBA/Business/ 1 లక్ష నెలకు/ 15Cr ప్రాపర్టీ, రెడ్డి/ 35y/5'7"/ Doctor/ MBBS/ MD/ MS/ 2 Lakhs PM/ 50Cr ప్రాపర్టీ కలిగిన వరులకు వధువులు కావలెను. డైరెక్ట్ 8897213126, 8019468462 [H-801483]

కాపు: 5'5'/ 55 Yrs/ డైరెక్ట్. కుల పట్టింపు లేదు. నెలకు RS. యాభై వేల ఆదాయం కలిగి, సుమారుగా అరకోటి స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనస్సున్న వధువు కావలెను. పిల్లలు ఉన్నా సంతోషమే. Ph: 8341482731 [H-1177614]

కాపు, 53 సం॥లు, 5'10", రంగు, పర్సనాలిటీ గల వరుడికి సహధర్మ చారిణిగా మంచి కుటుంబంలోని వధువు కావలెను. డైరెక్ట్ 89858 00554. [B-1263098]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/ నెలకు లక్ష రూపాయల ఆదాయం, Hyd లో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఏపీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ / విడో Ok కుల, కట్నం ప్రసక్తిలేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801473]

కోమట్ల అమ్మాయి కావలెను. 1వ కోమట్ల అబ్బాయి 35 M.Sc., M.Ed., D.Ed. ప్రైవేట్ లెక్చరర్ 23 వేలు, ఆస్తి 36 లక్షలు నల్లగొండ. సంప్ర॥ సెల్ : 9121325068 [Y-798315]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BE, 26, 6' 1", 500 Crores, Hyd, Hansome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి M Tech (IIT), MS, 30, 6' 2", Engineer, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BBA (USA), 27, 5' 7", 100 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE, MS, 28, 5' 11", Project Engineer, 32 K Euros. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Business MBA, 32, 5' 3", Rich Family, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 6", Developer, 110 K, 3 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), 28, 5' 7", 22 L P/A, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE, MS, 25, 5' 2", SWE, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)



D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి BE, MBA, 30, 5' 8", Sr Analyst, 30 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 30, 5' 10", SWE, 140 K, 35 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 6' 1", PG Doctor, Rich, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, M Tech, 33, 6', 16 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 5", Product Manager, 200 K, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 7", SWE, 170 K, 40 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 6", PG Doctor, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 6", Analyst, 70 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

వరుడు కావలెను



37y/కుల పట్టింపు లేదు/Govt. ఎంప్లాయ్/3 లక్షలు (PM), డైవర్సీ 30 ఎకరాల పొలం, కోట్ల ఆస్తి వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK Any Profession OK) సంప్ర : 8332006483 [H-787995]

రెడ్డి/30yr/5'5"/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ M.Com/ Govt. ఎంప్లాయ్/70 K (PM) వెల్ సెటిల్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK, 1st & 2nd మ్యారేజ్ OK) సంప్ర : 8008474869 [H-787995]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/39yr M.Sc Ph.D/ M.Phil/ Govt.ప్రొఫెసర్ 3 లక్షలు (PM) సొంత ఇల్లు+కారు & 100 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. (ఇల్లరికం & పిల్లలు ఉన్నా OK) సంప్ర : 7396213324 [H-787995]

గౌడ/C.A / చార్టెడ్ అకౌంటెంట్/ 50,000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-14220]

యాదవ/ఏకైక కుమార్తె/ M.Sc/Govt. Jr.Asst. / రెవెన్యూ Dept/40,000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14220]

SC హిందూ మాల/B.Tech/ Govt. Asst. ఇంజినీర్/ ట్రాన్స్‌కో/ 60,000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-14220]

SC హిందూ మాదిగ/B.Tech/ Govt. Asst. ఇంజినీర్/RWS/ 60,000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9059354962 [HA-14220]

బ్రాహ్మణ/24/5'3"/ డిగ్రీ * 27/5'3"/ఇంటర్ *32/5'2"/ఇంటర్ *28/5'2"/డిగ్రీ *34/5'3"/డిగ్రీ వధువులకు వరులు కావలెను. బిజినెస్, జాబ్ పురోహితులు కూడా సంప్ర: Ph: 7842635086 [HA-14225]

SC మాల/ B.Tech / C.Govt.Jr. ఇంజినీర్ / రైల్వే /60,000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14225]

గౌడ/B.Tech /C.Govt. బ్యాంక్ క్యాషియర్/ SBI / 38000/-PM/ 5'4" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515942275 [HA-14225]

క్రిస్టియన్ మాల/25/5'5"/ B.Tech/ C. Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/ 60,000/-PM అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14225]

2వ పెళ్లి/BC/కుల ప్రసక్తి లేదు/ B.Tech/ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్/1 Lakh PM/5'4" ఎత్తు/ 36 సం॥లు/ ఒక పాప గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9550650024 [HA-14225]

యాదవ/B.Tech (EEE) / C.Govt.Asst. మేనేజర్/యూనియన్ బ్యాంక్/ఏకైక కుమార్తె / 5'4"ఎత్తు/25 సం॥ల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-14225]

SC మాల & క్రిస్టియన్/M.Tech, IT / C.Govt.డిప్యూటీ మేనేజర్/ SBI/ 65000/-PM/ 5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-14225]

కమ్మ/విడో/54Y/5'2"/Gunturలో సొంత ఫ్లాట్లు/ Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083300, 7386660643 [H-787995]

రెడ్డి/విడో/వయస్సు : 30, డిగ్రీ/Own Business/ అందమైన వధువుకి వరుడు కావలెను. (కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు) ఇల్లరికం OK, అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9849337176 [H-787995]

రెడ్డి/విడో, కుల, మత, ఆస్తి ప్రసక్తిలేదు/ Age:29, Qly: డిగ్రీ/ సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికం Ok). Ph: 9515673252 [HA-14226]

ఆర్యవైశ్య/22y&24y&26y&28y&30y&32y&34y&35y&36y&37y&38y&40y&42y&44y&45y&47y&49y&50y&51y&53y&54y&56y&58y&59y/జి. సుభాషా గుప్తా "మా సేవ" (Since 1998): PH/WA: 9291583949 [HA-14226]

నాయుడు/విడో/ 51y/Govt. Principal/ Own Institute/ 10 Lakhs Income కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 8121608458 [H-801543]

రెడ్డి/విడో/57y/5'5"/V.Fair/ Govt. Teacher/ సొంత ఇల్లు & రెంట్స్/ 28 ఎకరాల పొలం/3L pm పిల్లలులేని వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తిలేదు. ఇల్లరికం Ok. Ph: 7093717220 [H-801543]

బ్రాహ్మిన్స్/విడో/55y/5'3"/Govt. School Teacher/ 4 ఎకరాల వ్యవసాయ భూమి/ సొంత ఇల్లు గల వధువుకి మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 8074953735 [H-801543]

(కుల పట్టింపులేదు) రెడ్డి/విడో/35y/ డిగ్రీ/ పెద్ద స్థిరాస్తి కలిగి పిల్లలులేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. ఆస్తి పట్టింపులేదు. ఫోటోలు వాట్సప్ సెండ్ Ph: 9885492498 [H-801543]

2వ పెళ్లి/కాపు/41y / సాఫ్ట్‌వేర్ ఇంజినీర్/75000/- pm వధువుకి తగిన సెటిల్డ్ వరుడు కావలెను. Ph: 8340059430 [H-801543]

రెడ్డి: డైవర్సీ/29y/B.E, MBA/Govt Job/ 90K P/M వెల్ సెటిల్ ఫ్యామిలీ వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309344166 [H-799804]

కుల పట్టింపులేదు : విడో/46y/ ఇండస్ట్రీస్ & పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ Dept/1.5L P/M/ Own House/ 19 ఎ॥ ల్యాండ్ కోట్ల ప్రాపర్టీ గల వధువుకు వరుడు కావలెను. Ph: 9032746947 [H-799804]

కాపు:/26y/డైవర్సీ/B.Tech/SWE/1L P/M/సొంతప్లాట్లు, కోట్ల ప్రాపర్టీగల పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985746131 [H-799804]

కుల ప్రసక్తి లేదు: విడో/55y/ విజయవాడ Hydలో Own House (Rents), ల్యాండ్ Well Settled పిల్లలులేని ఏ బాదర బందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-799804]

రెడ్డి: విడో/28y/ M.Tech/1.5L P/M/ 4ఎ॥ ఫాంల్యాండ్ గల సాంప్రదాయ కుటుంబపు వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9640667754 [H-799804]

రెడ్డి: 40y/5'4"/Fair/ G.employ/ Late Marriage/ 20 Acars Mango తోట, 15 Cr ప్రాపర్టీ కల్గిన అందమైన వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు Job/Business Ok Ph: 7396608019, 8019484384 [H-801483]

కమ్మ: 45y/5'5"/MBA/ బిజినెస్/ 2 లక్షలు నెలకు, 20 Cr ప్రాపర్టీ కల్గిన వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు Ph: 8019484384, 7396608019 [H-801483]

వైశ్య: 53y/5'4"/విడో/Own Restaurent/ 3 లక్షలు నెలకు 40Cr ప్రాపర్టీ కల్గిన వధువుకు వరుడు కావలెను. పిల్లలున్నా OK కుల ప్రసక్తి లేదు. Ph: 7396608019, 8019484384 [H-801483]

★

రెడ్డి డాక్టర్/1990/ 5'-10" MD. (DVL)/డెర్మటాలజిస్ట్ /15 Cr ప్రాపర్టీ/ పేరెంట్స్ Hydలో సెటిల్డ్ వధువుకు/ Hydలో వెల్ సెటిల్డ్ / 5'-11" పైన ఎత్తు గల రెడ్డి వరుడు కావలెను. సెల్: 9440461898. [K-1187385]

వేదికలు



జయసింహ పరిణయ వేదిక, వధువు, వరుల సమాచారం కొరకు సంప్రదించండి. Whatsapp No. 9000803380 [HA-9413]

మైత్రిరెడ్డి కళ్యాణ వేదిక రెడ్డిలకు మాత్రమే Local/Abroad సంబంధాలు చూడబడును Free Registration Hyderabad, L.B.Nagar G.S. Reddy Ph: 8897213126, 8019468462 [HA-801483]

కేవలం యాదవ / కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజా యాదవ్. www.gokulmarriage.com, HYD: 9440831748, GUNT: 9440759945, VSP: 9441735157. [HA-13041]

2nd మ్యారేజ్ లకు మాత్రమే! అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయ బడును. నో రిజిస్ట్రేషన్ ఫీ. సంప్ర : 7013226716 [HA-14213]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS 15 సం॥ Exp. Ph: 9100474440 [HA-31363]

ఓం నమః శివాయ! రెండు కుటుంబాలు కలిపే మంచి మధ్యవర్తి కావాలా! సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, NRI అన్ని ప్రాంతాలకు పర్సనల్ సర్వీసు. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2913]

15వ॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com © 98490 58673, వాట్సప్: 94401 57931, 94407 85888 [B-613]

Brahmin-Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14227]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14227]

Kapu, Kamma పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14227]

Madiga-Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14227]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14227]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-644]

14/04/2024 బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం (Online) Free Registration Bhavani Matrimony, Hyd. Ph: 9704656103/ (9533608887 - Whats app No.) [HA-663]

రుణం పేరిట దగా

- రూ.50 లక్షలు కాజేసిన ముఠా
- పోలీసుల అదుపులో ఇద్దరు
- రూ.46 లక్షలు స్వాధీనం.. పరారీలో మరో ఇద్దరు



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు

మీర్‌పేట: రూ.5 కోట్ల రుణం ఇప్పిస్తామని పిలిపించి బెదిరించి రూ.50 లక్షలు కాజేసిన ముఠాలోని ఇద్దరిని మీర్‌పేట పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర రత్నగిరి జిల్లా అహ్మద్‌నగర్‌కు చెందిన వ్యాపారి బన్సీలాల్‌శర్మ (53) అదే ప్రాంతానికి చెందిన జమీర్ నిజాం ఖలీఫ్‌కు చెందిన రాజాపూర్ తాలూకాలోని 15 ఎకరాల వ్యవసాయ భూమిని రూ.5 కోట్లకు కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు గాను రుణం కోసం నగరంలోని ఎల్‌బీనగర్ మన్సూరాబాద్ ప్రెస్‌కాలనీలో నివసించే ఫైనాన్షియర్ వజ్రగిరి దుర్గప్ప అలియాస్ సురేందర్‌రెడ్డి (29)ని ఏడాది క్రితం పుణేలోని ఓ హోటల్‌లో కలువగా రుణం ఇప్పించేందుకు అంగీకరించాడు. దీనికి 6 శాతం పర్సంటేజీ ఇవ్వడంతో పాటు రూ.5 కోట్ల రుణాన్ని బదిలీ చేసేందుకు గాను ముందుగా రూ.50 లక్షల సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని అడిగాడు. అనంతరం దుర్గప్పతో పాటు అతని అనుచరులు విజయ్, వెంకటేశ్, మహేశ్‌తో కలిసి వెరిఫికేషన్ నిమిత్తం బన్సీలాల్‌శర్మ ఇంటికి వెళ్లి పాన్, ఆధార్‌కార్డులు, ఫొటోలు సేకరించి బ్యాంకు రుణం కోసం అవసరమైన పత్రాలు తీసుకున్నారు. ఆ తరువాత షరతు ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్ రూ.50 లక్షలు అడిగారు. ఫిబ్రవరి 18న బన్సీలాల్‌శర్మ భూ యజమాని అయిన జమీర్‌నిజాం ఖలీఫ్ నుంచి చేతి బదులుగా రూ.25 లక్షలు తీసుకుని రూ.5 కోట్లతో కలిపి తీసుకున్న డబ్బును మొత్తం తిరిగిస్తానని హామీ ఇచ్చాడు. 19న దుర్గప్ప డబ్బుల కోసం బన్సీలాల్‌శర్మతోపాటు భూ యజమాని జమీర్ నిజాం ఖలీఫ్ అతని కుటుంబ సభ్యులను జిల్లెలగూడలోని స్వాగత్‌గ్రాండ్ హోటల్‌కు పిలిపించాడు. వారు వచ్చాక దుర్గప్ప అతని సహచరులు విజయ్, వెంకటేశ్, మహేశ్ వారిని బెదిరించి వారి వద్ద ఉన్న రూ.50 లక్షలు లాక్కుని పారిపోయారు. అనంతరం సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. బాధితుడు బన్సీలాల్‌శర్మ మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రుణం పేరిట మోసానికి పాల్పడిన ముఠాలోని ఏ1 దుర్గప్ప, ఏ2 విజయ్‌ను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.46 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

నాసిరకం సరుకు... బ్రాండెడ్ ముసుగు!

- ప్రముఖ కంపెనీల పేర్లతో నిత్యావసర వస్తువులు
- కాటేదాన్‌లో తయారీ, నాగారంలోని గోదాంలో నిల్వ
- నగర శివార్లలోని కిరాణా దుకాణాల ద్వారా విక్రయం
- గుట్టురట్టు చేసిన టాస్క్‌ఫోర్స్, రూ.2 కోట్ల సరుకు సీజ్



సాక్షి, హైదరాబాద్: నగరంలోని వివిధ మార్కెట్లలో లభించే ముడిసరుకుతో నాసిరకం నిత్యావసర వస్తువుల తయారీ... ఉత్తరాది నుంచి తీసుకువచ్చిన ప్రముఖ సంస్థల పేర్లతో ఉన్న కవర్లు, డబ్బాల్లో ప్యాక్ చేయడం... శివార్లలోని కిరాణా దుకాణాల ద్వారా బ్రాండెడ్ సరుకుల పేర్లతో విక్రయం... ఈ పంథాలో రెండేళ్లుగా దందా చేస్తున్న ఘరానా ముఠా గుట్టును మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఆరుగురు సభ్యులున్న ముఠాలో ముగ్గురిని అరెస్టు చేశామని, వీరి నుంచి రూ.2 కోట్ల విలువైన సరుకు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ ఎస్.రష్మి పెరుమాల్ పేర్కొన్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ ఆర్.గిరిధర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు.

ఏళ్లుగా ఇదే దందా... పలు కేసులు...

రాజస్థాన్‌కు చెందిన శ్యామ్ బాటి, కమల్ బాటి కొన్నేళ్ల క్రితం బతుకుతెరువు కోసం నగరానికి వలసచ్చి కాచిగూడ ప్రాంతంలో స్థిరపడ్డారు. తొలినాళ్లల్లో కిరాణా వ్యాపారం చేసిన ఈ ద్వయం ఆపై తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం బేగంబజార్‌కు చెందిన జయరాంతో జట్టు కట్టింది. ఈ ముగ్గురూ బ్రాండెడ్ వస్తువుల పేరుతో నాసిరకం సరుకులు ప్యాక్ చేసి విక్రయించాలని పథకం వేశారు. గుజరాత్, బెంగళూరు, ఢిల్లీల నుంచి నాసిరకం ముడిసరుకు ఖరీదు చేసే వాళ్లు. కాచిగూడలో ఏర్పాటు చేసిన కార్ఖానాలో వీటిని ప్రాసెస్ చేసి... బెంగళూరు, ఢిల్లీ, నాసిక్ నుంచి తీసుకువచ్చిన వివిధ బ్రాండ్ల పేరుతో ఉన్న కవర్లు, కార్టన్లు, డబ్బాల్లో నింపి స్టిక్కర్లు వేసి మార్కెట్‌లో విక్రయించే వాళ్లు. 2019, 2022 కాచిగూడ, మైలార్‌దేవ్‌పల్లితో పాటు నల్లగొండలోనూ కేసులు నమోదయ్యాయి. తెరవెనుక ఉండిపోయిన ముగ్గురూ తమ స్నేహితుడైన మహేందర్ సింగ్‌ను రంగంలోకి దింపారు. రాజస్థాన్‌కే చెందిన ఇతగాడు నాగారంలో కిరాణా వ్యాపారం చేస్తున్నాడు.

అక్కడ తయారు చేసి.. ఇక్కడ నిల్వ ఉంచి...

ముడిసరుకుని బ్రాండెడ్ కవర్లలో ప్యాక్ చేయడానికి కాటేదాన్‌లో ఓ కార్ఖానా ఏర్పాటు చేశారు. అక్కడ స్థానికులను పనిలో పెట్టుకుని మిథులేష్ కుమార్, త్రియస్ కుమార్ నేతృత్వంలో వీటిని ప్యాక్ చేయిస్తున్నారు. ఇలా తయారైన నిత్యావసర వస్తువుల్ని దాచడానికి మహేందర్ ఇంటి సమీపంలో ఓ గోదాం అద్దెకు తీసుకున్నారు. తొలుత సరుకు మొత్తం ఇక్కడకు తీసుకువెళ్లి... ఆపై శివార్లలో ఉన్న కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. వీటిలో నాసిరకం సరుకుతో పాటు కల్తీ సరుకు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. వీరి వ్యవహారంపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు ఉప్పందింది. ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ నేతృత్వంలో ఎస్సైలు ఎస్.సాయికిరణ్, కాచిగూడ ఇన్‌స్పెక్టర్ ఎస్ఆర్ఎల్ రాజు తమ బృందాలతో వలపన్నారు. అక్కడకు సరుకుతో వచ్చిన మహేందర్‌ను పట్టుకోగా... గోదాం, కార్ఖానా విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఆ రెంటి పైనా దాడి చేసిన పోలీసులు మిథులేష్, త్రియస్‌లను పట్టుకుని మొత్తం రూ.2 కోట్ల విలువైన సరుకు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సూత్రధారుల కోసం గాలిస్తున్న అధికారులు ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరు ఉన్నారు? అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

వీటితో ఆరోగ్యానికీ ముప్పు

వీళ్లు సరఫరా చేస్తున్న నాసిరకం, నకిలీ సరుకుల వల్ల వినియోగదారులకు ఆరోగ్యానికీ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ప్యారాచూట్, సర్ఫ్, వీల్, బ్రూక్ బాండ్, హార్పిక్, లైజోల్, ఎవరెస్ట్ తదితర కంపెనీలకు చెందిన 30 రకాల ఉత్పత్తుల్ని వీళ్లు తయారు చేస్తున్నారు. వీటిని ఎవరూ గుర్తించకుండా ఉండటానికే శివార్లలోని కిరాణా దుకాణాల ద్వారా విక్రయిస్తున్నారు. ఇవి నాసిరకం, నకిలీ అని తెలిసే వాళ్లు అమ్ముతున్నారా? లేదా వారినీ మోసం చేస్తున్నారా? అనే అంశాలు ఆరా తీస్తున్నాం. ఈ తరహా ముఠాలపై నిఘా, దాడులు కొనసాగుతాయి.

– రష్మి పెరుమాల్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ

సార్.. నాకు పెళ్లి వద్దు, చదువుకుంటా!

జగిత్యాల పోలీసులను ఆశ్రయించిన ఇంటర్ విద్యార్థిని



రూరల్ సీఐ, ఎస్సైలకు తన గోడు వెళ్లబోసుకుంటున్న యువతి

జగిత్యాలక్రైం: 'నాకు పెళ్లి వద్దు, చదువుకుంటా' అని ఓ యువతి పోలీసులను ఆశ్రయించిన ఘటన జగిత్యాల జిల్లాకేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన విద్యార్థిని(20)కి రాయికల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు సంబంధం కుదుర్చారు. ఈ నెల 26న నిశ్చితార్థం జరపాలని నిర్ణయించారు. అయితే 'ఇంటర్ సెకండియర్ చదువుతున్నా, ఇంకా చదువుకుంటా, అమ్మానాన్న నాకు పెళ్లి చేయాలని చూస్తున్నారు, నాకు పెళ్లి ఇష్టం లేదు'అని జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సుధాకర్‌ను ఆ విద్యార్థిని కలిసి గోడు వెళ్లబోసుకుంది. స్పందించిన పోలీసులు ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి చదువుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆ విద్యార్థినిని సఖీ కేంద్రానికి తరలించారు.

ఇద్దరు మిత్రులు ఒకేరోజు జననం.. ఒకేరోజు మరణం

మహబూబాబాద్ జిల్లా రామానుజపురంలో ఘటన



ఉప్పలయ్య(ఫైల్)



ఉప్పల్‌రెడ్డి(ఫైల్)

దంతాలపల్లి: వారిద్దరూ ఒకేరోజు జన్మించారు.. ఒకే పాఠశాలలో 10వ తరగతి వరకు చదివారు.. ఒకరిని వదిలి మరొకరు ఉండలేనంత స్నేహం.. అయితే ఒకేరోజు రెండు గంటల వ్యవధిలో ఇద్దరూ గుండెపోటుతో మరణించారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజపురానికి చెందిన ధర్మారపు ఉప్పలయ్య(58), అక్కిరెడ్డి ఉప్పల్‌రెడ్డి(58) స్నేహితులు. ఉప్పల్‌రెడ్డి 10వ తరగతిలోనే చదువు ఆపేశాడు. ఉప్పలయ్య ఇంటర్ వరకు చదివాడు. పెద్దముప్పారం శివారు రామానుజపురాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయా లని అప్పట్లో ఉప్పలయ్య పోరాడారు. ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటైన తర్వాత 1995–2002 వరకు రామానుజపురం మొదటి సర్పంచ్‌గా పనిచేశాడు. ఉప్పల్‌రెడ్డి మాత్రం వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 2 గంటల సమయంలో గుండెపోటుతో ఉప్పలయ్య మృతిచెందాడు. విషయం తెలిసిన ఉప్పల్‌రెడ్డి శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుండెపోటుతో మరణించాడు.

ఐటీ ఉద్యోగాల పేరిట టోకరా

- చార్జీల పేరిట సొమ్ము వసూలు
- ఇద్దరు నిందితుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: బహుళ జాతి కంపెనీలో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేస్తున్న ఇద్దరు మోసగాళ్లను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు పూర్తి వివరాలను సైబర్ క్రైమ్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు.

◆ ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ముచ్చు శివ ప్రసాద్ గతంలో యాక్సెంచర్, ఇన్ఫోసిస్ కంపెనీలలో హైదరాబాద్, బెంగళూరులో పనిచేశాడు. కరోనా సమయంలో ఉద్యోగం కోల్పోయాడు. ఈ క్రమంలో పాత స్నేహితుడు ధన్‌రాజును కలిశాడు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామనే పేరుతో మోసం చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాకు చెందిన బత్తగిరి రంగపార్థుడు వీరితో జత కలిశాడు.

◆ ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో నిందితుడు రంగపార్థుడు సైబరాబాద్ పరిధిలోని ఓ బాధితుడికి ఫోన్ చేసి డబ్ల్యూఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ అనే సంస్థలో అసోసియేట్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగం ఉందని తెలిపాడు. ఆసక్తి ఉన్నట్లయితే స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఇతరత్రా వివరాలను పంపించాలని సూచించాడు. దీంతో బాధితుడు వాట్సాప్ ద్వారా వివరాలను పంపించాడు. కొంత సమయం తర్వాత ప్రధాన నిందితుడు శివ ప్రసాద్ ఫోన్ చేసి ఉద్యోగ భర్తీ కోసం కొంత చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని సూచించాడు. దీంతో ఆఫర్ లెటర్ అందుకున్నాక ఛార్జీలు చెల్లిస్తానని బాధితుడు తెలపడంతో అంగీకరించిన శివ ప్రారంభ రుసుము రూ.20 వేలు చెల్లించాలని కోరారు.

◆ మర్నాడు ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ నిర్వహించి, జనవరి 29న డబ్ల్యూఎస్ఎస్ కంపెనీ లోగోతో నకిలీ ఆఫర్ లెటర్‌ను బాధితుడికి పంపించారు. దీంతో పూర్తిగా విశ్వసించిన బాధితుడు నిందితులు అడిగిన రూ.1.60 లక్షలు నగదును ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత ఆఫర్ లెటర్‌లో పేర్కొన్న కంపెనీ చిరునామా హైటెక్‌సిటీలోని మైండ్ స్పేస్‌కు బాధితుడు వెళ్లాడు. తీరా వెళ్లి చూస్తే అసలు ఆ చిరునామాతో కంపెనీ లేదని, నకిలీ ఆఫర్ లెటర్‌తో మోసపోయానని గ్రహించాడు. దీనిపై రంగపార్థుడు ఫోన్‌లో సంప్రదించగా.. స్పందనలేదు. దీంతో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

◆ సాంకేతిక ఆధారాలను సేకరించిన సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం శివ ప్రసాద్, రంగపార్థుడు ఇద్దరిని అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ధన్ రాజు పరారీలో ఉన్నాడు. శివ ప్రసాద్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఇప్పటికే 12 కేసులున్నాయి. నిందితుల నుంచి రూ.25 వేల నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎస్‌బీఐ బ్యాంక్ పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బురదలో చిన్నారిని ముంచి చంపిన మామ



శిరీష

నంగునూరు (సిద్దిపేట): సొంత అక్క కూతురిని బురదలో ముంచి హత్య చేశాడొక కిరాతకుడు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూరు బద్దిపడగలో జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లికి చెందిన గుజరాతి రాజు, సంతోష దంపతులు బద్దిపడగలోని ఓ మామిడి తోటను లీజుకు తీసుకొని గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం సంతోష తన కూతురు శిరీష (4)తోపాటు కుమారుడిని తోటలో ఆడిస్తోంది. ఈ క్రమంలో ఆమె తమ్ముడు శ్రీను.. వారించినా వినకుండా శిరీషను తోటలోకి తీసుకెళ్లాడు. ఆ తర్వాత పక్కనే ఉన్న వరి పొలంలో శిరీషను ముంచడంతో చిన్నారి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందింది. సంతోష అరుపులు విన్న చుట్టుపక్కల రైతులు అక్కడికి రావడంతో నిందితుడు పారిపోతుండగా పట్టుకొని రాజగోపాల్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడిని రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి మతిస్థిమితం సరిగా లేదని చెబుతున్నప్పటికీ ఘటనాస్థలి వద్ద దృశ్యాలు పలు అనుమానాలు తావిస్తున్నాయి.

క్లుప్తంగా...

పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ పరీక్ష తుది 'కీ' విడుదల

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక విద్యాశాఖ పరిధిలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో లెక్చరర్ ఉద్యోగాలకు సంబంధించి గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన అర్హత పరీక్షల తుది 'కీ'ని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌లు కూడా వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో ఇంటర్ హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను అధికారులు వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఇప్పటికే హాల్ టికెట్లను కాలేజీ లాగిన్ ఐడీలో పొందుపరచగా, తాజాగా నేరుగా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. విద్యార్థులు www.tsbie.cgg.gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా తెలిపారు. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాక విద్యార్థులు అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని శృతి ఓజా సూచించారు. ఏవైనా పొరపాట్లుంటే వెంటనే డీఐఈవోలను సంప్రదించి సరిదిద్దుకోవాలని సూచించారు. ఇక ఈ హాల్‌టికెట్లపై ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా పర్వాలేదని.. ఆయా విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

'నేషనల్ సైన్స్‌డే' సందర్భంగా విద్యార్థులకు బహుమతులు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 28న 'నేషనల్ సైన్స్‌డే'ను పురస్కరించుకుని...తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్‌కాస్ట్), పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ (ఈపీటీఆర్ఐ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్కూలు పిల్లలకు చిత్రకళ, కవితలు, పాటలు, ఎలక్యూషన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఒక్కో కేటగిరీలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఐదుగురు చొప్పున (ప్రథమ,ద్వితీయ,తృతీయ, రెండు కన్సోలేషన్ ప్రైజ్) మొత్తం 20 మందికి బహుమతులు ప్రకటించారు. 'నేషనల్ సైన్స్‌డే'సందర్భంగా వరంగల్‌లో ప్రాంతీయ సైన్స్ సెంటర్‌లో ఈ బహుమతులను ప్రదానం చేయనున్నట్టు టీఎస్‌కాస్ట్ సభ్య కార్యదర్శి మారుపాక నగేశ్ శని వారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో బహుమతులు పొందినవారి జాబితాను టీఎస్‌కాస్ట్ tttps://tscost.telangana.gov.inలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఐఈఆర్‌పీలను క్రమబద్ధీకరించాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు దాదాపు 20 ఏళ్లుగా బోధన, అభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ)ల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ యూనియన్(ఐఈఆర్‌టీయూ) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఐఈఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిలువూరి వెంకటేశం, కె.కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1,523 మంది ఐటీఆర్‌పీలు పనిచేస్తున్నారని చెప్పారు.

గుర్తిద్దాం... నివారిద్దాం

కేన్సర్‌కు చికిత్స కంటే నివారణే ముఖ్యం: కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

ఒకే రక్త పరీక్షతో కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించేలా..

ఆస్పత్రిలో 'కేన్సర్ ప్రివెన్షన్ అండ్ ఎర్లీ కేన్సర్ డిటెక్షన్'విభాగం ఏర్పాటు

మూడు రకాల జన్యు పరీక్షలూ ప్రారంభం..



సాక్షి, హైదరాబాద్: కేన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట వేయడంలో భాగంగా చికిత్స అందించడం కన్నా నివారణ మార్గాలే అత్యంత ప్రామాణికమని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి తెలిపారు. ఒకే రక్త పరీక్షతో కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించేలా కాంటినెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నూతనంగా 'కేన్సర్ ప్రివెన్షన్ అండ్ ఎర్లీ కేన్సర్ డిటెక్షన్'విభాగాన్ని ఏర్పాటు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత కేన్సర్ స్పెషలిస్ట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ కేన్సర్ ప్రోగ్రామ్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కరోల్ సికోరా ఈ విభాగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే ప్రఖ్యాత కేన్సర్ సెంటర్ ఎండీ అండర్సన్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 40 ఏళ్ల పాటు పనిచేసి, ఆ అనుభవాన్నంతా దేశంలోనే సేవలందించాలనే లక్ష్యంతో కాంటినెంటల్ ఆసుపత్రిని స్థాపించానని తెలిపారు. ఇప్పటికే 40 వేల మందిని పైగా కేన్సర్ కోరల నుంచి బయటికి తీసుకొచ్చిన తమ కేన్సర్ కేర్ టీమ్... రాబోయే రోజుల్లో ఈ బ్లడ్ టెస్ట్ ద్వారా మరింత ఎక్కువ మందిని కేన్సర్ బారి నుంచి కాపాడటమే లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు.

లిక్విడ్ బయాప్సీ టెస్ట్‌తో కేన్సర్ గుర్తింపు

ముంబయిలోని టాటా మెమోరియల్ హాస్పిటల్ వంటి సంస్థల్లో కేన్సర్ విభాగంలో 40 ఏళ్లపాటు సేవలందించిన డాక్టర్ జగన్నాథ్ నిర్వహణలో కేన్సర్ ప్రివెన్షన్ అండ్ ఎర్లీ కేన్సర్ డిటెక్షన్ విభాగం కొనసాగుతుందని గురు ఎన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగమైన లిక్వి డ్ బయాప్సీ టెస్ట్‌తో ముందుగా కేన్సర్‌ను గుర్తించే సామర్థ్యాన్ని అందిస్తుందన్నారు.

ఈ మూడు టెస్ట్‌లతో...


ఆస్పత్రిలో మూడు రకాల జన్యు పరీక్షలను ప్రారంభించామని డాక్టర్ గురు ఎన్ రెడ్డి తెలిపారు మొదటగా కేన్సర్ ప్రిడిస్పోజిషన్ టెస్ట్... జన్యు అమరిక, వాటిలోని తేడాలను అర్థం చేసుకుని, భవిష్యత్‌లో ఏ రకమైన కేన్సర్ వ్యాధి బారిన పడతామో ముందుగానే గుర్తిస్తుందన్నారు.

రెండోది కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్.. వంశపారంపర్యంగా వచ్చే కేన్సర్లను గుర్తించడానికి ఈ కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ జెనెటిక్ మేకప్‌ను సమగ్రంగా పరిశీలిస్తుందన్నారు. యూఎస్‌ఏలోని నేషనల్ కాంప్రెహెన్సివ్ కేన్సర్ పేర్కొన్న విధంగా... రొమ్ము కేన్సర్, ఓవరిన్ కేన్సర్, పాంక్రియాటిక్ కేన్సర్, ప్రొస్టేట్ కేన్సర్, కొలొరెక్టల్ కేన్సర్ వంటి ఐదు కేన్సర్లకు కారణం అయ్యే వంశపారంపర్యంగా వచ్చే జన్యువులను ఈ టెస్ట్ ద్వారా గుర్తించవచ్చన్నారు.

మూడోది నెక్స్ట్ – జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) ఆధారిత సీఎఫ్‌డీఎన్‌ఏ పరీక్ష. దీని ద్వారా రక్త ప్రవాహంలో తిరుగుతున్న సెల్ ఫ్రీ డీఎన్‌ఏను విశ్లేషించి కేన్స ర్‌ను చాలా ముందుగా గుర్తించవచ్చన్నారు. ఇలా 3 దశల్లో జన్యువులోని కేన్సర్ బారిన పడ్డ, పడబోతున్న ప్రాంతాలను ఈ రక్త పరీక్ష ద్వారా చాలా కచ్చితత్వంతో తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమగ్ర విశ్లేషణతో కేన్సర్ చికిత్స మరింత సులభతరం అవుతుందన్నారు.

అపోహలను తొలగించాలి: కరోల్ సికోరా

ప్రొఫెసర్ కరోల్ సికోరా మాట్లాడుతూ... కేన్సర్ నివారించడం సాధ్యమేనా అనుకునే అపోహలను



ప్రయత్నమనే ఒక్క అడుగుతో తొలగించవచ్చన్నారు. ఇలాంటి అద్భుతమైన ప్రయత్నాన్ని మొదలుపెట్టిన కాంటినెంటల్ ఆసుపత్రికి ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంటినెంటల్ కేన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ రవీంద్రనాథన్, డాక్టర్ ఏవీ సురేష్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో భయాందోళనలు తొలగింపు..

కేన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల మరణాలు ఎక్కువ చోటుచేసుకుంటున్నాయని అందుకే వీటిపై అవగాహన కల్పించడానికి కాంటినెంటల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ గురు ఎన్ రెడ్డి వెల్లడించారు. ఆస్పత్రి వైద్యుల నేతృత్వంలో ఫిబ్రవరి నెలలో వందలాది మందికి అవగాహన కల్పించామని చెప్పారు. ఆడవారిలో వచ్చే కేన్సర్‌లు, లక్షణాలు, జాగ్రత్తలపైన, గ్యాస్ట్రో ఇంటస్టైన్, లివర్ కేన్సర్‌లపైన ఊపిరితిత్తులు, తల, మెడ కేన్సర్లు, గ్లాడర్, కిడ్నీ, ప్రొస్టేట్, చర్మ కేన్సర్ల పైన అవగాహన కల్పించామన్నారు. మంచి చికిత్సను అందించడమే కాకుండా కేన్సర్ రాకుండా అవగాహన కల్పించడం బాధ్యతగా అలవర్చుకున్నామన్నారు. ఇన్సూరెన్స్ సంస్థలు వారి సేవల్లో కేన్సర్ బాధితులను చేర్చాల్సిన అవసరముందని, 70 శాతం మంది బాధితులు ఆర్థిక సమస్యలతోనే మరణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



కోదాడలో కోర్టు భవన సముదాయానికి భూమి పూజ చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు

స్త్రీల కేసులను త్వరగా పరిష్కరించాలి

- వారిని కోర్టుల చట్టూ తిప్పొద్దు
- పెండింగ్ కేసులను తగ్గించేందుకు అదనపు కోర్టుల ఏర్పాటు
- తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

కోదాడ అర్బన్, చివ్వెంల (సూర్యాపేట): భారతీయ కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్ర ప్రధానమైనదని, కుటుంబం సజావుగా సాగేందుకు ఆమె నిర్వహించే పాత్ర, ఆమె వెచ్చించే సమయం వెలకట్టలేనివని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. కేసుల పేరిట స్త్రీలను కోర్టుల చట్టూ తిప్పొద్దని సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కోదాడలో జూనియర్, సివిల్ జడ్జీల కోర్టులను ఆయన ప్రారంభించారు. అదే ప్రాంగణంలో నిర్మిస్తున్న 4 కోర్టుల నూతన భవన సముదాయానికి భూమిపూజ చేశారు. ఆ తర్వాత సూర్యాపేట జిల్లా కేంద్రంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుతోపాటు జ్యుడీషియల్ ఈ–సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో స్త్రీల జీవితం అనేక బాధ్యతలు, బాంధవ్యాలతో ముడిపడి ఉందని.. అందువల్ల స్త్రీలకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయ వ్యవస్థ పనిచేస్తుందన్నారు. న్యాయ వ్యవస్థలో కేసుల సంఖ్యను తగ్గించేందుకు అదనపు కోర్టులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండటానికి న్యాయ వ్యవస్థతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యులేనని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, కొత్త చట్టాల మేరకు కేసులు కోర్టు దాకా రాకుండా రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తే కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటాయన్నారు. అన్ని వ్యవస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే కేసులు పరిష్కారం దిశగా వెళ్తాయన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి అదనపు కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, ఈ మేరకు న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని న్యాయవ్యవస్థకు వన్నె తేవాలని చీఫ్ జస్టిస్ సూచించారు. సీనియర్ న్యాయవాదులు జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి. వినోద్ కుమార్, జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ విజయసేన్ రెడ్డి, జస్టిస్ పుల్లా కార్తీక్, సూర్యాపేట జిల్లా జడ్జి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో పదోన్నతుల టెన్షన్

- కొత్తవారికి పోస్టింగ్ ఇచ్చాక ప్రమోషన్లు ఇస్తే సీనియారిటీ తారుమారు
- నూతన నియామకాలకు ముందే పదోన్నతులు ఇవ్వాలనే డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కొత్త నియామకాలకు ముందే గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న సీనియర్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఏళ్ల తరబడి వారంతా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లోని వివిధ కేటగిరీల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియను తెలంగాణరాష్ట్ర గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) ఓ కొలిక్కి తీసుకొచ్చింది. వారంరోజుల్లో ఖాళీలు భర్తీ చేసి అర్హులకు నియామక పత్రాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.అయితే ఈ నియామకాల కంటే ముందుగా పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రతరం చేశాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, ఉన్నతాధికారులకు వినతులు కూడా సమర్పించాయి.

సీనియారిటీ జాబితాలు సిద్ధం

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)ల పరిధిలో దాదాపు వెయ్యి విద్యా సంస్థలున్నాయి. వీటి పరిధిలో 22వేలకుపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లలో సీనియర్లకు పదోన్నతులు కల్పించాలి. దీనికి సంబంధించి సొసైటీలు ఇప్పటికే సీనియారిటీ జాబితాలు సిద్ధం చేశాయి. ప్రభుత్వం అనుమతిస్తే రెండ్రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసే వీలుందని సొసైటీ అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే అన్ని కేటగిరీల్లో 3 వేల మందికి పదోన్నతులు దక్కుతాయి.

ఆలస్యమైతే.. అంతే

టీఆర్ఈఐఆర్‌బీ ద్వారా గురుకుల విద్యాసంస్థల్లో కొత్తగా 9వేల మంది ఉద్యోగులు చేరనుండగా, ఇప్పటికే గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ ఉద్యోగాలతోపాటు పీజీటీ కేటగిరీల్లో 2వేల మంది నియామక పత్రాలు అందుకున్నారు. మిగిలిన వారికి కూడా ఈ నెలాఖరులోగా నియామక పత్రాలు, ఆ తర్వాత పోస్టింగ్ ఇచ్చే అవకాశముంది. అయితే కొత్తవారికి నియామక పత్రాలు ఇవ్వగానే వారి సర్వీసు గణన ప్రారంభమవుతుంది. దీంతో అర్హత ఉండి పదోన్నతులు రాని వారంతా కొత్తగా నియమితులైన వారి కంటే జూనియర్లుగా ఉండిపోతారు. ఇలా పీజీటీ, జేఎల్, డీఎల్ కేటగిరీల్లోని సీనియర్ల సీనియారిటీ క్రమం తారుమారు అవుతుందని ఉద్యోగ సంఘాల నేతలు వాపోతున్నారు.

ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారు

చాలా కేటగిరీల్లోని టీచర్లకు పదోన్నతులు రాలేదు. ఇటీవల సీఎంతోపాటు సీఎస్, ఇతర ఉన్నతాధికారులను కలిసి పరిస్థితిని వివరించాం. వారు సానుకూలంగా స్పందించారు. నూతన నియామకాలకంటే ముందే పదోన్నతులు కల్పిస్తారనే నమ్మకం ఉంది.

– మామిడి నారాయణ, గురుకుల ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధి

సీనియర్లు నష్టపోతారు

కొత్త నియామకాల తర్వాత పదోన్నతుల ప్రక్రియ చేపడితే సీనియర్లు తీవ్రంగా నష్టపోతారు. తదుపరి పదోన్నతుల సమయంలో జూనియర్లుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. దాదాపు ఆరేళ్లుగా గురుకులాల్లో పదోన్నతులు నిర్వహించలేదు. పదేళ్ల నుంచి ఒకే స్థానంలో పనిచేస్తున్న టీచర్ల సంఖ్య పెద్దగానే ఉంది. నూతన నియామకాలకంటే ముందే పదోన్నతులు, బదిలీలు నిర్వహిస్తే ప్రస్తుతం పనిచేస్తున్నవారికి లాభదాయకం. – సీహెచ్.బాలరాజు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు



ఈశ్వరీబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో గీతారెడ్డి మంత్రులు పొంగులేటి, పొన్నం, జూపల్లి తదితరులు

రాజకీయాల్లో ఈశ్వరీబాయి ముద్ర

సీఎం రేవంత్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ, (హైదరాబాద్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన జె.ఈశ్వరీబాయి తనదైన ముద్రవేశారని, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈశ్వరీబాయి 33వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈశ్వరీబాయి పోరాట స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోజుల్లో మహిళలు రాజకీయంగా రాణించాలంటే ఎంతో కష్టమని, కానీ ఈశ్వరీబాయి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని కొనియాడారు. గీతారెడ్డి లాంటి సీనియర్ నాయకురాలు తాజా మంత్రివర్గంలో లేకపోవడం బాధాకరమని, ఏ అవకాశం ఉన్నా వారి కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు. అంతకుముందు ఈశ్వరీబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. ఈశ్వరీబాయి జీవితంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏపీ, తెలంగాణలో ట్రాన్సిషన్ కేర్ సెంటర్లు

ఇప్పటికే అందుబాటులోకి మాదాపూర్ ట్రాన్సిషన్ కేర్ సెంటర్

మరో 3 నెలల్లో విశాఖలో.. ఆరు నెలల్లో విజయవాడ, తిరుపతి, బెంగళూరుల్లో కూడా..

హెల్త్ ఆన్ అజ్ ఎండీ భరత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రోగులకు హెల్త్ ఆన్ అజ్ టెక్నాలజీ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో నెలకొల్పిన 28 పడకలతో అత్యవసర, వెంటిలేటర్‌తో చికిత్స గదులు, ఫిజియోథెరపీ స్టూడియో, ఔషధ–సర్జికల్ స్టోర్‌తో కూడిన ట్రాన్సిషన్ కేర్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు హెల్త్ ఆన్ అజ్ టెక్నాలజీ ఎండీ భరత్ రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. అన్ని రకాల శస్త్ర, ఐసీయూ చికిత్స అనంతర సేవలు ఈ సెంటర్స్‌లో లభిస్తాయని, వైద్య, ఫిజియోథెరపీ సేవలను 24 గంటలూ ఇంటి వద్దకే అందిస్తామని ఆయన తెలిపారు. ఇందుకోసం మొబైల్ యాప్ నుంచే బుక్ చేసుకోవచ్చని, ఇప్పటికే 300 మంది సిబ్బందిని నియమించుకున్నట్లు ఆయన వివరించారు. ఇక మరో మూడు నెలలో విశాఖపట్నంలో 20 పడకలతో ఏర్పాటవుతున్న ట్రాన్సిషన్ కేర్ సెంటర్ అందుబాటులోకి వస్తుందని, ఆరు నెలల్లో విజయవాడ, తిరుపతి, బెంగళూరులో కూడా ప్రారంభిస్తామని తెలిపారు. మూడేళ్లలో వీటి విస్తరణకు రూ.150 నుంచి 175 కోట్ల నిధులను సమీకరిస్తామని పేర్కొన్నారు.

ఆత్మవిశ్వాసమే విద్యార్థులకు అండ

బంజారాహిల్స్ (హైదరాబాద్): హాస్టల్ విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, చైతన్యమే కొండంత అండని ఎంసీఆర్ హెచ్ఆర్డీ డీజీ, తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్, షెడ్యూల్ కులాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.శ్రీధర్, కమిషనర్ రాహుల్ బొజ్జా అన్నారు. ఇటీవల సంక్షేమ గృహాలలో జరుగుతున్న వరస సంఘటనలపై డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్డీ ప్రాంగణంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల తీరుపై షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.శ్రీధర్ సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థుల విద్య, వైద్యం, ఆరోగ్య సమస్యల విషయంలో ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ బొజ్జా కోరారు. అడిషనల్ డైరెక్టర్ డి.ఉమాదేవి, జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి శిక్షణ తరగతులనుద్దేశించి సందేశం ఇచ్చారు. శిక్షణ తరగతుల కోర్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.కందుకూరి ఉషారాణి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ జి.పద్మజ, డాక్టర్ పి.స్వాతి, సైకాలజిస్ట్ సమత తదితరులు మానసిక ఒత్తిడి, నిద్రలేమి సమస్యలు, ఆత్మన్యూనత భావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.